ఆంధ్ర సచిత్ర వారపత్రిక



13-5-83

150 పైసలు


పాల నుంచి ఘన పదార్థాలకి
మీ పాప సులభంగా మారేలా చూడండి...
నెస్‌టమ్: సున్నితమైన మార్పుకోసం ప్రత్యేకంగా రూపొందించిన బేబీ సీరియల్


మీ పాపకి మీరు ఎంతో మంచి ఆహారం యివ్వాలనుకుంటారు. అందుకే మీరు పాపకి చనుపాలు యిస్తారు. మీరు ఇవ్వగలిగిన వాటిలో ఎంతో పోషకత్వం కలిగి, సులభంగా జీర్ణమయే ఆహారం అది.

పాపకి నాలుగు నెలలు నిండాక, పాప ఆహారంలో ఘన పదార్థాలు వుండాలి. కాని పాప జీర్ణం చేసుకునే విధానం యింకా సున్నితంగా వుంటుంది. అందుకే పాపకి సులభంగా జీర్ణమయే సీరియల్ కావాలి నెస్‌టమ్ వంటిది. ప్రత్యేకంగా రూపొందించినది కావటంతో మొదటగా ప్రవేశపెట్టే ఘన పదార్థంగా నెస్‌టమ్ సరియైనది. ఇది బియ్యంతో తయారు చేయబడింది. గ్లూటెన్ లేకపోవడం వలన దీనిని సులభంగా జీర్ణమయే సీరియల్‌గా పోషకాహార నిపుణులు అంగీకరించారు.

మీ పాప పోషకాహారానికి ఆధారంగా వుండె 11 విటమిన్లతోనూ, ఇనుము మరియు కాల్షియంతోనూ బలపరచబడినది కావడంతో నెస్‌టమ్ "కావాలి" అని పోషకాహారం విలువ తెలిసిన మీ వంటి తల్లులు అంటారు. విటమిన్లు పాప చర్మానికి మెరుపుని ఇస్తాయి. కళ్లలో కాంతులు తెస్తాయి. రోగ నిరోధక శక్తిని కలిగిస్తాయి. ఆరోగ్యవంతమైన రక్తం కోసం ఇనుము, దృఢమైన ఎముకలు, పండ్లకోసం కాల్షియం అవసరం.

పాప ఆహారంలో ఘన పదార్థాలు ప్రవేశ పెట్టడం ఎప్పుడూ సులభమైన పద్ధతి కాదు. కాని నెస్‌టమ్ పాలనుంచి ఘన పదార్థాలకి మార్పు సున్నితంగా వుండడానికి మీకు సహాయం చేస్తుంది






SAA/FSL/N/2671 TEL

ఇనుము మరియు
11 విటమిన్లతో
బలపరచబడింది

నెస్‌టమ్® రైస్

తయారు చేయడం సులభం



ముందుగ మరిగిన వెచ్చని పాలు పోయండి

నెస్‌టమ్ చేర్చండి కలపండి

తినిపించుటకు తయారు

NESTLÉ

ఉత్తరాలు

అగ్రతారా ?

8–4–83 ముఖచిత్రం చూడగానే ఒక అగ్రతార – అనుకొన్నాను. పేరు చూద్దును కదా ! నూతన తార.

వి. ఈశ్వరరావు, ఇతరులు (డ్యామ్)

దొంగల్లో దొరలు

ఈ వారం(15–4–83)మీరు ప్రచురించిన కథల్లో 'సమాధి' కథ కొంతవరకు 10–12–82 వారపత్రికలో 'ఉద్యోగం వచ్చిందమ్మా' కథను పోలిఉంది. ఆ కథలో భూషణం ఉద్యోగం రావాలని తన కాలు తీయించుకుని వికలాంగుడుగా ఉద్యోగం సంపాదిస్తాడు. ఈ కథలో మాలతి ఉద్యోగంకోసం చావడానికి సిద్ధంగాఉన్న కేన్సరు రోగిని పెళ్లాడి అనుకున్నట్లు విధవరాలై ఉద్యోగిని ఔతుంది.

ఇక 'జోగయ్య, బలి కోరిన ప్రేమ, ఓ ఇడియట్ కథ' ఈ కథల్లో క్రొత్తదనంలేదు. చివరి దశలో గొప్పవాళ్లను క్రిందివాళ్లే ఆదుకోవడం, అయినవాళ్లు కుట్రపన్ని చంపబోతే ఆ కుట్రకు పెంపుడు జంతువు అడ్డుపడి బలికావడం, అవమానించిన మగాడికి ఆడది బుద్ధిచెప్పడంలాంటి ఈ విషయాలమీద ఇదివరకే కథలు వచ్చాయి.

చందాలు భోంచేసే కొందరు పెద్ద మనుషుల గురించిన, స్వంత మరదలు నిజమైన ప్రేమను కాదని పరాయి ఆడపిల్ల ప్రేమకోసం ప్రాకులాడి చివరకు దగాపడిన మరో బావ గురించిన 'సన్మానం, పగుళ్లు' కథలుకూడ పాత ధోరణిలోనే ఉన్నా ఈ కథల ముగింపులు మాత్రం బాగున్నాయి.

పోతే 'దొంగల్లో దొరలు' కథ నిజంగా బాగుంది. సందేహంలేదు. దొంగల్లోకూడ మానవతావాదులుంటారు. అటువంటి మానవతావాదులైన దొంగలకు ఈ కథ 'ప్రశంసా పత్రం' లాంటిది.

శ్రీమతి పరాగిత్, రాయచోటి

ఓ ఇడియట్ కథ

'ఓ ఇడియట్ కథ'లో 61వ పేజీలో అంజి చెంప చెళ్ళుమనగానే చెంపపై కాంగ్రెస్ (ఐ) గుర్తు పడిపోయింది అని చెప్పడంకన్నా అయిదేళ్ళ వాతలు తేలాయి అనడం బాగుంటుంది.

చందు రమేష్‌బాబు (చదలవాడ)

న్యూఢిల్లీ లేఖ

మీ 25–3–83వ తేదీ పత్రికలోని డా. జయ్‌దుబాషీగారి న్యూఢిల్లీ లేఖ – గత మాసం 7 నుండి 12వ తేదీవరకు కొత్త ఢిల్లీలో జరిగిన అలీన దేశాల శిఖరాగ్ర మహాసభకు హాజరైన వివిధ దేశాల అధినేతలు ఆ వారం రోజులు ఐదు చుక్కల హోటళ్లలో గడిపిన విలాసమయ జీవితాలను గురించి క్లుప్తముగా వ్రాసినది – చాల గొప్పగాను, మన దేశంతోపాటు ఆయా బడుగు దేశాల ప్రజలకు కనువిప్పు కల్గించేదిగావుంది. మరి యిట్టి వ్రాతల్ని కనీసం మనదేశంలోనున్న ఆయా దేశాల రాయబార కార్యాలయాలయినా గమనిస్తాయో లేదో ?

చింతల లక్ష్మయ్య (పిడుగురాళ్ల)

*   *   *

25–3–83 సంచికలో శ్రీ అమ్జద్‌గారు, శ్రీ జయ్‌దుబాషిగారిని ఘరానా రచయితగా ఘాటుగ విమర్శించినారు. దుబాషిగారు అన్నమాట, ఉన్న మాటేగాని, లేని మాటగాదే ?

25–2–83 సంచికలో దుబాషిగారు 'ఆయన ముందు భారతీయుడు' అను శీర్షికలో పార్శీలు తాము ముందు భారతీయులు అని చెప్పుకుంటారు, కానీ సోదర ముస్లింలు భారతీయ మహమ్మదీయులు అని మాత్రం చెపుతుంటారు నేను భారతీయుడను, నా దేశం భారతదేశం అని సగర్వంగా చెప్పుకొనే ముస్లిం సోదరులు ఎంతమందో? ఈ లౌకిక రాజ్యంలో అన్ని మతాలకు సమాన ప్రతిపత్తి కలదు. ఒక మత వూరేగింపును ఆటంకపరుస్తూ తమ ప్రార్థనా మందిరం గౌరవం విలబెట్టుటకు వేరొక మతానికి నియమ నిబంధనలు, కట్టుబాట్లు ఏర్పరుచుట అల్ప సంఖ్యాకులు, అధిక సంఖ్యాకులపై పెత్తనం చెలాయించటం కాదా? దేశంలో మత కలహాలకు ఇదేకదా ముఖ్య కారణం. దుబాషిగారు వ్యాసం చక్కగా అర్థము చేసుకోవలయునని నా మనవి.

పదిలం వరదరాజులు (రాయచోటి.)

*   *   *

జయ్‌దుబాషిగారి 'న్యూఢిల్లీ లేఖ' 1.4.83 సంచికలో 'మనమూ–వాళ్లూ' లో నేటి సామాజిక పరిస్థితుల గురించి, శ్రీమతి గాంధి మనస్తత్వము గూర్చి చక్కగా వివరించారు. కొందరంటున్నట్లు వారు స్వేచ్ఛా కుటుంబమును దుయ్యబట్టడము లేదు. లోపాలు ఎవరిలోనున్నా విమర్శించవలసిందే ! 'వ్యక్తిగతం' శీర్షికగూడా మాకెంతో నచ్చింది.

ఐ. రమేష్‌రెడ్డి (తిరుపతి)

ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు :

దేశోద్ధారక కాశీనాథుని

నాగేశ్వరరావు పంతులుగారు

స్థాపితం : 1908

శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు :

[1938–1972]

శుక్రవారం : 13–5–'83

రుధిరోద్గారి నామ సం. వైశాఖ శు. పాడ్యమి

సంపుటము 75 సంచిక 37

సంపాదకుడు :

శివలెంక రాధాకృష్ణ

విడి ప్రతి వెల	రు.	1-50
ఆరు మాసాల చందా	రు.	42-90
పోస్టులో ఏడాది చందా	రు.	85 80

ఆంధ్రపత్రిక కార్యాలయము,

గాంధీనగరం. విజయవాడ-520 003.

విషయానుక్రమణిక

ముఖచిత్రం :

నటి శ్యామల


(ఫొటో : జి.కె. నరసింహం)

కథలు :

సీరియల్ నవలలు :

వ్యాసాలు, శీర్షికలు :

లోకం పోకడ * డోరిమెన్



ఎప్పుడూ వీరులే...

సోవియెట్ గూఢచారులు – అంటే సోవియెట్ రష్యా కోసం గూఢచారులుగా పని చేసేవారు – ప్రపంచం అంతటా ఈగల లాగ మరణిస్తున్నారు. డోనాల్డ్ మెక్లీన్ అనే ఒక మాజీ బ్రిటిషు దౌత్యాధికారి ఇటీవలే మాస్కోలో చనిపోయాడు. ఆయన సుమారు 30 సంవత్సరాల క్రితం రష్యాకి మారిపోయాడు. ఆయన మరణానికి విషాదం ప్రకటించిన వాళ్ళు ప్రావ్దా పత్రికలో ఇలాంటి మరణవార్తలు రాసేవాళ్ళే. వాళ్ళు మాత్రం మెక్లీన్‌కి "ఉన్నతమయిన నైతిక గుణాలు" ఉండేవన్నారు. దీని అర్థం ఏమిటో తెలీదు, ఈయన నేస్తం ఆంటోనీబ్లంట్ కూడా మెక్లీన్ మరణం అనంతరం వారం రోజులలో అస్తమించాడు. బ్లంట్ కూడా సోవియెట్ గూఢచారే. ఈ సంగతి చాలా రోజుల దాకా తెలీలేదు. బయట పడగానే మాత్రం ఆయనకి ఉన్న "సర్" బిరుదు వగయిరాలని తీసేశారు. మూడవ గూఢచారి కిమ్‌ఫిల్బీ ఇంకా జీవించే ఉన్నాడు. మాస్కోలో ఎలాగో రోజులు గడుపుకుంటున్నాడు. నాలుగవ గూఢచారి గయిబర్గెస్ ఒక మాస్కో సారాయి అంగడిలో తనువు చాలించాడు. తనే మరణించినాడో లేకపోతే ఎవరయినా చంపారో తెలీటం లేదు.

వీళ్ళందరూ రష్యా బంటులు. అంతేకాదు, అందరూ తోటి మగవాళ్లతో లైంగిక సంబంధాలకి అలవాటు పడినవాళ్ళే. అందరూ ఆక్స్‌ఫోర్డ్, కేంబ్రిడ్జి యూనివర్శిటీలలో ఒకదానిలో చదువుకున్నవాళ్ళే. బ్రిటిషు విశ్వవిద్యాలయాలలో గూఢచారులు, తోటి పురుషుల సంపర్కం కోరేవారూ బాగా ఉత్పత్తి చెందుతారనిపిస్తుంది. వీళ్లందరూ కమ్యూనిస్టులే ఎందుకు కావాలి? 1930 ప్రాంతంలో సోవియట్ రష్యా వయిపు ఉన్నవారిలో ఎక్కువమందికి ఈ గుణం ఉండేది. స్టీఫెన్ స్పెండర్,(కవి), రిచర్డ్ క్రాస్‌మాన్ (విల్సన్ మంత్రివర్గంలో సభ్యుడు), టామ్ డ్రిబెర్గ్ (లేబర్ పార్టీ ప్రముఖుడు, గయిబర్గెస్ మిత్రుడు) క్రిస్టోఫర్ ఇషర్‌వుడ్ (నవలా రచయిత, వేదాంతం మీద రాసేవాడు), ఇ.ఎమ్. ఫార్‌స్టర్ (రచయిత) – వాళ్లందరూ పురుష సంపర్కమంటేనే ఇష్టంగా ఉండేవాళ్ళు. సుప్రసిద్ధ ఆర్థిక శాస్త్రవేత్త కీన్స్ సయితం మగవారితో సంబంధాలు పెట్టుకున్నవాడే. వాళ్ళు జీవించి ఉన్న కాలంలో ఈ విషయాలు అంత బాగా తెలిసినవికావు. ఇటీవలి కాలంలోనే బయట పడుతున్నాయి. మగవారు మగవారి సంపర్కమే కోరటం, కమ్యూనిజమ్‌మీద విశ్వాసం అసాధారణ గుణాలు. ఆ మాటకొస్తే దేశద్రోహం కూడా అసాధారణమయినదేకదా? పడుపువృత్తికన్నా దారుణమయినది దేశద్రోహం అంటారు కొందరు.

ఈ గూఢచారులందరూ "పయి తరగతి" కుటుంబాలకి చెందినవాళ్లే (ఒక్క బర్గెస్ తప్ప.) అందరికీ మంచి పలుకుబడి కల వ్యక్తులతో బాంధవ్యమో, స్నేహమో ఉండేది. మెక్లీన్ తండ్రి ప్రపంచ యుద్ధానికి ముందు లిబరల్ పార్టీ ఏర్పరిచిన మంత్రివర్గంలో సభ్యుడు, ఫిల్బీ తండ్రి అరబ్బీ భాషలో మంచిపండితుడు,సౌదీఅరేబియా ప్రభుత్వానికి సలహాదారుడుగా ఉండేవాడు. మెక్లీన్ తాగుబోతు, ఫిల్బీ అబద్దాలకోరు. [దేశద్రోహులందరూ అబద్దాలకోరులే అనుకోండి. ఆక్స్‌ఫోర్డు కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయాలలో 1930 ప్రాంతంలో బ్రిటిషు కమ్యూనిస్టుల వంటి భారతీయ కమ్యూనిస్టులూ ఉండేవాళ్ళు. రజనీ పటేల్‌లూ, మోహనకుమార్ మంగళమ్‌లూ, కృష్ణమీనన్‌లూ (ఈయన లండన్ దాటి వెళ్లిన వ్యక్తి అనటానికి వీలులేదు) ఈ కోవకి చెందినవాళ్లే. శ్రీమతి గాంధీ కూడా కమ్యూనిస్టులంటే సానుభూతి కలవారే. ఆమె ఆ రోజులలో కేంబ్రిడ్జి లేదా ఆక్స్‌ఫోర్డ్‌లో ఉండేవారమని అంటారు కాని ఇది అతిశయోక్తి కావచ్చు. తమాషా ఏమిటంటే వీళ్లంతా తాము ఎప్పుడూ వీరులమనే అనుకునేవారు – కమ్యూనిస్టు పార్టీలో చేరినా వీరులే,

న్యూఢిల్లీ లేఖ



డా॥ జయదుబాషీ


దానిని వదులుకున్నా (ఇంకొకరి ఆదేశం మీద) వీరులే, కాంగ్రెసు పార్టీలో చేరినా వీరులే, కాంగ్రెసు పార్టీని వదులుకున్నా వీరులే. వాళ్లకి వీరులుగా ఉండటం ఒక అలవాటు. పి. ఎన్. హక్సార్ సంగతే తీసుకోండి: ఈయన అత్యవసర పరిస్థితి ముందు సంజయ్‌గాంధీని వ్యతిరేకించాడని ఆయన ఒక వీరుడన్నారు. అత్యవసర పరిస్థితిలో ఆయన నోరు మెదపలేదు కాబట్టే వీరుడన్నారు. ఎమర్జెన్సీ తర్వాత ఇంత కాలం నిలబడగలిగినందుకు వీరుడయిపోయాడు ఆయన చివరికి. (తన ఉద్యోగం వదులుకున్నాడా అంటే అదీ లేదు!) ఈ పిల్లులు ఎలాగపడినా కాళ్లమీదనే పడుతూ ఉంటారు. తల మీద జుట్టుకూడా చెరగదు.

ఒక సమాజం క్షీణించటానికీ, ఆ సమాజంలో దేశద్రోహాలు అధికం కావటానికి ఏమయినాసంబంధం ఉందా? 1930 ప్రాంతంలో బ్రిటిషు సామ్రాజ్యవాదం క్షీణిస్తోంది. నిరుద్యోగం, ప్రజాస్వామ్యం పట్ల అపనమ్మకం, ఆత్మ విశ్వాసం సడలిపోవటం- ఇవన్నీ 1930 ప్రాంతంలో అక్కడ బాగా బయట పడ్డాయి. పాలకవర్గంలో ఆత్మ విశ్వాసం సడలిపోతే ఎలాగ?? అది ఇంకేమి పాలకవర్గం?! ఈ వర్గానికి చెందినవాళ్లు తమమీద తమకే విశ్వాసం తగ్గి ఏ హిట్లర్ కాళ్లమీదో పడుతూ ఉంటారు ఛాంబర్లీన్ లాగ. ఇక మెక్లీన్, ఫిల్బీ, బర్గెస్, బెర్నార్డ్ షా, కీన్స్ లాంటివాళ్లు స్టాలిన్ కాళ్ల మీద పడేవాళ్లు. ఛాంబర్లీన్ ప్రధానమంత్రి, తక్కినవాళ్లు అంత ఉన్నతమయిన పదవిలో లేరు లేకపోతే మాత్రమేమి, దేశద్రోహులే కదా అయినా, వాళ్ళూ కూడా? గూఢచారులు మరింత భయపడిపోయి పూర్తిగా దేశద్రోహులయ్యారు. ఛాంబర్లీన్ హిట్లర్ ముందు సాష్టాంగపడ్డాడు. అసలు వీళ్లందరికీ నమ్మకాలా, సిద్ధాంతాలా? వాళ్లకి ఆత్మహత్య చేసుకోవటం ఒకటే తెలుసు, దేశద్రోహం ద్వారా దాన్ని సాధిద్దామనుకున్నారు. కొందరు స్టాలిన్ కాళ్లమీద పడితే (అమెరికా కొడుకులాగ) మరికొందరు హిట్లర్ పాదాక్రాంతులయ్యారు. వీళ్లందరూ విశ్వవిద్యాలయాలలో చదువుకున్నారు. అందుచేత తమ పిడివాదాలనీ, పిరికితనాన్నీ బాగా వివరించిచెప్పి సమర్థించుకోగలరు. తమని గురించీ, తమ దేవుళ్లని గురించీ కథలు అల్లగలిగారు. వాళ్లంతా చావకముందే మరణించిన పిరికిపందలు.

భారతదేశంలో ఇలాంటిది సాధ్యమా? అదృష్టవశాత్తు మనకి అత్యుత్తమ విశ్వవిద్యాలయాలు లేవు. అన్నీ రెండో రకానివే. కేంబ్రిడ్జి, ఆక్స్‌ఫోర్డు బదులు మగధ్, సాగర్ విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. మంచివిశ్వవిద్యాలయాలలో చదువుకునేవాళ్లకి ఒకరకం అహంకారం అలవాటవుతుంది. హత్య, దేశద్రోహం- ఇంకా ఏదయినా సరే ఫరవాలేదనుకుంటారు వాళ్ళు. ధర్మతేజనే తీసుకోండి. ఈయన అంతులే రకం అవినీతిపరుడు. సోషలిజమ్, జయప్రకాశనారాయణ, అణుశాస్త్రం వగయిరాలను గురించి గళాగ్రాహిగా మాటాడగలడు ఈయన. కొన్ని హోటళ్లలో అమ్మాయిలు నాట్యం చేస్తూ తమ దుస్తులని జారవిడిచినట్లే ఈయన తనకి తెలుసునన్న వారి పేర్లని జారవిడుస్తూ వుంటాడు. తీహార్ జెయిలులో ఆయన కొన్ని సంవత్సరాలు గడిపాడా? అవన్నీ ఆయన ఇంకా పయికి వెళ్లటానికి మెట్లలాంటివే కదా? ప్రతి సమాజానికీ ఆ సమాజం యొక్క నైతిక స్థాయికి తగినవాళ్లు దొరుకుతారు. మనకి అంతులేలూ, ధర్మతేజలూ దొరుకుతున్నారు. దేవుడిదయవల్ల మెక్లీన్‌లూ, ఫిల్బీలూ లేరనుకో వచ్చుకాని గుండెమీద చెయ్యివేసుకుని ఆ మాట అనగలమా? ★

మచ్చ

పాలగిరి వేణు



జె. జె, ఇండస్ట్రీస్ మెయిన్‌గేటుముందు ఆగింది ఆటో ... మీటరు ఛార్జీకన్న ఓ రూపాయి ఎక్కువిచ్చి ఆటోలోంచిదిగాను... మెయిన్‌గేటుకు ఆనుకునే సెక్యూరిటి ఆఫీసువుంది...

"ఎస్... ప్లీజ్..."

పర్సనల్‌ఫైల్లోంచి ఇంటర్వ్యూ లెటరుతీసి చూపించాను.

ఇంటర్వ్యూకు పిలవబడ్డ అభ్యర్థులజాబితాలో నా పేరుదగ్గర గుర్తుపెట్టాడు డ్యూటీ సెక్యూరిటీ ఇన్ ఛార్జ్.

నే నెక్కడకెళ్ళాల్సింది ... ఇంటర్వ్యూ ఎన్ని గంటలకు మొదలెట్టేది విశదీకరించాడు అతడు... 'ఎంట్రీపాస్' చేతికిస్తూ "విష్ యూ బెస్ట్ ఆఫ్ లక్" అంటూ నా కుడి అరచేతిని మృదువుగా, స్నేహపూర్వకంగా నొక్కాడు.. "థ్యాంక్స్" అంటూ అతడిదగ్గర శెలవు తీసుకున్నాను... ఫర్లాంగు దూరంలో కనపడుతోంది "అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్". అక్కడే నా యింటర్వ్యూ జరుగుతుంది. ఓ అరగంటతర్వాత... ముందుకునడిచాను.

ఇంతలో మెయిన్‌గేట్లోంచి ఓ నల్లటి అంబాసిడర్‌కారు రోడ్డుమీదకు దూకింది... సెక్యూరిటీ స్టాఫ్ సెల్యూట్‌చేశారు అతివినయంగా... కారులో వున్న అతడు హుందాగా తల ఆడిస్తూ డ్రైవ్ చేసుకుంటూ అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్‌వైపు దూసుకుపోబోయి... ఒక్కసారిగా బ్రేక్‌వేసి, కారును నా ప్రక్కగా ఆపాడు... "ప్లీజ్... గెటిన్..." అంటూ తలుపుతీశాడు... "థ్యాంక్యూ సార్..." అంటూ అతడిప్రక్కన కూచున్నాను ... "ఆర్ యూ అటెండింగ్ ది ఇంటర్వ్యూ ఫార్ అక్కౌంట్స్ ఆఫీసర్ పోస్ట్."

"యస్... సార్!"

"యూ ఆర్ ఫ్రం..." అతడి దృష్టంతా రోడ్డుమీదే వుంది.

"ఆంధ్రప్రదేశ్..."

"వెరీ గుడ్... మీ పేరు...?"

ఆశ్చర్యపోయాను... "సార్! మీరు..."

"తెలుగువాణ్ణే... మాది నెల్లూరు... మీ పేరు చెప్పలేదు."

"భార్గవ"

అతడేం మాట్లాడలేదు. నావైపు నిశితంగా చూశాడు... పార్కింగ్‌లో కారాపాడు ... కారుతలుపు తీసి మీరెళ్ళొచ్చు అనేలా మరోసారి చూశాడు. "థ్యాంక్స్..." అంటూ మరోసారి చెప్పి ముందుకు కదిలాను.

మనిషి ఎంతో రాజసం గావున్నాడు...ఆరడుగుల ఎత్తు ... తగ్గట్టే లావు ... అందంగా పెంచబడిన గడ్డం... అవును ఎంతో అందంగా వున్నాడు గొప్ప హోదాలో వున్నట్లుంది... కాని నొసటన కాల్చిన మచ్చ... అదే శ్యామలరావును గుర్తుకు తెస్తోంది. పాపం ఎక్కడున్నాడో? ఏమో??...

"ఎస్... మిస్టర్ ప్లీజ్ షో యువర్ సర్టిఫికెట్స్..."

సర్టిఫికెట్స్ అన్నీ చూపాను. ఇంటర్వ్యూ యింకో పది నిముషాల్లో మొదలవుతుందని చెప్పాడు పర్సనల్ ఆఫీసర్ నా సర్టిఫికెట్లను తిరగేస్తూ..

ఇంటర్వ్యూకు వచ్చినవాళ్ళము ఆరుగురం.. ఒక్కరేమో బీహార్‌నుండి, ముగ్గురేమో ఉత్తర్ ప్రదేశ్‌నుండి, ఇంకొకరు కేరళనుండి... అందరం పరిచయం చేసుకొన్నాం... చదువు అందరిదీ ఒక్కటే అయినా వయసు. అనుభవం ఎక్కువగా నాకే వున్నాయి. మానసికంగా సంతోషించాను. మొదటి రౌండ్ గెల్చానేమోననిపించింది.

ఏమిటో యీ వుద్యోగం ... స్వంత వూరికి కొన్ని వందల మైళ్ళ దూరంలో ... ఆప్తులను, ఆత్మీయులను వదలి...వచ్చే కొంత హెచ్చు జీతం రాళ్ళకోసం...కాదు...కాదు హోదా కోసం యిలా రావల్సి వచ్చింది ... నా దృష్టిలో హోదా ముందు అన్నీ దిగదుడుపే ... ప్రస్తుతం మా వూళ్ళోనే ఓ గ్లాసు ఫ్యాక్టరీలో అక్కౌంటెంటుగా పనిచేస్తున్నాను ... జీతం కూడ అన్నీ కలిపితే పదిహేను వందలు దాటుతోంది. అన్నివిధాల హాయిగా వున్న సంసార జీవితాన్ని గడుపుతున్నాను. స్వంత యిల్లు...పెద్దలు సంపాదించి పెట్టిన కొంత పొలం ... అన్నీ బాగానే వున్నాయి. కాని వుద్యోగరీత్యా నాకు తృప్తి లేదు. ఎనిమిదేళ్ళుగా అక్కౌంటెంటుగానే వుంటున్నాను. నాపైన చీఫ్ అక్కౌంటెంటు ... అతను రిటైర్డు అన్నాకావాలి ... లేకపోతే ధామ్మనైనా బక్కెట్టైనా తన్నేయాలి. అంతేగాని నేను చీఫ్ అక్కౌంటు అయ్యే అవకాశమే లేదు మరి ... చీఫ్ అక్కౌంటు మాంచి ఆరోగ్యంగా వున్నాడు...కాబట్టి యింకో పదేళ్ళదాకా ఆ మాటే ఎత్తడానికి వీల్లేదు. చేసిందే చేస్తూ, పాడిందే పాడుతూ...ఆడిందే ఆడుతూ...నో ఛేంజ్ ... ఎంత దూరమైనా ... ఎక్కడైనా...హోదాగ బ్రతకాలి...అంతేమరి... నా నిర్ణయానికి తగ్గట్టుగానే నేను చార్టెడ్ అక్కౌంట్‌సీ పూర్తిచేయడం జరిగింది...ఎప్పుడో పదేళ్ళక్రితం మొదలెట్టిన యీ కోర్సు యిప్పటికి అయింది ...

ఒకరోజున దినపత్రికలో చూశాను..."సీనియర్ అక్కౌంట్సు ఆఫీసర్సు" కావాలని జెజె ఇండస్ట్రీస్, లక్నో వారు ప్రకటన చేశారు ... జీతం రెండువేలు దాటుతుంది ... పెర్క్స్ కూడా బావున్నాయి .. అప్లైచేశాను ... ఇంటర్వ్యూకు రమ్మని 'కాల్' పంపారు జెజె ఇండస్ట్రీస్ వారు .. లక్నో కెళ్ళి వుద్యోగం చేయడం మా ఆవిడకు యిష్టం లేదు. బంధువులకు, ఆప్తులకు కూడాను. కంపెనీవాళ్ళు రాకపోకలకు ఫస్టుక్లాసు ఛార్జీలు యిస్తున్నారు. కాబట్టే అలా హుషారుగా లక్నో కెళ్ళి వస్తానని, ఇంటర్వ్యూలో సెలెక్ట్ అయితేగదా

వుద్యోగం వచ్చేది. అందులోకూడ జె కె ఇండస్ట్రీస్ వారికి హైదరాబాద్‌లో కూడ బ్యాటరీలు తయారు చేసే ఫ్యాక్టరీ ఒకటుందని, వుద్యోగమంటూ వస్తే హైదరాబాద్‌కి పోస్టు చేయాలని పట్టు పడ్తానని మావాళ్ళందరికి నచ్చచెప్పాను. హైదరాబాద్ అంటే మా ఆవిడకిష్టం. ప్రస్తుతం వాళ్ళ నాన్నగారు, అంటే మా మావగారు ఎక్సైజ్ సూపర్నెంటుగా హైదరాబాద్‌లో పనిచేస్తున్నారు. మరి... నేను సెలెక్టు అయినా, కాకపోయినా, నేను సి. ఏ. పాసయ్యాక ఇంటర్వ్యూ కెళ్ళడం మొదటసారి అనీను, అనుభవం వస్తుందనీను లక్నోకు రావటం జరిగింది

ఇంటర్వ్యూ మొదలయింది... మొదటగా కేరళ నుండి వచ్చిన నాయర్ ఇంటర్వ్యూ గదిలోని కెళ్ళాడు. మేమందరం సోఫాలో కూచుని, సెంటర్ స్ప్రెడ్ మీదున్న కొన్ని యింగ్లీషు మ్యాగ్‌జైన్స్ చూస్తూ కొంత 'రిఫ్రెష్' కాసాగాం... బీహారు నుండి వచ్చిన సిన్హా మాత్రం సోఫాకు ఓ మూలగా కూచుని, ఇంటర్వ్యూకు సంబంధించిన లావాటి టాక్సేషన్ పుస్తకాన్ని తిరగేస్తున్నాడు. ఇంటర్వ్యూ గురించి నాకేం భయంలేదు... ఎందుకంటే బ్రతకడానికి నాకూ ఏలాగూ వుంది వుద్యోగం... కాని మా ఆరుమందిలో నల్గురు మాత్రం ఇంకా నిరుద్యోగులే... నాయర్ మాత్రం అతిపెద్ద రబ్బరు ఫ్యాక్టరీలో అక్కౌంట్స్ అసిస్టెంటుగా ఎనిమిది వందల జీతం తెచ్చుకుంటున్నాడట... పది నిముషాలు గడిచాయి. ఇరవయ్యో నిముషం గడుస్తుండగా నాయర్ బయటకు వచ్చాడు. ముఖంలో కళ లేదు ఎందుకో బాగా "అప్‌సెట్" అయినట్లున్నాడు. సోఫాలో కూచుని, రెండు నిముషాలు కళ్ళు మూసుకున్నాడు.

ఇంతలో కాఫీ సర్వ్‌చేశారు. మా అందరికి... కాఫీ తాగాక నాయర్ కొంత స్థిమితపడ్డాడు... నాయర్‌చుట్టూ మూగాం అందరమూనూ.

"సబ్జక్ట్స్"మీద చాల లోతుగా వెళ్తున్నారు బాగా 'కన్‌ఫ్యూజ్' చేస్తున్నారు. నేను ఇంటర్వ్యూ సరిగా చేయలేదు... మరి నే వెళ్తా!... గుడ్‌లక్ ఫ్రెండ్స్ అంటూ నాయర్ మా అందరిదగ్గర శెలవు తీసుకున్నాడు.


'బెల్' మోగింది... ఇక నా వంతు


గదిలోనికెళ్ళాను ... ఎ. సి. రూం చల్లగా వుంది.

మెంబర్స్‌కు 'విష్' చేశాను... అందరికీ మధ్యలో వున్నాడు నాకు యిందాక కార్లో 'లిఫ్ట్' యిచ్చిన ఆంధ్రుడు... పాటించవలసిన సకల మర్యాదలను పాటించాను.., నా పేరు, నా వూరు, నా చదువు, నా అనుభవం గురించి అడిగారు.. అన్నీ పొల్లుపోకుండా చెప్పాను.

టాక్సేషను, ఇన్‌వెస్ట్‌మెంట్స్, ఇండియన్ లేబర్ ఎకానమీ గురించి ప్రశ్నలు అడిగారు... అంశంలో మరీ లోతుగా... నన్ను తికమక పెట్టబోయారు. నేను బాగా ప్రిపేరయి వెళ్ళటంవల్ల వాళ్ళ ప్రశ్నలకు సరియైన సమాధానాలు చెప్పాను.. ఉద్యోగం యిస్తే ఎన్ని రోజుల్లో చేరగలవని అడిగితే నెల రోజుల్లో అని చెప్పాను. వీలుంటే హైదరాబాద్‌లోగల తమ ఫ్యాక్టరీలో పోష్టింగ్స్ యిస్తే మంచిదని చెప్పాను... ఇంటర్వ్యూ మెంబర్లకు నా సమాధానాలు సంతృప్తి కల్గించినట్లు భావించాను. అందరిదగ్గర శెలవు తీసుకుని గదిలోంచి బయట పడ్డాను... మళ్ళీ నా చుట్టూ నలుగురూ ప్రశ్నలు చెప్పబోయేంతలో 'బెల్' మోగింది. ఈసారి సిన్హా వెళ్ళాడు. ఇంటర్వ్యూ గదిలోనికి... నా ఇంటర్వ్యూ గురించి మిగతావారికి చెప్పి అక్కణ్ణుంచి వచ్చేశాను.. మెయిన్‌గేట్‌దగ్గరే ఆటో దొరికింది... హోటల్ రూం చేరుకొని కొంతసేపు విశ్రాంతి తీసుకొని, అలా వూరుచూడ్డానికి వెళ్ళాను ... ఆ రోజు సాయంకాలమే రైల్లో మా వూరికి బయల్దేరాను..

నేను లక్నో నుండి వచ్చి అప్పుడే నెలరోజులయ్యాయి...ఇంతవరకు నాకు 'ఆర్డర్స్'రాలేదు.. కుతూహలమంతా చచ్చిపోయింది...'రొటీన్'గా పాత





వుద్యోగానికి అంటుకుపోయాను...వ్చ్... పాతజీవితం మామూలే!

''సార్ ! మీకు వుత్తరం వచ్చిందం''టూ ఆంజనేయులు ఒక పొడువాటి కవర్ని తెచ్చిచ్చాడు. జెజె కంపెనీ నుండి వచ్చిన కవరది ... కవర్లో పలుచగా వుంది...అంటే 'రిగ్రెట్'లెటరయ్యుండాలి మరి ... కవర్ని చింపాను...కుతూహలంగా చదివాను ...అది జెజె ఇండస్ట్రీస్ ఫైనాన్స్ మానేజర్ ఎస్. ఆర్. మంత్రి రాశాడు. ఉత్తరం అచ్చు తెలుగులో వుంది.

ప్రియమైన భార్గవగారికి,

మీరు ఇంటర్వ్యూ బాగా చేశారు ...కాని మీరు ఆంధ్రులు ... నేను కూడాను ... ఈ విషయం ఇంటర్వ్యూ మెంబర్లందరికీ తెలుసు ... అల్లాంటప్పుడు మీకు ఉద్యోగం యిస్తే ఆంధ్రుడు ఆంధ్రుడికే యిచ్చి పక్షపాతంగా వ్యవహరించాడని అనుకునే అవకాశం వుంది ... అందుకని ... క్షమించండి ... యీ వుద్యోగాన్ని సిన్హాకు యిచ్చాం ... దయచేసి నా నిర్ణయాన్ని అన్యథా భావించకండి ...

ఇట్లు

ఎస్. ఆర్. మంత్రి ...

నేను ఈ వుత్తరం చదివి ఆశ్చర్యపోలేదు ... నాకు బాగా తెలుసు యీ వుద్యోగం నా వరకు రాదని ... అయినా మొదట్లో కొంత కుతూహలం చూపించేనేతప్ప...నాకు వుద్యోగం యిచ్చి ఆంధ్రుడు ఆంధ్రుడికే సాయంచేసే అవకాశమే లేదక్కడ ... ఎస్. ఆర్. మంత్రి ... అంటే శ్యామలరావు ... మంత్రి యింటి పేరు ... నేను ఆరోజే గమనించాను...కార్లో నాకు లిఫ్ట్ యిచ్చిన ఆ పెద్దమనిషి శ్యామలరావని ... మా సంభాషణలో తను తెలుగు వాడినని చెప్పుకున్నా, భార్గవ అని నా పేరుచెప్పుకున్నపుడు, ముఖ కవళికల్నిపట్టి గ్రహించాను నన్నుకూడ తమగుర్తుపట్టినట్లు. ఆమాపుల్లోనేనంటేఅయిష్టత కూడ చోటుచేసుకుంది... కారణం చెప్పనా !... సరిగ్గా పదమూడుసంవత్సరాల క్రితం... తిరపతిలో నేను, శ్యామలరావు బి.కాం లో సహాధ్యాయులం, హాస్టల్లో ఒకేగదిలో వుండేవాళ్ళం... శ్యామలరావుకు చదువుతప్ప వేరేధ్యాస వుండేదికాదు... క్లాస్‌లో ఫస్టున వచ్చేవాడు... నేను పేకాటకు బానిసనయి పోయాను... కాలేజిఎగ్గొట్టి స్నేహితులతో పేకాట ఆడుతుండేవాణ్ణి... శ్యామలరావు ఆర్థికంగా బలహీనుడు... వాళ్ళనాన్న ప్లీడరుగుమస్తా... ఒక్కో

మచ్చ

సారి సకాలంలో డబ్బురాక, శ్యామలరావు హాస్టల్ బిల్ కట్టలేక, కాలేజీఫీజుకూడ కట్టలేక పోయేవాడు. ఫైనలియర్‌లో జరిగిన సంఘటన యీ కథకు ముగింపుకావచ్చు... మా రూంలో సుబ్బారెడ్డిఅని నెల్లూరురెడ్డి వుండేవాడు... ధనవంతుల గారాల బిడ్డ కావటంవల్ల, డబ్బు అతడిచేతిలో రెపరెపలాడేది... వందలకొలది నోట్లను ప్యాంటుజేబుల్లో, షర్టుజేబుల్లో పెట్టుకొని తిరిగేవాడు... ఆ రోజు నాకు బాగా గుర్తు... రాత్రి పదయ్యింది... సుబ్బారెడ్డి భోజనంచేసి పడుకుని నిద్రపోతున్నాడు... శ్యామలరావు చదువుకుంటూన్నాడు...కాని మనిషిలో అదోరకమైనమార్పు కనపడుతోంది... అప్పుడప్పుడు తన చూపంతా సుబ్బారెడ్డి వదిలినప్యాంటుమీద, షర్టుమీదే వుంది... మడతమంచంమీద పడుకొని, నిద్రరాక శ్యామలరావును గమనిస్తూనేవున్నాను... ఇంకోఅరగంట గడచింది... శ్యామలరావు మెల్లగా లేచాడు... సుబ్బారెడ్డి వైపు, నా వైపు చూశాడు... ఇద్దరం గాఢనిద్రలోవున్నట్లు నిర్ణయించుకొని, సుబ్బారెడ్డి ప్యాంటువైపు కదిలాడు. సుబ్బారెడ్డి ప్యాంటు జేబులో చేయి పెట్టాడు శ్యామలరావు.

''శ్యామలరావ్ !'' అంటూ సుబ్బారెడ్డి తన మంచంమీద నుంచి లేచి, వచ్చి శ్యామలరావు చేతిని గట్టిగాపట్టుకున్నాడు...ఆ కేకకు నేనుకూడ లేచాను. శ్యామలరావు వణికిపోతున్నాడు. కళ్ళల్లోంచి కన్నీళ్ళు కారుతున్నాయి... గట్టిగా ఏడుస్తున్నాడు శ్యామలరావు.

''ఎంత నీచమైన పనికి వడిగట్టావ్ శ్యామలరావూ !'' అంటూ నేను శ్యామలరావును ఛీదరించాను.

''నీకు డబ్బుకావాల్సివస్తే నన్ను అడగొచ్చుగా.. ఎందుకీ పనిచేశావ్ ?'' అంటూ సుబ్బారెడ్డి గదమాయించాడు శ్యామలరావును.

''చెప్పు... లేకపోతే అందర్నీ పిలవాల్సి వస్తుంది...''

''అప్పుడప్పుడు నా జేబుల్లో డబ్బు తగ్గుతూంటే ఏదో లెక్కతెలియక అనుకున్నాను... ఈ రోజు తెలిసింది నీ సంగతి...''


''లేదు... లేదు... ఈ రోజే మొదటిసారిగా తీయబోయాను ... అయినా దొరికిపోయాను... ఎందుకు తీశానో చెప్పమంటారా! చెప్తా వినండి.. నిన్నటినెల హాస్టలుబిల్లు కట్టలేకపోయాను... అందువల్ల హాస్టల్లోంచి నా పేరు కొట్టేశారు. 'మెస్'లో భోజనం పెట్టరు... నేను అన్నంతిని మూడు రోజులయింది. నా దగ్గర చిల్లిగవ్వకూడ లేదు. ఆకలితో చచ్చిపోతున్నాను... మీరిద్దరూ నా పాట్లు గమనించలేదు... నాక్కావలసింది ఒక్క రూపాయి మాత్రమే...ఓ అరడజను అరటిపళ్ళు తెచ్చుకొని కడుపు నింపుదామనుకొన్నాను... అంతేగాని వేరే వుద్దేశంలేదు సుబ్బారెడ్డీ! నన్ను క్షమించు...'' అంటూ సుబ్బారెడ్డి చేతుల్ని పట్టుకొని ఏడ్చేశాడు శ్యామలరావు.

సుబ్బారెడ్డి కరిగిపోయాడు.

''శ్యామలరావూ ! నీకు యిక ఏ కష్టాలు వుండవు...హాస్టలుకయే ఖర్చంతా నేను భరిస్తాను. పద... అలా బైటకు వెళ్ళొద్దాం'' అంటూ సుబ్బారెడ్డి శ్యామలరావును హోటల్‌కు తీసుకెళ్ళాడు... ఇది అప్పటి సంగతి...

ప్రస్తుతం అతను పెద్ద హోదాలో వున్నాడు అప్పటి స్థితిగతుల్ని మరచి, కొత్త జీవితానికి అలవాటుపడ్డాడు శ్యామలరావు. కష్టపడి చదివి హోదాను సంపాదించుకున్నాడు. అల్లాంటప్పుడు నన్ను తన కంపెనీలో వుద్యోగంలో చేర్చుకుంటే ఆనాటి సంఘటన పదే పదే గుర్తుకువచ్చి, మానసిక శాంతికి దూరమవడం మాత్రం నిజం... అందుకని నాకు వుద్యోగం యివ్వలేదు శ్యామలరావు... అదీగాక నేను పాత పరిచయాన్ని ముడిపెట్టుకొని, ఎలా ప్రవర్తిస్తానో అనే భయంకూడ శ్యామలరావుకు తప్పక కల్గివుండాలి.

కాని శ్యామలరావుకు, సుబ్బారెడ్డికి తెలియని సంగతి ఒకటుంది... పేకాటకు ఎప్పుడు డబ్బు తక్కువబడ్డా నేను సుబ్బారెడ్డి ప్యాంటులోంచిగాని షర్ట్‌లోంచిగాని సంగ్రహించాను. అది ఎవరూ కనిపెట్టలేకపోయారు. ఆ రోజు రాత్రికూడ అదే పరిస్థితి. రేపు పేకాట ఆడేందుకు డబ్బులేదు శ్యామలరావు ఎప్పుడు పడుకుంటాడోఅని దొంగనిద్ర నటించాను. కాని శ్యామలరావు దొరికిపోయాడు అదే నేను దొరికుంటే సుబ్బారెడ్డి నన్ను ఏం చేసేవాడు ? నా పరువు, ప్రతిష్టలు ఏమయ్యేవి...? అనుకుంటేనే భయంగావుంది నాకు. ఫ్యానుగాలికి శ్యామలరావురాసిన వుత్తరం ఎగిరిపోతూంటే, చిక్కించుకుని, ముక్కలు గాచించి, ''డస్ట్‌బిన్''లో వేశాను, ''ట్రయల్‌బాలన్స్'' వందల్లోతంతోంది మరి... ★



ఇల్లు చూడు!
ఇల్లాలిని చూడు!
ఇంటికి అందం- హుందాతనం!
ఇంటిలోని వారికి తెరచాటు వసతి!
ఇంటికి వచ్చేవారికి ఆకర్షణ!
సమశీతోష్ణ స్థితికి ఆధారం!
"మీ యింటి గుమ్మం చూసాక.. నేనెంత వెనకబడి వున్నానో అర్థమైంది. ఎక్కడ కొన్నావ్ అంత చక్కటి కర్టెన్స్?"
"ఇంకెక్కడ?... అందమైన కర్టెన్లు, బెడ్ షీట్స్, సోఫాకవర్స్, అన్ని రకాల ఫర్నిషింగ్స్ లభించే చోటు 'రూపమ్స్ గ్రాండ్ బజారే'"
రూపమ్స్ గ్రాండ్ బజార్
PHONE: 63272
ప్రకాశం రోడ్
(బీసెంట్ రోడ్ సెంటర్)
విజయవాడ -2.
EXPERT TAILORING SERVICE AVAILABLE FOR DOOR CURTAINS!
* హైదరాబాద్, మద్రాస్ రేట్లకన్నా అతి తక్కువ ధరలు!
Bachi



తల వెంట్రుకలు రాలుటకు కారణము పేలు
పేలను, ఈరులను నశింపజేయుటకు కెన్జ్ వాడండి. సువాసనతోకూడిన పేలనాశిని కెన్జ్ హెయిర్ ఆయిల్‌ను వాడి మీ కేశములను కాపాడుకొనండి.
కెన్జ్
పేలనాశిని మందు
దీనిలో ఈరులను నశింపజేయు బెన్జోకెయిన్ ఉన్నది.
నిర్భయముగా వాడుటకు వీలైనది.
KENZ
ANTI-LICE SOLUTION
PHARM PRODUCTS
ఫార్మ్ ప్రోడక్ట్స్
తంజావూరు-613 007 తమిళనాడు
అన్ని జిల్లాలకు డిస్ట్రిబ్యూటర్లు కావలెను.
Chhaya/PP/222

వ్యక్తిగతం



జనరల్ చవుదరి తమ 75వ ఏట గుండెపోటు వచ్చి న్యూఢిల్లీలో మరణించారు. ఆయన భారత దేశం సైన్యానికి అధిపతిగా ఉన్నారు కెనెడాలో హై కమిషనరుగా పనిచేశారు. హైదరాబాద్ రాష్ట్రాన్ని దేశంలో కలపటానికి తోడుపడిన వారిలో ఒకరు ...



కే.శే.ధరమ్‌సే మూలరాజ ఖటావ్ సుప్రసిద్ధ పారిశ్రామిక నేత. చీరల ప్రకటనల ద్వారా ఆయన పేరు కల సంస్థ ప్రసిద్ధికి ఎక్కినప్పటికీ ఆయన భారత దేశంలో సిమెంటు, నౌక, రసాయనాల పరిశ్రమల అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. అంతేకాదు, ఆయన భారతీయ విద్యాభవన్ వంటి సాంస్కృతిక సంస్థల కోసం కూడా కృషిచేశారు. 82 వయస్సులో ఆయన ఇటీవలే బొంబాయిలో మరణించారు ...



ఆంతోనీబ్లంట్ పేరు ఇటీవల కొంతకాలం కిందనే వార్తలలో ప్రముఖంగా కనిపించింది. ఆయన సోవియెట్ యూనియన్ యొక్క గూఢచారిగా బ్రిటన్‌లో పనిచేసేవారన్న విషయానికి మంచి ప్రచారం లభించింది. ఎందుకో గాని ఆంతోనీబ్లంట్‌కి "సర్" బిరుదు వగయిరా మాత్రమే పోయాయి. అంతకన్నా పెద్ద శిక్ష పడలేదు ఆయనకి. బహుశా ఆయన బ్రిటిషు ప్రభుత్వం వారికి కొన్ని విశేషాలు చెప్పారేమో! ఆంతోనీబ్లంట్ కొన్నిరోజుల కింద మరణించారు ...

వారఫలం

13-5-1983 శుక్రవారం మొదలు 19-5-1983 గురువారం వరకు

♈ మేషం: ధన లబ్ధికి, ఉద్యోగ ప్రాప్తికి, గృహ నిర్మాణ కార్య క్రమం చేపట్టుటకు అవకాశ మున్నది. వ్యాపారం యథా తథంగా జరుగుతుంది. అధికారం బాగా చెలాయించ వలసిన అవసరమున్నది. స్త్రీలకు: కళా సాహిత్య రంగాలలో సదవకాశాలు లభిస్తాయి.

♉ వృషభం: అధికారం అభివృద్ధి చెందే మార్గ మున్నది. ఇటీవల మానశికంగా భరించిన ఆవేదన ముఖ్యంగా కుటుంబ సంబంధ మయింది క్రమంగా ఈ వారం తగ్గే మార్గ మున్నది. రచనా విధానంలో, రంగస్థల వ్యవహారాలలో, చిత్రసీమలో చాలమందికి రాణింపు చేకూరుతుంది. స్త్రీలకు: సదవకాశాలు నాల్గు విధాలా చేకూరుతాయి.

♊ మిథునం: వాహనం కొనుగోలు చేయ గల సామర్థ్యం, అవకాశం కొందరకు, నాట్య నాటక పరిచయం తో లబ్ధి పొందటం కొందర విషయంలో, చాల కాలంగా రాక నిలచిన అప్పులు వసూలయ్యే మార్గ మున్నది. స్త్రీలకు: వస్త్ర వాహనాలు సమ కూర్చుకోవటం, నూతనోద్యోగావకాశాలుంటాయి.

♋ కర్కాటకం: దూర ప్రయాణాలకు సదవకాశం లభిస్తుంది. దైవ కార్యానుకూలత కొందర విషయంలో చెప్ప వచ్చు. అనుకోకుండా బంధు మిత్రాదులు యింటికి రాగలుగుదురు. వ్యాపారంలో వెనక ముందులు ఆలోచించ వలసిన పరిస్థితులు ఏర్పడుతాయి. స్త్రీలకు: గృహ సంబంధంగా ఘటిల్లించిన చికాకులు తొలగే అవకాశాలున్నాయి.

♌ సింహం: గమనించండి, మీ యాలోచనలు ఫలవంతం కావటం, కించిత్తు ఆదాయం లభించటం, కళా రంగంలో ప్రతిభ రాణించటం, చిత్ర సీమలో సదవకాశాలు లభించటం గమనిస్తారు. వ్యాపారానికి కూడా పెద్దగా యిబ్బంది చెప్ప వీలులేదు. స్త్రీలకు: వృత్తి ఉద్యోగాలు సుకరంగా సాగిపోవటానికి, నూతనాంశాలు గ్రహించుటకు అవకాశ మున్నది.

♍ కన్య: స్థితి గతులందు స్వల్ప మార్పు లుంటాయి. అధికారం కూడా క్రమాభివృద్ధి నందే అవకాశ మున్నది. పోయింది పోగా నూతనోద్యోగ ప్రయత్నాలు ఫలవంతం కాగలవు. అధికారులను ముఖ్యంగా వ్యాపారోద్యోగ విషయాలలో గమనించాలి. స్త్రీలకు: ఉద్యోగ మార్పులు, ఆదాయం, అధికార వృద్ధి చెప్ప దగిన వారం.

♎ తుల: రాశి యందు స్థితమైన 'శని' గ్రహం వలన మీకు అధిక లాభ దాయకం, అధిక వ్యయం లేనిపోని నిందల పాలయ్యే వ్యవహారా లుండటం, ఏ పని చేసినా తొందర పాటే కనిపిస్తుంది కూడ. స్త్రీలకు: శాంతం ఓర్మి, చాకచక్యం ఆలోచనా పాటవం అవసర మైన వారం గ్రహించాలి.

♏ వృశ్చికం: పనిపాటలు చేసే వారినిగాని, జాయింటు వ్యాపారం చేసే భాగస్థులను గాని ఒక కంట కనిపెట్ట వలసిన సమయం. దూర ప్రయాణాలు చేసే అవకాశాలు కూడా కొందర విషయంలో చెప్ప వీలున్నది స్త్రీలకు: సభలు సత్కారాలు పారితోషికాలు అందు కొనే అవకాశా లుంటాయి.


♐ ధనుస్సు: ఆదాయ మందు, అధికార మందు, అవకాశ ములందు, గతకాలానికన్నా మిన్నగా ఈవారం కనిపిస్తుంది. ఏవో విలువగల వస్తువులు సేకరింప నున్నారు. దైవ కార్యాచరణకు అవకాశ మున్నది. తద్వారా అధికంగా ధనం వ్యయం చేయ వలసి యున్నది. స్త్రీలకు: శుభ కార్య ప్రస్తావనలు, తర్జనభర్జనలతో కాలం వ్యయ మవుతుంది.

♑ మకరం: చాలమంది దూర ప్రాంతాలకు ప్రయాణించే అవకాశం ఉన్నది. వసూలు కాక నిలచిన అప్పులు చేతికి అందే మార్గ మున్నది. మీ ప్రయత్నాలు సాగి పోనున్నవి. వ్యాపార నిమిత్తం శ్రమకర మైన వారంగా గ్రహింప గలరు. స్త్రీలకు: నూతనాంశాలు గ్రహించటం, ఉద్యోగ వృత్తులు సుకరంగా ఉన్నాయని తెలిసికోవటం జరుగుతుంది.

♒ కుంభం: మాటల చాకచక్యం వలన నిజాయితీ వలన ఒకానొక విషయంలో రాణించ నున్నారు. మిత్ర సహాయం సమకూడే అవకాశ మున్నది. స్థిర చరాస్తులు అభివృద్ధి చెందే మార్గమున్నది. స్త్రీలకు: బదిలీలు ఉద్యోగ మందు చెప్పదగిన సమయం. అభివృద్ధి గల వారమే.

♓ మీనం: 'అధికార మున్నది గదా' అని దుర్వినియోగం చేయకండి, ఆదాయం వృద్ధి నందు చున్నది గదా! అని వృధా ఖర్చులు చేయకండి. మొగమాటాలకుపోయి యితరులకు ధనం యివ్వటం పెట్టుకోకండి వ్యాపారం బాగానే ఉంటుంది. స్త్రీలకు: వస్తువులు సేకరించు కొనుటకు, నూతన వృత్తియందు ప్రావీణ్యత సాధించుటకు అనుకూల వారం, గ్రహించండి.

— విద్వాన్ కోట సత్యరంగయ్య శాస్త్రి ★


వేడి మీ శక్తిని పిండి
పిల్చేస్తున్నప్పుడు...
ఇది మీరు
నమ్మిన
గ్లాక్సోజ్-డి
యొక్క
కొత్త పేరు
గ్లూకోన్-డి ® తీసుకోండి
అదనపు శక్తి కోసం—అలా మీకు కావలసినప్పుడల్లా.
అలసట కలిగించడంలో వేడిని మించిందిలేదు. అలా వేడి వాతావరణంలో పనిచేస్తున్నప్పుడు అలసట, దాంతో పాటే నీరసం వచ్చేస్తుంది. అప్పుడే మీకు కావాలి ఉత్సాహాన్నిచ్చే, చల్లదనాన్నిచ్చే గ్లూకోన్-డి. అది మీకు అదనపు శక్తిని ఇస్తుంది. అలా మీకు కావలసినప్పుడు.
గ్లూకోన్-డి, లక్షలాది మంది 30 ఏళ్ళుగా విశ్వసిస్తూ వస్తున్న గ్లాక్సోజ్-డికి కొత్త పేరు. పళ్ళరసం, పాలు, టీ, కాఫీ, నీళ్ళు—దేనిలోనైన అలా దాన్ని కలుపుకు తాగండి లేక దేనితో కలపకుండా అలాగే తాగండి. శక్తి అలా ఉరకలు వేస్తూవచ్చే అనుభూతిని పొందండి.
గ్లూకోన్-డి మీ కుటుంబంలో నివారందరి కోసం. పనుల్లోనూ, ఆటల్లోను వారికి చురుకుదనం కోసం. గ్లూకోన్-డి—అందరికీ పరిచయమున్న అదే పచ్చ ప్యాక్‌లో వస్తుంది.
Glucon-D®
Glucose-D
Glucon-D®
Glucose D
Glucon-D®
Glucose-D
విటమిన్ డి, కాల్షియం ఫాస్ఫేట్‌తో బలపరచబడిన
అసలైన గ్లూకోజ్ పౌడర్—గ్లాక్సో సమర్పణ
HTB-GLL-6737-TG

లల్లాదేవి

సీరియల్

తిరుచరణాలు

ఇక్కడ తోటలో రసాల వృక్షచ్ఛాయలో ఆసీనులై వున్న కృష్ణస్వామికి వెంకన్నదొరతో జరిగిన సంభాషణ మొత్తం అక్షరం పొల్లుపోకుండా వినిపించాడు నారాయణ.

ఆయన అంతా విని సాలోచనగా తల ఊగించారు. ఇక రెండు నెలలకు జైనసభ జరుగబోతున్నది. జైనాచార్యుడే స్వయంగా దీన్ని సంకల్పించాడు. ఇప్పుడు జైనులు దుర్గమారణ్యాల్లో నినేలమాళిగల్లోనూ, పర్వత గుహల్లోనూ రహస్యంగా పొట్టపోసుకుంటున్నారు. వారందరినీ ఒక త్రాటి క్రిందకు లాగటమే ఈ సభకు ఉద్యాపన కాబోలు. ఆ సభలకు వెంకన్నదొర నిర్వాహకుడు కానున్నాడు. కాకతీయ ప్రభువులకు వ్యతిరేకంగా ప్రచ్ఛన్న వేషంలో పనిచేస్తూ వచ్చిన వెంకన్నదొర యికనుండీ ప్రత్యక్ష చర్యలకు దిగనున్నాడు. అదీ దీని పర్యవసానం.

మొగిలిచర్లలో జైనాచార్యుని సభలు జరగటమంటే మాటలు కాదు. వీరశైవులలో ఉద్దండులయిన పశుపతీ, మహాదేవుడూ వున్నారు. వేద వేదాంగాల్లో వారు నిష్ణాతులు. అసంఖ్యాకమయిన శిష్య పరంపర కలవాళ్ళు. వాళ్ళ పిలుపువింటే వేలాది వీరశైవులు ప్రాణాపాయాలను సైతం లెక్కచేయక విరుచుకు పడతారు. వారి శక్తి అనన్య సామాన్యం.

జైనులు జైనానుయాయులు భిల్లపోరాటంలో నిపుణులు. ఇక పోరాటమంటూ సంభవిస్తే అది ఒక్క మొగిలిచర్లకే పరిమితమై ఉండదు. అది రాజకీయాల స్థాయిలో రూపును అమర్చుకుంటుంది. ఆ తరువాత విజయం ఎవరి సొత్తయినా జరిగే ప్రాణనష్టం భరించరానిది. ఈ పరిస్థితిని గ్రామానికి పెదకాపుతనం వెలిగిస్తున్న వెంకన్నదొర కావాలని కల్పించటం కృష్ణస్వామికి బాధనిపించింది. హైందవ సాంప్రదాయం మన జీవవాహిని గంగానదిలా కొన్నివేల సంవత్సరాల నుండి అడ్డుగా నిలిచిన కొండల్ని సైతం చీల్చుకుని ప్రవహించింది. హైందవమనే జీవనదికి గమనవేగం అప్రతిహతమైనది. దానిని ఎదుర్కొన్న ఏ శక్తీ నిలువలేదు. అందుకు కారణం హైందవం సత్యాన్ని గుర్తించింది. సత్యాన్ని సంభావించింది. సత్యాన్ని తనలో పొదువుకున్నది. ఇప్పుడీ చిన్న చిన్న అడ్డంకులు దాని గమనాన్ని మార్చలేవు. కాని అమాయకులైన కొంతమంది ప్రాణాలు బలైపోతాయని కృష్ణస్వామి హృదయం బాధతో మూలిగింది.

(గతసంచిక తరువాయి)

ఆ గ్రామానికి హరిజనులు వేయిమందివరకూ వున్నారు. వాళ్ళకి నారాయణ మాటలమీద గురి. కృష్ణస్వామిమీద గురుభక్తి. జైనాచార్యుడు నడపబోయే సభలకు హరిజనుల మద్దతు తప్పనిసరిగా అవసరమౌతుంది. కనుక వెంకన్నదొర యిప్పటి నుండే పాచికలాడటం ప్రారంభించాడు. ఆయన దృష్టి కృష్ణస్వామిమీద కూడ తప్పక పడితీరుతుంది. ఆ విషయం కృష్ణస్వామి తక్షణమే ఊహించారు. ఎందుకంటే జైనాచార్యునిమీద జరుపుతున్న పోరాటంలో ప్రముఖ పాత్ర వీరశైవులదే అయినా అందుకు వైష్ణవుల మద్దతూ వుంది. వారు వీరు అని ఏముంది. హైందవ రక్తం ఉప్పొంగింది. వీరశైవంలో పశుపతీ, మహాదేవుడూ కొండలవంటివారు. హరిజనులు, మరి కొందరు వైష్ణవులకు కృష్ణస్వామి గురువు. వీరంతా సంయుక్తంగానే జైనాచార్యునిపై పోరాడుతారు. కాబట్టి వీరందరినీ ఒకకంట కనిపెట్టి వుండటం వెంకన్నదొర పని.

పరిస్థితులు అగాధంలోకి పోతున్నాయని కృష్ణస్వామికి అనిపించసాగింది. ఆయన మనోవేదన వర్ణనాతీతం.

గణపతిదేవుని తరువాత రుద్రమ్మ ఆంధ్ర దేశానికి రాజ్ఞి. ఆమెకు ప్రబల విరోధులు ముగ్గురు. వారిలో సూత్రధారుడు జైనాచార్యుడు. పార్శ్వకుడు ప్రతాపదేవుడు. అసలు కథానాయకుడు పాండ్యరాజు. ఆమె అనుయాయులుగా కూడ ముగ్గురు శక్తివంతులున్నారు. వారిలో మొదటివాడు శివదేవయ్య మహామంత్రి. జన్నగదేవమహారాజు మహాసేనాని. భృత్యులలో ముఖ్యుడు ప్రసాదాదిత్యుడు. ఈ ముగ్గురుకాక కుమారదేవుడు, త్రిపురాంతకుడు మొదలైన మహామహులున్నారు. కృష్ణస్వామి రాజకీయములనుండి ఎప్పుడో నిష్క్రమించి ఆశ్రమవాసి అయ్యారు.

జరిగిన కథ–2 : రుద్రాంబ, గణపతిదేవుల పరిపాలనా కాలంలో వెంకన్నదొర దగ్గర తన ఇద్దరి బిడ్డలతో వెట్టిచాకిరీ చేస్తుంటాడు హరిజనుడు నారాయణ. అతను కృష్ణస్వామి భక్తుడు. ఏకవీర కృష్ణస్వామి ఆశ్రమంలో పెరిగి పెద్దదవుతుంది. శ్రీదేవుడనే శిల్పి శ్రీ వెంకటేశ్వరుని మూర్తిని చెక్కుతాడు. ఏకవీర స్వామిని ఆరాధిస్తుంది. ఆమె శ్రీదేవుడిని ఒక చిన్న స్వామి రూపును చెక్కివ్వమని కోరుతుంది.

రాజ్యములో కలకలము తారస్థాయికి అందుకున్నది. జైనాచార్యుడు పాండ్యరాజు, ప్రతాపదేవుడు, దేవగిరి ప్రభువుల మద్దతులో యింకా శక్తివంతుడుగాక ఉన్నాడు. సాధారణముగా హిందూ జైన మతముల మధ్య కొందరు దుండగులవల్ల ఏర్పడిన అగాధము గణపతిదేవుని ప్రమేయములో రాజకీయ రూపమును సంతరించుకున్నది. ఇది హిందూ ధర్మ విరుద్ధము. హిందూ ధర్మము సువిశాలమైన హృదయములో చేసిన ఆలోచన. మత వైషమ్యము దానికి గిట్టని గుణము. కాని జరగకూడనిది జరిగినది. రాదగని పరిస్థితి వచ్చినది. ఇప్పుడు ఆంధ్ర సామ్రాజ్యమునకు ప్రతిష్ఠ సమయము. ఇప్పుడు హిందూధర్మము తన ఉనికిని తేల్చుకోవలసిన అవసరము ఏర్పడినది. తన విశాల బుద్ధిని, మత సామరస్యమును చూపవలసిన సమయము ఆసన్నమయినది. కాని యీ విషయాలను పట్టించుకొనువారెవరు. ఎవరికివారే యుద్ధ సన్నద్ధులవుతున్నారు.

నారాయణ కృష్ణస్వామివద్ద శలవు తీసుకుని వెళ్ళిపోయేందుకు సిద్ధమయ్యాడు. కృష్ణస్వామి ఆసీనులయ్యే ఉన్నారు.

అంతలో ఏకవీరాదేవి ఆలయం ముందుగా ఒక సైంధవం పరుగెడుతూ రావటం కనిపించింది నారాయణ ఆగిపోయాడు. ఆ అశ్వంమీద ఉన్న సమున్నత శరీరుడైన యువకుడు ఆంధ్రత్వం ఉట్టిపడే ముఖంతో ఉన్నాడు. గుర్రపు దౌడువల్ల ఉత్కోషం అందంగా ఎగిరి పడుతున్నది.

అతడు ఆశ్రమ ముఖద్వారంవద్ద అశ్వాన్ని ఆపి చెంగున ముందుకి దూకాడు. పెద్ద పెద్ద అంగలతో లోపలకువచ్చి కృష్ణస్వామిముందు మోకరిల్లి లేచాడు.

"ఎవరు నాయనా నువ్వు."

"నా పేరు త్రిపురాంతకుడు. ఏకశిలానగరం నుండి వచ్చాను. రాజదూతను" అన్నాడు తనను ఎరుకపరచుకుంటూ.

"అలాగా! సంతోషం నాయనా! రాచనగరంలో అందరూ కుశలమేనా! రుద్రాంబకు కుశలమేకదా! రుయ్యమ్మ – ఉమ్మక్క (రుద్రాంబ కుమార్తెలు) సౌఖ్యమేకదూ! మహామంత్రి శివదేవయ్యగారు బాగా ఉన్నారా? ఆరోగ్యంగా తిరుగుతున్నారా? మహాసేనాని జన్నిగదేవ మహారాజు నగరులో ఉన్నారు కదా! ప్రసాదాదిత్యుడు, కుమారదేవుడు ఎలా ఉన్నారు ఏదైనా సందేశం తెచ్చావా?" అంటూ పేరు పేరున వివరాలన్నీ అడిగారు కృష్ణస్వామి. ఉన్న

త్రిపురాంతకుడు తన వస్త్రంలో దాచిన ఒక లేఖను తీసి కృష్ణస్వామిచేతికి అందించాడు. దానిని చూడగానే ఆయన ముఖం ప్రశ్నార్థకంగా ముడి పడింది. వడివడిగా పత్రాన్ని విప్పారు. అందులో ఏవో రహస్యాలను ఆయన ప్రశాంతంగా చదివారు



ప్రశ్నలకూ పేరు పేరున సమాధానాలు యిస్తూ.

"అవునుస్వామి శివదేవయ్యగారు కబురు పంపారు" అన్నాడు. త్రిపురాంతకుడు సాలోచనగా నారాయణకేసి చూస్తూ.

కృష్ణస్వామి చిరునవ్వు నవ్వి "హరిజనుడయ్యా! పేరు నారాయణ. ఆంధ్ర భృత్యుడే. అనుమానించవలసిన పనిలేదు అన్నారు. త్రిపురాంతకుడుకూడ చిరునవ్వు నవ్వుతూ "అనుమానించటం నా వృత్తి కద! నన్ను క్షమించండి" అన్నాడు. అతడు ఆంధ్ర ప్రభుత్వానికి శక్తివంతుడైన గూఢచారి. ఆ విషయం కృష్ణస్వామికి ముందే తెలుసు. అందుకే అలా ప్రశ్నించారు.

గమనిక

గేయాలు పంపేవారు వాటితో తపాలా కార్డు జత పరచవలసి వుంటుంది. గేయాలు త్రిప్పి పంపబడవు. గేయాలు, కవితలు సాధ్యమైనంత క్లుప్తంగా వుండటం మంచిది. —సం.

తిరుచరణాలు

ఆ తరువాత దాన్ని చించి ముక్కలుచేసి భూస్థాపితం చేశారు.

త్రిపురాంతకుడు వెంటనే ప్రయాణమై వెళ్ళిపోయాడు. నారాయణ కూడా వెళ్ళిపోవటానికి ఉద్యుక్తుడయ్యాడు. కృష్ణస్వామి అతనిని కూర్చొనమని ఆదేశించారు.

''నాయనా! నారాయణా! నీవొక పనిచేయాలి.''

''ఆజ్ఞాపించండి.''

''నూరు మంది యువకులు అంతో యింతో సాముగరిడీలు నేర్చిన వారు కావాలి మనవారందుకు సిద్ధమేనా!''

''సిద్ధమే'' అన్నాడు నారాయణ.

''అయితే నీవు వెళ్ళి తక్షణమే వారిని పంపు'' అన్నారు కృష్ణస్వామి.

నారాయణ ఎందుకని ప్రశ్నించలేదు వెంటనే హరిజనులంతా వుండే వీధికి వెళ్ళాడు. అందరినీ క్షణాలమీద సమావేశ పరచి కృష్ణస్వామి ఆదేశాన్ని వినిపించాడు.

హరిజన యువకులు సాముగరిడీలలో ఆరితేరిన వారు. వారిలో మంచి బలిష్టులు నూరు మందిని ఎంపిక చేసి కృష్ణస్వామి వద్దకు పంపారు. వారంతా వచ్చే వరకూ కృష్ణస్వామి మామిడి చెట్టు క్రింది వున్న రాతి తిన్నెపై కూర్చుని ఎదురుచూస్తున్నారు అప్పటికి ప్రొద్దు బాగా వాలిపోయింది.

వారంతా కృష్ణస్వామి ఎదురుగా చేతులు కట్టుకుని నిలిచారు.

కృష్ణస్వామి వారిని ఉద్దేశించి యిలా ప్రసంగించారు.

''నాయనా! హిందూధర్మం అప్రతిహతమైన జీవనదీ ప్రవాహం వంటిది. దాని ఉనికిని ఎవరూ మార్చలేరు. గమ్యాన్ని ఏమార్చలేరు. అయితే దానిని మనం నిరూపించుకోవలసిన సమయం ఆసన్నమయింది. మీలో ఎవరికయినా నా మాటలు రుచించక పోతే, ప్రాణాలను పణంగాపెట్టి అయినా మన ధర్మాన్ని కాపాడుకోవాలన్న పట్టుదల లేకపోతే వారు వెళ్ళిపోవచ్చును. బలవంతం ఏమీ లేదు. మీకు యిష్టంలేని పనిని చేయమని నేను కోరను.''

అందరూ మౌనంగా విన్నారు. ఎవరూ వెళ్ళిపోతామని ముందుకు రాలేదు. కృష్ణస్వామి మరి కొంత గడువిచ్చాడు. ఎవరూ ముందుకు రాలేదు వస్తారన్న సూచన కూడ లేదు.

కృష్ణస్వామికి వారిమీద పరిపూర్ణ విశ్వాసం ఏర్పడింది. వారిని పది పదిమంది చొప్పున పది పటాలాలుగా విభజించారు. ఒక్కొక్క పటాలాన్ని దగ్గరకు పిలిచి రహస్యంగా ఏదో చెప్పారు. ఆ మాటలు వింటున్నప్పుడు ఆ యువకుల ముఖాలు పౌరుషంతో ప్రజ్వరిల్లుతున్నాయి. పది పటాలాలు తోటలోనికి వెళ్ళి ఆశ్రమానికి చుట్టూ అమురుకున్నాయి ఎవరికీ కన్పించకుండా. యీ తతంగం యావత్తూ పూర్తి అయ్యే వరకూ కృష్ణస్వామి ఎంతో మెలుకువతో గమనిస్తూ ఆ రాతి తిన్నెమీదనే కూర్చుని ఉన్నారు. ఆ తరువాత ఆయన సంతృప్తిగా నిట్టూర్చి లేచివెళ్ళి ఆశ్రమంలో తలుపులు మూసుకున్నారు.

చీకటిపడ్డా ఆయన తలుపులు తీయలేదు. నడిరేయిదాటింది. లోపల కృష్ణస్వామి ఒంటరిగా ఏదో ఆలోచిస్తున్నారు. మధ్య మధ్య ఘంటంతో ఏదో వ్రాస్తున్నారు. నడిరేయిదాటి యామం గడిచేసరికి ఆయన వ్రాయటం పూర్తి అయింది.

మూడు తాళపత్రాలపై వ్రాసివుంది. కాని అవి మాటలుకావు. కేవలం పొడిఅక్షరాలు, కేవలం అర్థంకాని పొడిఅక్షరాలు మాత్రమే! మొదటి తాళపత్రంమీద ఇలా వుంది. వ, కి, కాం, తో, వ్రా, ఉ, ము, ది, చా, వి, ము, నే, య, ను రెండవ తాళపత్రమూ అంతే.

శి, మి, భా, యి, రు, న, ర, ఐం, నా, ని, య, ట, లి, స్తా. మూడవ తాళపత్రం మరీ గజిబిజిగా ఉంది.

శ్రీ, స్వా, శు, క్ష, మి, సి, చే, జై, ర్యు, ష, వెం, తె, చే. మూడుతాళ పత్రాలమీద ఆయన ఘంటంతో స్పష్టంగా అర్థమయ్యేలా హస్తాక్షరాలు వ్రాలుచేశారు. మొదటి తాళపత్రంమీద అంకెమామూలుగానే ఉన్నది. కాని మిగిలిన తాళపత్రాల మీద వరుససంఖ్యలు తిరగవేసిఉన్నాయి. అది వ్రాసి ఆయన రెండుపళ్ళు రవ్వంత తేనె తీసుకున్నారు మెల్లగా తలుపుతీసుకుని ఆశ్రమంచుట్టూ చీకటిలో కాపుకాచిఉన్న తన అనుచరుల్ని సైగలద్వారా పిలచారు. ముగ్గురు దృఢకాయులైన యువకులువచ్చి ఆయనవద్ద వినయంగా నిలబడ్డారు. ఆయన మూడు తాళపత్రాల్ని ముగ్గురికియిచ్చి ''వేరు వేరు దారుల్లో ఓరుగల్లుచేరి మహామంత్రికి అందచేయండి'' అని చెప్పారు. తక్షణమే ఆ ముగ్గురుయువకులూ శలవు తీసుకుని చీకటిలో మాయమైపోయారు. కృష్ణస్వామి దీర్ఘంగానిట్టూర్చి తల ప్రక్కకు త్రిప్పి చూచేసరికి చెట్లక్రింద ఏవో ఆకారాలు కదులుతూ కనిపించాయి. ఆయన అనుమానం నిజమేనంది

మశకమంత !

''కన్యాకుమారి!''
నీలో సంగమించేవి
మూడే
''సముద్రాలు!''
కానీ
కట్నాలతో పెళ్ళిళ్ళుగాని
''కన్యా-కుమారి''ల
హృదయాల్లో
సంగమిస్తుండే
''విషమ సమస్యలు''
అనంతాలు!
వాటిముందు నీ విస్తారమెంత ?
హాస్యముందు
మశకమంత !!

— కే. కిశోరుబాబు
— కే. అశోకుబాబు

కాని చీకట్లో చెట్లక్రింద దాగివున్న హరిజన యువకులు హఠాత్తుగా ఆ ఆకారాలమీద విరుచుకు పడటంతో వారు నిశ్చేష్టులైపోయారు.

కృష్ణస్వామి ఆ చోటనే నిలిచి పెద్దగా కేక పెట్టారు. "వారిని ఎవరినీ గాయపరచవద్దు. బందీలుగా పట్టుకోండి" అని.

అలాగే జరిగింది. కాని ఆ జరగటానికి ముందు కొంత గలాటా జరిగింది. వాస్తవానికి వచ్చినవారు పదిహేను యిరవై మధ్య ఉన్నారు. దీనిని ముందుగానే ఊహించిన కృష్ణస్వామి తన ఆశ్రమంలో వందమందిని దాచారు. అలా సంఖ్య యిబ్బడి ముబ్బడిగా వుంటే తప్ప వచ్చినవారు తేలికగా లొంగరు. సంఖ్య సమానంగా వుంటే యుద్ధం జరగాల్సి వొస్తుంది. విరోధులైనా ఎందుకు గాయపడాలి, వారి హృదయాలను సంస్కరించాలి తప్ప, కొట్టి గాయపరచి చేసేది ఏముంది. కక్షను పెంచుకోవటం తప్ప అని ఆయన ఉద్దేశం. ఆ వొచ్చిన వారంతా ఆగంతకులే. ఆ వూరివారు కారు. వారు ఎవరైందీ కృష్ణస్వామికి తెలుసు. తాము జైనాచార్యుని అనుయాయులమనీ, ఏకశిలా నగరంనుండి తనకు వచ్చిన లేఖను స్వాధీనం చేసుకోవటానికి వచ్చామనీ వారు ఒప్పుకోరు. ఒప్పుకోకపోయినా వారిని హింసించటం అనవసరమనీ అసలు విషయం తెలిసిపోయింది కనుక బుద్ధిచెప్పి వదలి వేయమని కృష్ణస్వామి కోరారు. హరిజన యువకులు మహా రౌద్రం మీద ఉన్నారు. కృష్ణస్వామి అనుజ్ఞ వారికి దొరకలేదుగాని దొరికి ఉంటే ఆ ఆగంతకుల్ని ఆయువులేకుండా చేసివేసేవారే.

ఈ తతంగమంతా పూర్తి అయ్యేసరికి తెలతెల్లవారింది. వెంకన్నదొర యిద్దరు పాలేరులను చెరొక ప్రక్క ఉంచుకుని ఆశ్రమ ప్రాంతానికి వొచ్చి చేరారు.

ఈ జరుగుతున్న తతంగమంతా యాదాలాపంగా చూచినట్లు ఆశ్రమంలోకి వచ్చాడు.

కృష్ణస్వామి ఆయనను ఆదరించి కూర్చుండ నియమించేరు.

"ఏమిటిదంతా ?" వెంకన్నదొర ప్రశ్న.

"వేగిరపాటు" కృష్ణస్వామి జవాబు.

"ఏమిరా మీరెందుకింత తొందరపడి ఆశ్రమంలోకి అర్ధరాత్రివూట ప్రవేశించారు" బందీలను ప్రశ్నించేడు వెంకన్నదొర. వారేమీ పలుకలేదు.

వాస్తవానికి యిటువంటి ఘట్టాలు జరిగినప్పుడు విచారణ జరుపవలసిన వాడు వెంకన్నదొర. కాని యీ విషయం మీద విచారణ జరగటం కృష్ణస్వామికి యిష్టంలేదు.

"పలుకరెందుకని? పలికించాలా?" గద్దించేడు దొర.

"వాళ్ళు బుద్ధిహీనులు. వొదిలెయ్యండి" అన్నారు కృష్ణస్వామి.

"ఎందుకొచ్చారో తెలుసుకోవద్దూ ?"

"నాకు తెలుసు" అన్నారు కృష్ణస్వామి తనకే కాదు ఆ విషయం వెంకన్నదొరకూ తెలుసునని తెలుసు కృష్ణస్వామికి. జరుగుతున్నదంతా వొట్టి నాటకమే. ఆ నాటకంలో, ఆ ఆటలో తాను పావు కాకూడదని కృష్ణస్వామి పట్టుదల.

"మీకు తెలుసునా ? ఏమిటా కారణం" అన్నాడు వెంకన్నదొర ఆసక్తితో.

"ముందు వాళ్ళను వెళ్ళిపొమ్మనండి. తరువాత మనం మాట్లాడుకునే వీలవుతుంది" అన్నారు కృష్ణస్వామి.

వాస్తవానికి వాళ్ళను పంపింది తనే కనుక విడిచి పుచ్చటం సంతోషమే. కాని సుతరామూ యిష్టం లేనట్లుగా ముఖంపెట్టి "సరే వెళ్ళండిరా" అన్నాడు వెంకన్నదొర.

వారంతా వెళ్ళిపోయారు.

"ఏమిటి ఆ కారణం" దొర మళ్ళీ వొదలకుండా ప్రశ్నించేడు.

"దీనికంతా అజ్ఞానమూ, అజ్ఞానంలోంచి పుట్టిన స్వార్థమే కారణం" అన్నారు కృష్ణస్వామి.

"అంటే—? దయచేసి వివరించండి" అడిగేడు దొర. వాళ్ళు లేఖ కోసం వొచ్చారనగానే అది ఏమి లేఖ, దాన్లో విషయాలేమిటి అనే విషయం కూపీ లాగేందుకు దొర చేస్తున్న ఆఖరు ప్రయత్నాన్ని కనిపెట్టేడు కృష్ణస్వామి.

"ఏమి చెప్పమంటారు వెంకన్నదొరా ? వాళ్ళ అజ్ఞానంలోంచి పుట్టిన స్వార్థమే కాకపోతే నా ఆశ్రమంలో ఏమి ఉన్నదని వాళ్ళు రావాలి" అని ఎదురుప్రశ్నవేశారు కృష్ణస్వామి.

తనను వెర్రివెంగళప్పను చేశాడని గ్రహించేడు దొర. కాని చేయగలందుకు దారిలేదు. తాను తొందరపడి వాళ్ళను విడిచి పుచ్చటమే తప్పు. కృష్ణస్వామి కారణం చెప్తానని వాగ్దానం చేసి వాగ్దానభంగం కాకుండా, విషయం చెప్పకుండా జాగ్రత్తగా తప్పుకున్నాడు.

ఇక నోరు మూసుకుని బయటపడటమే ఉత్తమం అని తలపోసి, లోలోపల మండిపోతున్నా వినయంగా కృష్ణస్వామి వద్ద సెలవు తీసుకుని; పెద్ద పెద్ద అంగలతో ఆశ్రమందాటి వెళ్ళిపోయేడు వెంకన్నదొర. కృష్ణస్వామి పెదవుల మధ్య నవ్వు బిగించేరు.

4

"బిజ్జలా! బిజ్జలా!" పిలిచేడు వెంకన్నదొర.

బిజ్జలుడు బంతిలా దొర్లుతూవొచ్చేడు. చేతిలో తాయిలం ఉంది. అది మధ్య మధ్య అస్తవ్యస్తంగా కట్టుకున్న ఖరీదయిన జరీఅంచు ధోవతి చెంగులకు తుడుస్తున్నాడు.

"నాయనా! బిజ్జలా! నీకొక పని చేయాలిరా !"

"వ్యాయామశాలకు వెళ్ళాలా ? నేను వెళ్ళను ! అక్కడకు వెళ్ళితే గురువుగారు నన్ను ఊరికే కూర్చోనివ్వరు. నాకు ఆయాసం కలుగుతోంది. నేను వెళ్ళనంటే వెళ్ళను."

"అక్కరలేదు తండ్రీ ! రేపటినుండి నీవు వ్యాయామశాలకు వెళ్ళనే అక్కరలేదు. నేర్చింది చాలు."

"అవునా నాన్నగారూ! మీరెంత మంచివారు —"

"కాని నీవు తిని ఊరికే కూర్చుని సోమరిగా మారుతున్నావు. ఆ పద్ధతికి ఇక స్వస్తి చెప్పాలి తెలిసిందా ?"

"ఓ. తెలుసు. ఆ విషయం నాకెప్పుడో తెలుసు."

"ఏ విషయం —?"

"ఇప్పుడు మీరు చెప్పిన విషయం."

"ఇప్పుడు నేనేమి చెప్పాను."

"... అదే మరచాను. మీరేదో చెప్పారు నేను మరచాను."

"మరి నాకు తెలుసును అంటివి కదరా తండ్రీ."

"అవును. నాకు అన్ని విషయాలూ తెలుసు కనుక ఆ విషయమూ తెలుసుననే అనుకున్నాను" అంటూ ఎంగిలిచేతిని ధోవతి చెంగుకు మరోమారు

అంటించాడు బిజ్జలుడు. అతని వైఖరికి కన్న తండ్రికికూడా రవ్వంత జుగుప్స కలిగించింది. మనో వేదన కలిగింది.

"నాయనా! నీవు సోమరిలా ఇంట కూర్చో రాదు."

"మరి ఏమి చేయాలి?"

"మన కుటుంబ గౌరవం నిలిపే పనులు చేయాలి."

"మన కుటుంబ గౌరవం నిలవాలంటే ఏమి చేయాలి."

"నీవు ఏకవీరను ప్రేమించాలి."

"ఓహో అదెంత పని —?" తక్షణమే అక్కడ నుండి పరుగు పరుగున ఆశ్రమం చేరాడు బిజ్జలుడు.

కృష్ణస్వామి పర్ణశాలలో తలుపులుమూసుకుని ఏదో కార్యనిమగ్నులై వున్నారు. శ్రీదేవుడు చిన్న వేంకటేశ్వరుని రూపుకు తుది మెరుగులు దిద్దుతున్నాడు.

ఏకవీర లక్ష్మిని కొబ్బరిపీచుతో తోమి స్నానం చేయిస్తోంది. పద్మ ఆ దృశ్యాన్ని విశాల చంచలమయిన కళ్ళతో ఆశ్చర్యంతో చూస్తోంది. అది కణ్వ మహర్షి మునివాటికలా, ఏకవీర శకుంతలలా, లక్ష్మి పద్మలు ప్రియంవద మొదలయిన చెలికత్తెల్లా ఉన్నారు. కురంగ శాబకాన్ని తరుముతూ వచ్చిన దుష్యంతుడల్లే రావాలని ఠీవిగా నడుస్తున్నాడు బిజ్జలుడు.

అతని ఆకారం శకారుడి విచిత్ర వేషధారణను తలపిస్తోంది. "గ్రీవాభంగాభిరామం ..." అని కాళిదాసు శ్లోకాన్ని మర్చిపోయినంత మర్చిపోగా

తిరుచరణాలు

మిగిలిందాన్ని గొణుగుతున్నాడు బిజ్జలుడు. వొచ్చి ఏకవీర వెనుకనే నిలిచేడు.

"ఏకవీరా! ఏకవీరా!"

"ఎవరువారు—?" అంటూ తల ఎత్తి చూచింది ఏకవీర. పద్మ బెదురు చూపులతో తల త్రిప్పి చూస్తోంది.

"నేనే ఏకవీరా! బిజ్జలుణ్ణి! ఈ మొగిలిచర్ల మహా నగరానికి కాబోయే పెదకాపుని హ హ" అన్నాడు బిజ్జలుడు.

"ఓ నువ్వా! బిజ్జలా! మొగిలిచర్ల మహా నగరం ఎప్పుడయిందయ్యా. నీవు ఏలికవయ్యాక అలాగే అవుతుందో ఏమో! అది సరే! ఎందుకిలా దారితప్పి వొచ్చావు."

"నీవు దారి చూపుతావనే వచ్చాను ఏకవీరా!"

"ఓహో అలాగా సంగతి. అయితే ఇటుచూడు. ఇటు జోరుగా వెళ్ళావో కృష్ణానదిలోకి వెళ్తావు. ఈ ప్రక్కగా కళ్ళు మూసుకుని వెళ్ళావో ఆలయానికి వెళ్ళుతావు. ఇదేదీ ఇష్టం లేకపోతే వొచ్చినదారినే వెళ్ళు మీ యింటికి పోతావు. చాలా.. ఇంకా దారులు చూపాలా?"

"ఓహోహో మంథర ద్రౌపదికి చెప్పినట్లు చాల గొప్పగా చెప్పావే" అంటూ నవ్వసాగాడు బిజ్జలుడు. అతని ఉపమానం విని నవ్వు ఆపుకోలేక తనూ నవ్వుతోంది ఏకవీర. ఆమె నవ్వటం తనతో శృతికలపటమే అయి వుంటుందని తలపోశాడు బిజ్జలుడు.

"ఏకవీరా నేను నిన్ను ప్రేమిస్తున్నాను, ఢాం. ఢాం" అన్నాడు.

"ప్రేమిస్తే పీడాపోయింది కాని ఢాం ఢాం ఏమిటో."

"ప్రేమిస్తే పెళ్ళవుతుంది. పెళ్ళయితే మేళాలొస్తాయి. మేళాలొస్తే ఢాం ఢాం" అంటూ గంతులు వేయసాగాడు బిజ్జలుడు.

ఏకవీరకు అతని మీద జాలివేసింది.

"బిజ్జలా నువ్వు నన్నే ఎందుకు ప్రేమించావు నీకోసం మొగిలిచర్లలో పుట్టిన ప్రతి కన్యా తహతహలాడిపోతూవుంటే?"

"ఆ మాట నిజమే అనుకో! కాని మా నాన్న నిన్నే ప్రేమించమని చెప్పేడు. అందుకని నిన్నే ప్రేమిస్తున్నాను!"

"మీ నాన్న ఏమని చెప్పేడు బిజ్జలా?"

"ఏకవీరను ప్రేమించు" అన్నాడు. ఆ మాట విని పకాపకా నవ్వుతూ "పిచ్చి బిజ్జలా? మీ నాన్న ప్రేమించమన్న ఏకవీరను నేను కాను. ఆలయంలో ఉండే అమ్మవారు. ఆమెను ప్రేమించు. పూజించు. అని చెప్పి వుంటారు" అన్నది.

"అయితే నన్నిప్పుడేమి చెయ్యమంటావు."

"ఆలయానికి వెళ్ళి అమ్మవారితో చెప్పు."

"అలాగే" అంటూ బిజ్జలుడు రెండువందల యాభై ధనుస్సుల దూరాన్ని రెండువందల అంగల్లో అధిగమించేడు.

పూజారి మంత్రాలు చదువుతూ అమ్మవారిని అర్చిస్తున్నాడు.

బిజ్జలుడు అమ్మవారికి ఎదురుగా నిలబడి అన్నాడు.

"నేను నిన్ను ప్రేమిస్తున్నాను." అర్చకస్వామి ఆ మాట విని మంత్రాలు చదవటం మర్చిపోయేడు.

"నేను నిన్ను ప్రేమిస్తున్నాను" అన్నాడు బిజ్జలుడు మళ్ళీ.

"సృష్టి యావత్తు ఆదిశక్తి అయిన అమ్మవారిని ప్రేమిస్తుంది నాయనా" అన్నాడు అర్చకస్వామి. బిజ్జలుడు కళ్ళు తెరిచేడు.

"నేను ఏకవీరను ప్రేమిస్తున్నాను" అన్నాడు.

"తప్పులేదు నాయనా! ప్రేమించు. పూజించు ధన్యుడవౌతావు".

"పూజ కాదు. ప్రేమ" అన్నాడు బిజ్జలుడు. అర్చకస్వామి అతణ్ణి ఒక వెర్రివాడి క్రింద జమకట్టి "ప్రేమాలేదు నా ప్రారబ్ధం లేదు. నన్ను నివేదన కానిచ్చుకోనివ్వు" అంటూ అభ్యంతర పటాన్ని దింపి వేశాడు. బిజ్జలుడు చిత్తరపోయి వెంటనే వెనుదిరిగి యీమారు మాటయాభై అంగల్లో ఆశ్రమంలోకి వొచ్చిపడ్డాడు ఆయాసంతో రొప్పుతూ.

ఈ మారు ఏకవీరపద్మకు ఏవో కబుర్లు చెపుతూ కూర్చునిఉంది.

"ఏమయింది బిజ్జలా" అన్నది వొచ్చేనవ్వును ఆపుకుంటూ.

"నాకు శృంగభంగమే అయింది".

"ఓహో నీకు కొమ్ములుకూడా మొలచా యన్నమాట."

"అర్చకస్వామి అభ్యంతరపటాన్ని దింపివేసేరు. ఏకవీరను అందరూ ప్రేమించి పూజిస్తారనిచెప్పేరు. అందరూ ప్రేమించే అమ్మవారు నాతో పలుకనే లేదు. నువ్వయితే యింత అందంగా నవ్వుతావు. నేను నిన్నే ప్రేమిస్తాను." అన్నాడు బిజ్జలుడు బుంగ మూతిపెట్టి.

"అలాగే నన్నే ప్రేమిస్తూకూర్చో. నాకు ఆశ్రమంలో పనులున్నాయి. అవి చూసుకుందుకు వెళ్తున్నాను" అంటూ లేచి వెళ్ళిపోయింది ఏకవీర.

బిజ్జలుడు తిన్నెమీద ఆసీనుడయ్యేడు.

ఏకవీర లక్ష్మిని గోశాలలోవదలి పద్మను వెంట పెట్టుకుని శిల్పమందిరానికి వెళ్ళింది. అప్పటికి చిన్న వేంకటేశ్వరుడు తుదిమెరుగులు దిద్దుకుని చిరు నవ్వులు చిందిస్తున్నాడు.

"ఏకవీరా ఎక్కడున్నావు. నీ కోసమే చూస్తున్నాను" అన్నాడు శ్రీదేవుడు. ఏకవీర అప్పటికే స్వామి మూర్తిని చేతిలోకి తీసుకుని ఆ అందాలను తనివితీరా చూస్తోంది. బదులు పలుకనే లేదు.

"ఏకవీరా! నీకు బాగా నచ్చిందా?"

"నవ్వులు చిందే నా స్వామి రూపు మైమరపు కల్గిస్తోందయ్యా!"

"అంత బాగా నచ్చిందన్నమాట."

"అన్నమాట కాదు. అనుకున్నమాటే" అంటూ వేంకటేశ్వరుని మూర్తిని ముద్దులతో ముంచెత్తుతోంది ఏకవీర.


"మరి నా బహుమానం సంగతి ...?"

"ఈ పేదరాలు నీకేమివ్వగలదని ఆశించావు?"

"నీ మనసు ఏకవీరా! నాకు నువ్వు కావాలి."

"ఇంకా మనసు ఎక్కడున్నదయ్యా. అదెప్పుడో స్వామికి అర్పించాను. నీకు కావలసిన నేను నేను

ఇవేమన పద్యాలు



కానయ్యా. స్వామి కైంకర్యాన్ని. ఎదురు చూస్తే ఏమి పొగొట్టుకోవాల్సి వొస్తుందో ఆలోచించుకో అన్నది ఏకవీర. ఆమె మనసు పరధ్యానంలో పడు తోందని గ్రహించాడు శ్రీదేవుడు. స్వామి ఆలోచనలు మనసులో దూరనంత వరకూ ఏకవీర అద్భుతమైన స్త్రీ. ఆ మూర్తి మనసులో నిలిస్తే ఆమె ఏమవు తుందో ఆమెకే తెలియదు.

"ఏకవీరా! కపోతజంట యీ ప్రొద్దంతా కానరాలేదేమి?"

"ఎక్కడికి వెళ్ళాయో."

"ఏ పొదరింటిలోనో ఏకాంతాన్ని అనుభవిస్తున్నాయి కాబోలు."

"జీవులకు సృష్టి ప్రసాదించిన వరమయ్యా అది. తప్పేమున్నది?"

"కాని నీవు మాత్రం అన్నిటినించీపారిపోతావు."

"పారిపోవటం కాదయ్యా. నా స్వామి సన్నిధి చేరిపోవాలనుకుంటున్నాను."

"సృష్టిని పాలించే స్వామి నీకు చిక్కేనా ఏకవీరా?"

"నేనే ఆ స్వామికి చిక్కేనయ్యా."

"నీకు విముక్తి లేదా?"

"ఆ స్వామి నాకు ముక్తి ప్రసాదించినాడయ్యా

ఇక దేనినుండి విముక్తి కోరను. ఎక్కడకని పారిపోను.''

''తోటలో కపోతజంట ఎక్కడున్నదో చూడాలి. రా ! వెళ్దాం.''

''వాటి సమాధిని మన మెందుకు భంగం చెయ్యాలి.''

''వాటి గూటిలోకి వాటిని చేర్చాలి కదా !''

ఎట్లాగో ఏకవీర కదిలింది. యిద్దరూ తోటలోకి వచ్చారు. పద్మ ఏకవీర కొంగు నోటితో పట్టుకుని వెనుకనే అనుసరిస్తోంది.

''పద్మకు కూడా యీడు వచ్చింది. తోడు వెతకాలి''అన్నాడు శ్రీదేవుడు. ఏకవీరలో రాగోదయం కలగాలని ఇటువంటి సంభాషణలన్నీ తీసుకువస్తాడు శ్రీదేవుడు. కాని ఏకవీర పరధ్యానంలో ఉంటుంది. ఆతడాశించినట్లుగా ఆమె సిగ్గుపడదు. అభిమానం అంటే అహం ఉన్నచోటనే సిగ్గు.

నేనున్నాను. నేను స్త్రీని. యుక్తవయస్కురాలను. నీవున్నావు నీవు పురుషుడవు. అవివాహితుడవు అన్న జ్ఞాపకం ఆమెకు కలుగదు. కలిగితే ఆమె వివాహానికి అర్హురాలౌతుంది. ప్రేయసి కాగలుగుతుంది. కాని ఆమె ఆలోచనలన్నీ అన్యథా లగ్నమై ఉన్నాయి. వేంకటేశ్వరుని మూర్తిని చూచినప్పుడు కలిగే హృదయస్పందన ఆమెకు శ్రీదేవుని చూచినప్పుడు కూడ కలుగవు. శ్రీదేవుడు ఉద్దీపకంగా మాట్లాడినా పట్టించుకోదు.

''అందరికీ తోడు ఆ దేముడేనయ్యా''అన్నది సమాధానంగా.

''దేముడంటే... ?''

''వేయి వెలుగులు గల వెన్నెలరేడు వేంకటేశ్వరుడే.''

''రాధకు దేముడు కృష్ణుడు కాలేదా !''

''అయ్యేడు. రాముడు కృష్ణుడు అన్నీ స్వామి రూపాలే.''


''వేంకటేశ్వరుడే అలా అవతరించేడా ?''

''ఏమో నాకు తెలియదు.''

''నీకు ఏమీ తెలియదు'' అన్నాడు శ్రీదేవుడు విసుగుతో.

''నాకు తెలియవలసిందీ, తెలియాలని కోరవలసిందీ కూడ ఏమీలేదు. అన్నీ యీ స్వామే అయినప్పుడు సాధించవలసింది ఏముంది'' అంటూ వేంకటేశ్వరుని రూపాన్నే ముద్దాడ సాగింది ఏకవీర. శ్రీదేవుడు అలసిపోయేడు.

[ఇంకా వుంది]


మీ స్నానమునందు ఒక క్రొత్తదనము నిచ్చు
సబ్బు- ప్రేమ్
క్రొత్త
సుకుమారమైన మీ చర్మ సౌందర్యమునకు ప్రేమ్.
దీని పరిమళము స్వచ్ఛమైన నురగ మీ శరీరమును
ఆహ్లాదింపజేయును
మీ శరీరమునకు మృదుత్వమునిచ్చు సబ్బు-ప్రేమ్.
Imageads-M-1564
NEW
Prem
REFRESHING SOAP
PREM
జయలక్ష్మి
గుంటూరు వారి తయారీ
ప్రేమ్ - తాజాతనము నందించు సబ్బు.

ప్రశ్నావళి

కె. రామలక్ష్మి

పి. వి. ఎల్. ఎమ్. – అక్కుపల్లి

నేను మీ సాహిత్య పరంపరలను పహితం సంబాళించుకొని నా క్రొంగొత్త కలంతో కావ్యాలు రాయాలని వుంది. అందుకు నేనేం చేస్తే బాగుంటుంది ? వ్రాసేవన్నీ మీకే అంకితం చేస్తాను.

★ అయ్య బాబోయి మోహన్ ! నాపై కరుణ వుంచు. కావ్యాలంటే నాకసలే దడ. నీ అంకితాలకి అనువుగా ఏ గ్రాంథిక భాషావాదినో ఎన్నుకో. వాటికీ గౌరవం, వారికీ గౌరవం. తెలుగేనా రాని నాకిస్తే ఏం ప్రయోజనం ? డబ్బు ఖర్చు పెట్టి కనీసం ఓ సభ చేసి అందులో నీకో అంకిత సామ్రాట్ బిరుదేనా యిప్పించలేను !

సిహెచ్. ఆర్. మారేడిపల్లి

మీరెంతవరకు చదువుకున్నారు ? మీ మొదటి రచన ?

• డిగ్రీ సంపాదించాను ! 1951లో రాశా నొక వ్యాసం ! అదే నా రచనల్లో మొదటిది.

మల్లిక. – ఆదోని

అనంతపురంలో ఉచితంగా కుట్టుపని విద్య నేర్పుతారని విన్నాను. అడ్రసు చెప్పండి.

★ నాకూ తెలియదు. కాని బి. డి. ఓ. అనంతపురం అని రాస్తే వివరాలు తెలుస్తాయి. స్త్రీ సంక్షేమం వారికి రాసినా తెలియచేస్తారని అనుకుంటున్నాను.

విజేంద్ర, దత్తు. – ఆదోని

ఈ మధ్య మీ కత్తెర ప్రభుత్వ వ్యతిరేక దృశ్యాలమీద, మాటలమీద చూపించినంత పదును– అమ్మాయిని అర్ధనగ్నంగా చూపించితే – చూపడం లేదేం ?

★ నా కత్తెర సన్యసించింది !! కొత్త కత్తెర లొచ్చాయి.

చలం సాహితి. – కావలి

రామలక్ష్మిగారూ, రచయితల్లో మగాడైన శ్రీ గుడిపాటి వెంకట చలంగారిపై మీకెట్లాంటి అభిప్రాయం వుంది వివరంగా తెలుసుకోవాలనివుంది.

★ క్షమించండి. చలంగారి కుటుంబంతో నాకెంతో చనువుంది. చలం సాహిత్యంతో నాకా చనువు లేదు. ఇది చెప్పడానికి నేను సిగ్గుపడడంలేదు.

ఎం.ఎస్.ఆర్., టి.ఎం.ఆర్. – బైపల్లి

'గరికపోచ' ను శుభకార్యాలలో ఎందుకు వాడతారు ?

★ ఏమో సరిగ్గా తెలియదయ్యా – కాని గరిక పోచ విలువ గరుత్మంతుడు పెంచాడేమో అనిపిస్తుంది. అతగాడు అమృతభాండం తెస్తూంటే కాస్త చిలికింది పీటమీద అని కదా కథ ? !

ఎం. డి. ఎస్. – బైవల్లి

మనిషి జీవితంలో మహానందకరమైన సన్నివేశం ఎప్పుడు లభ్యం అవుతుంది ?

★ తన కోరిక తీరితే. ఎదుటివాడిది తీరకపోతే !

వెంకట్ – ఉరవకొండ

అసలైన అనురాగాన్ని, స్వచ్ఛమైన ప్రేమని, హృదయం యిచ్చే స్నేహితుడిని ఎలా తెలిసికోవడం ?

★ కాలమే తెలుపుతుంది.

కె. ఎస్. పి. – టెక్కలి

మీ జవాబులు చాలా చదివాను. ఆ జవాబుల్లో నిజాలు లేవు. అవి సబబుగా వుండడం లేదు.. మీరు స్త్రీ పక్షపాతంగా జవాబులిస్తున్నారు...

★ చిత్తం. మరేం చేద్దామంటారు ?

జి. వి. – అర్మూరు

ఆడదాన్ని రేప్ చేస్తే మగవానికేం వస్తుంది? ఇలా చేసిన వాళ్లను ఏం చెయ్యాలి ?

★ తన పశుబల ప్రదర్శన కిదో నిదర్శనగా ఊహించుకుంటాడేమో మరి. ఇక వారినేంచేయాలి? ఈ దేశంలో కుదరదుగానీ – లేకుంటే గోడకి నిల్చోపెట్టి కాల్పించాలి. భయం పెడితే తప్ప నేరాలు ఆగవు.

జి. వి. ఆర్. – విశాఖపట్నం

మనిషి బాధపడుతుంటే కొందరి కెందుకండీ సంతోషం ?

★ అది మానవ సహజం. దెబ్బ తినని వాళ్లే –గాయపు మచ్చలను చూసి నవ్వేది !

తండ్రి కొడుకుని పొగిడితే ?

★ తనని తానే అధిగమిస్తాడేమో !

వీరా – సామర్లకోట

ఆడది పాషాణం. ఆ హృదయం–విషవలయం ఆ స్నేహం ఒక మైకం అదే నాకు – నరకం నరకం.

★ ఇది మినీ కవిత కదా ? నాకెందుకయ్యా వీరా పంపించావు ? అయినా – కొందరి స్వర్గం నరకంలోనే వుంటుందని తెలియదా ?!

వి. బి. ఆర్. – తుంగభద్రడామ్

నేటి విద్యార్థులు చాలా వుత్సాహంగా కాలేజీలలో చేరుతారు. ఆ తరువాత క్లాసులకు ఉత్సాహంగా పోక కాలం వృధా చేస్తూంటారెందుకు ?

★ కాలేజీ జీవితంలో వున్న హుషారు క్లాసు రూంలో ఉండదు అందుకని.

పి. హెచ్. ఏ. – వేలంకి

నేనంటే చాలామందికి యిష్టం, ప్రేమ - ఆడవాళ్లకు. వారు నన్ను వారి కౌగలిలోకి రమ్మంటారు. కాని నాలో భయం ప్రవేసిస్తుంది ?

★ సైకియాట్రిస్ట్‌ని చూడండి తక్షణం లేకపోతే – తెలుగు సినిమా హీరోనని కలలు కనడం మానినా చాలు – ఈ మల్టీ హీరోయిన్ కాంప్లెక్సు తగ్గుతుంది.

బి. వి. ఆర్. – శృంగవరపుకోట

ప్రేమకు నిర్వచనం ఏమిటి ?

★ ఒకరిని ప్రత్యేకంగా ఇష్టపడి – జీవితాన్ని వారితో పంచుకొందుకు సిద్ధం కావడమే–ప్రేమలో పడడం.

శ్రీశ్రీగారిపై మీ అభిప్రాయం ?

★ వయస్సు పెరిగి, వాచాలత పెరిగిపోతున్న ఓ ముసలి కవి. కసిగా రాస్తే యువకుడినై పోతానన్న భ్రమలో బ్రతుకుతున్న 'మహా' కవి ! ★

ఉచితం



ఒక క్యాడ్‌బరిస్ జెమ్స్ ప్యాక్
బోర్న్‌విటా యొక్క 500గ్రా. ప్యాక్‌తోబాటు

ప్రత్యేకమైన కానుక! ప్రత్యేకమైన లేబుల్‌గల 500 గ్రా. బోర్న్‌విటా డబ్బా లేదా రీఫిల్ ప్యాక్ అడిగి తీసుకోండి! దీనిలోపల ఉండే క్యాడ్‌బరిస్ జెమ్స్ యొక్క ఉచిత ప్యాక్ పొందండి.



త్వరపడండి! సరుకు ఉన్నంతవరకే ఈ కానుక పరిమితం!

క్యాడ్‌బరిస్

బోర్న్‌విటా

దీన్లోని మంచిదనం పెరుగుతుంది మీపైనిక

OBM/1083/TL

సీరియల్

రేపటి ఉదయం

ప్రతాప రవిశంకర్

18

(గత సంచిక తరువాయి)

"ఈయనకు షాకింగ్‌గా ఏదీ జరగకూడదని చెప్పాను కదా... మళ్లీ ఏం జరిగింది?" అడిగాడు డాక్టరు మేష్టారికి ఇంజక్షన్ ఇస్తూ ...

మాష్టారి భార్య మాట్లాడలేదు.

"మా కాశీపతి ఇంట్లో ఎవ్వరికీ చెప్పకుండా ఓ కులం కాని అమ్మాయిని చేసుకుని వచ్చాడు. మా నాన్న వాడిని ఇంట్లో నుంచి వెళ్లమన్నాడు. కాని వాడు వెళ్లకుండా మా అందరితో పాటు ఇంట్లో వుండే హక్కు, తనకీ తన భార్యకీ వున్నదని లోపలకు రాబోయాడు. అప్పుడే నాన్నకు ఈ గుండె పోటు వచ్చింది" చెప్పింది అనసూయ.

"కాశీపతి ఇంతపని చేశాడా?" డాక్టరు ఆశ్చర్యంగా అడిగాడు.

"అవునండీ... వాడు ఇటువంటిపని చేస్తాడని ఎవ్వరం కల్లోకూడా అనుకోలేదు. చేతికి అంది వచ్చిన కొడుకు ఇలాచేస్తే ఏ తండ్రికి మాత్రం గుండెపోటు రాకుండా వుంటుంది డాక్టరు గారూ" అన్నది అనసూయ డాక్టరుతో.

ఆయన బరువుగా నిట్టూర్చి "ఏమిటో మేష్టారి జీవితం అన్నీ కష్టాలే. ఎప్పుడూ గుండెల నిండుగా దిగులు. మేష్టారికి గుండెధైర్యం ఎక్కువ కాబట్టి ఈ సంసార రథాన్ని లాగుతున్నాడు. నేనయితే ఎప్పుడో చేతులెత్తేవాడిని. ఈసారికి ఎట్లాగో గండం గడిచినట్లే. ఇకముందు ఆయనకు ఈ గుండెపోటు రాకుండా చూడండి. ఈ టాబ్లెట్లు రెండు గంటలకోసారి వెయ్యండి... వెళతాను" అని వెళ్లిపోయాడు డాక్టరు.

డాక్టరు వెళ్లిపోగానే మేష్టారిభార్య పెద్దగానే ఏడ్చింది. ఎవ్వరూ ఆమెను ఓదార్చే ప్రయత్నం చెయ్యలేదు. మేష్టారు మంచి నిద్ర మత్తులో వున్నాడు.

"అంతా నా తలరాత" అన్నాదామె ఏడుపు మధ్యలో ...

"అంటే నువ్వు బాధపడతావే ... ఆ కాశీ గాడిని చెడగొట్టింది మువ్మాటికి నువ్వే ... ఒక్క కొడుకని వాడు ఏ పని చేసినా, ఎట్లా మాట్లాడినా సహించావు. సమర్థించావు. వాడు నీ అలుసు చూసు కునే ఆ అమ్మాయిని పెళ్లి చేసుకుని వచ్చాడు. అదే మంటే ఈ ఇంట్లోనే దానితో కాపురం పెట్టటానికి సిద్ధమైనాడు. ఇప్పుడేమయ్యింది? ఈ వయసులో వాడు చేసిన ఈ పని నాన్నకు ఎంత దెబ్బ?" మధ్యలో కలిగించుకుని అన్నది అనసూయ.

"అనండే... మీరంతా నన్నే అనండి,... వాడిని వెనకేసుకు వచ్చి నేను సుఖపడి చచ్చిందేమిటి? నా జన్మకు మొదటినించీ సుఖంలేదు. నా బతుకంతా కష్టాలతోటే గడిచిపోతోంది. ఇక జీవితం ఇంతే ... ఉన్న దిగుళ్లకు తోడు ఇప్పుడు ఈయన దిగులు. ఈయనకు ఏమాట చెబితే గుండెపోటు వస్తుందో అనే భయం. తల్చుకుంటే అందరి కంటే ముందు నేను రాలిపోతే బావుండు అనిపిస్తోంది" అన్నదామె ఏడుస్తూనే...

"అయిందేదో అయింది. ఇక ఇద్దరూ ఆ వెధవ గురించి మరిచిపోండి. వాడు అసలు పుట్టలేదని అనుకోండి. నువ్వు కూడా వాడి విషయం నాన్న దగ్గర తీసుకురాకు. నాన్న వాడిలా చేసినందుకు అవ మానంతో కుమిలిపోతాడు. నిజంగా ఎంత తలవంపులైన పని ... పది మందికి మంచి చెప్పే మేష్టారి కొడుకే ఇలా చేశాడంటే ఎవరికైనా నవ్వులుగానే వుంటుంది." అనసూయ బయటకు చూస్తూ అన్నది.

బయటంతా చీకటి ...

కాశీపతి తండ్రి పడిపోగానే కోటమ్మతో అక్కడి నించి చరచరా వెళ్లిపోయాడు.

దారిలో ఉన్నది కోటమ్మ "మీ వాళ్లు రాని య్యకపోతే మనం బతకలేమా? బయమెందుకు? మా యింట్లో వుందాం ఇద్దరం. అయినా అంత మంది జనంలో మనం సుఖపడి చచ్చేదేముం టుంది?"

"నిజమే కోటమ్మా...నేను ఈ విషయాలన్నీ ఆలోచించలేదు. ఐనా ఇది కూడా మన మంచికే జరిగింది. ఇక మా వాళ్లు నాగురించి అసలు పట్టించు కోరు." అన్నాడు చీకట్లో కోటమ్మ చేతిని గట్టిగా నొక్కిపట్టి నడుస్తూ కాశీపతి.

19

రెండు రోజుల తర్వాత మేష్టారి ఆరోగ్యం కుదుటపడింది. ఆయన తన కొడుకు కాశీపతి గురించి ఇంట్లో ఎవ్వరూ తన దగ్గర మాట్లాడ కూడదని గట్టిగా శాసించాడు.

ఆయన ఆరోగ్యపరిస్థితి దృష్ట్యా అందరూ ఆ శాసనాన్ని గట్టిగానే అమలు జరుపుతున్నారు. కాని మేష్టారి భార్య మాత్రం మనసులోనే ప్రతిరోజూ కొడుకు అలాచేసి తమందరికీ దూరమయిపోయి నందుకు కుమిలిపోతూనే వుంది.

"ఏమండోయ్ మేష్టారూ, తమ కుమారుడు కాశీపతి కులాంతర పెళ్లి చేసుకున్నాడట ... మాకు ఇంకా నమ్మకం కలగటంలేదు" అన్నారు చాలా మంది మేష్టారితో.

వాళ్లందరికీ ఆయన జవాబు చెప్పలేదు.

తల వంచి మౌనంగా వెళ్లిపోయాడు.

'తను చేసిన నేరం ఒక్కటే... వాడిని కొడుకుగా కనటమే' అనుకున్నాడాయన.

మేష్టారికి ఆ రోజు మధ్యాహ్నం పోస్టులో పెద్దఅల్లుడి దగ్గర్నుంచి ఒక ఉత్తరం వచ్చింది.

అందులో తమ వూరికి దగ్గరిలోవున్న మరో వూరిలో సరళకు ఒక సంబంధం వున్నట్టు తెలిసిందనీ పెళ్లికొడుక్కి యాభై యేళ్లు వుంటాయనీ, ఆయన పెద్ద భార్య బావిలోపడి చచ్చిపోయిందనీ, ఆయనకు బాగా ఆస్తి వుందనీ, ఆయన సరళనుకాని కట్నం లేకుండా చేసుకుంటాడని రాశాడు అనసూయ మొగుడు.

జరిగిన కథ — 5 : రంగనాథం మేష్టారు ఆ వూర్లోని బడిలో హెడ్‌మాస్టర్. ఆయన భార్య సత్యవతమ్మ. వీరికి సంతానం నలుగురు కూతుళ్లు, ఓ కొడుకు. రెండో కూతురు సరళ చిన్నతనంలోనే వైధవ్యం ప్రాప్తించి పుట్టింటికి చేరుతుంది. మూడో కూతురు సులోచన మేష్టారి ప్రియశిష్యుడు నిరంజనంను ప్రేమిస్తుంటుంది. అతను బియ్యే చదివినా ఏ ఉద్యోగం రాక పట్నంలోని ఓ సినిమా హాలులో పనిచేస్తుంటాడు. ఇక ఒక్కగానొక్క కొడుకు కాశీపతి ఇంటర్ నాలుగుసార్లు తప్పి చదువుకు స్వస్తి చెప్పి రోడ్లను సర్వే చేస్తుంటాడు. ఆఖరి కూతురు శశి. మిలటరీలో పనిచేస్తున్న రంగనాథం బామ్మర్ది రామేశం చాలాకాలం తరువాత ఆ ఇంటికి వస్తాడు. కాశీపతి సినిమాహాల్లో గేటుకీపరుగా జేరతాడు. చెరువు దగ్గర వేణుగోపాల్ సరళతో మాట కలుపుతాడు. సులోచనని పెళ్లి చేసుకోవటానికి రామేశం ఒప్పుకుంటాడు. కాశీపతి కోటమ్మతో ప్రేమకలాపాలు సాగిస్తుంటాడు. వేణుగోపాల్‌ని నమ్మి తన సర్వస్వాన్ని అర్పిస్తుంది సరళ. రంగనాథం మాష్టారుకు గుండెపోటు వస్తుంది. కాశీపతి కోటమ్మను పెళ్ళి చేసుకుంటాడు.

ఆ ఉత్తరం తీసుకుని పరుగున ఇంటికి వచ్చాడు మేష్టారు. ఆయనకు ఏమీ తోచలేదు. తన కూతురికీ రెండో సంబంధమే. కానీ పెళ్లి కొడుక్కి యాభైయేళ్లంటే తన కూతురు ఏం సుఖపడుతుంది ?

మేష్టారు చెప్పిన సంబంధం ఇంట్లో ఎవ్వరికీ నచ్చలేదు.

"ఈయన రాసిన సంబంధం గురించి నాకు ముందే తెలుసు ... ఆయన ఒట్టి అనుమానం మనిషి. అందుకే ఆ భార్య నూతిలో దూకి చచ్చిపోయింది. రేపు దీనిగతికూడా అంతే ... వద్దు... ఈ సంబంధం గురించి ఆలోచించవద్దు... ఈ రోజునే ఆయనకు ఉత్తరం రాసెయ్యి నాన్నా ఆ సంబంధం మనకు వద్దని" అన్నది అనసూయ.

ఆ మాటలు విని గుండెలనిండుగా గాలి పీల్చుకున్నది సరళ... మనసులోనే అనసూయకు కృతజ్ఞతలు చెప్పకుంది.

20

బిందె తీసుకుని ఇంట్లోనించి బయటకువచ్చింది సరళ. చెట్లమీద పక్షులు అరుస్తున్నాయి.

క్రమంగా చీకటి పడుతోంది. అప్పటికే చెరువు నించి నీళ్లు తీసుకువెళ్లే మనుషులు తగ్గిపోయారు.

సరళ చిన్నగా నడుస్తున్నది. ఆమెకు భయంగా వున్నది. తన అనుమానం పూర్తిగా నిజమే అయ్యింది. నెల తప్పింది. ఇంకా నయం. ఎందువల్లనో ఇంట్లో ఎవ్వరికీ తనమీద అనుమానం రాలేదు.

ఈ మనిషినించి ఇంతవరకూ కనీసం ఉత్తరం కూడా లేదు. ఎటువంటి సమాచారమూ లేదు.

అసలు అతను నిజంగా తనని ప్రేమించాడా ? పెళ్లి చేసుకుంటాడా ? ఏమో !

చెరువు దగ్గరకు వెళ్లేసరికి నీళ్లు ముంచుకుని పైకి వస్తున్న సరళ స్నేహితురాలు లక్ష్మి కనిపించింది.

"ఈ మధ్య రావటంలేదే ?" అడిగింది లక్ష్మి.

"వస్తున్నాను ... నువ్వే కనపడటం లేదు" అన్నది సరళ.

"అలా వున్నావేం ?"

"ఎలా వున్నాను" నీళ్లు ముంచుకుంటూ అడిగింది సరళ.

"ఏమో ... నా కళ్లకు అదోలావున్నావు ?"

"ఏమీలేదు. ఈ మధ్య అప్పుడప్పుడు జ్వరం వస్తోంది. ఊ ... ఏమిటీ విశేషాలు ?" మాట మారుస్తూ అడిగింది సరళ. ఆమెకు లక్ష్మి తనలో వస్తున్న మార్పు గురించి మాట్లాడటం ఇష్టం లేదు.

"ఏమున్నాయి ! కరణంగారింట్లో అందరూ ఇవాళ సాయంత్రమే వూరికి వెళ్లారు" చెప్పింది లక్ష్మి.

"ఎందుకు?"

"ఎందుకేమిటి ? వాళ్ల మేనల్లుడి పెళ్లిట ఇంకో రెండు రోజుల్లో."

"మేనల్లుడా?" దెబ్బతిన్నదానిలా అడిగింది సరళ.

"అతనే...మొన్నటి వరకూ మనవూళ్లో వుండి వెళ్లలేదూ... ఆ మహానుభావుడే."

తూలి పడబోయింది సరళ.. బలవంతాన నిలబడింది.

"అతని పెళ్లా!" నోరు పెగుల్చుకుని అన్నది.

"అవును... అతని పెళ్లి.. ఎందుకలా అడిగావ్? అలా అయిపోయావేమిటి ? కొంపదీసి నువ్వు కూడా ఆ హీరోని ప్రేమించెయ్యలేదుకదా" నవ్వుతూ అడిగింది లక్ష్మి.

"లేదు. లేదు— అటువంటిదేమీ లేదు" వస్తున్న ఏడుపును దుఃఖాన్ని ఆపుకుంటూ గబగబా అన్నది సరళ.

"అయితే దిగుల్లేదులే... ఆచార్లుగారి కూతురు ఒకటే యేడుపు ఈ వార్త విని.. పిచ్చిమొద్దు. అతన్ని ఈ వెర్రిమొద్దు ప్రేమించిందిట. అతను దీన్ని పెళ్లి చేసుకుంటానని చెప్పాడుట. అతను చెప్పినట్టల్లా చేసిందిట. ఇంకా నయం దానికి ఆ దేవుడి దయవల్ల ఏ కడుపూ రాలేదు అయినా ఎవడినిపడితేవాడిని నమ్మితే ఏమవుతుంది



గమనిక

వ్యక్తులపేర మీ రచనలు పంపితే వాటి పరిశీలనలో ఆలస్యం జరిగే ప్రమాదాలెక్కువ కనుక మీ రచనలన్నీ కూడా శీర్షిక పేరు కవరుపైన లేదా కార్డుపైన ఉదహరిస్తూ సంపాదకుడు, ఆంధ్ర సచిత్ర వారపత్రిక, గాంధీనగరం, విజయవాడ – 520 003 అన్న చిరునామాకి పంపండి.

—సం.

రేపటి ఉదయం

సరళా. అది వొట్టి పిచిమొద్దులే..." చెబుతోంది లక్ష్మి.

సరళ మెదడు మొద్దుబారిపోయింది.

ఇది నిజమా ? తను భయపడినంతా జరిగిందా ?

అతను తనలాగే మరో ఆడపిల్లను కూడా మోసం చేశాడా ?

లక్ష్మి తప్పుకుంది.

ఒంటరిగా నీరసంగా నడుస్తోంది సరళ...

ఆమె గుండెల్లో రైళ్లు పరిగెత్తుతున్నాయి. లావా పొంగుతోంది.

ఆమె హృదయాన్ని ఎవరో బలవంతానా మెలితిప్పుతున్నట్టు విలవిల్లాడిపోయింది.

ఇప్పుడు తనకేమిటి దారి ?

ఎటుచూసినా చీకటే.

ఈ విషయం ఇంట్లో తెలిస్తే ??

ఇంట్లోకి నడిచింది. అనసూయ అప్పుడే స్నానంచేసి ఇంట్లోకి వచ్చి చీర కట్టుకుంటోంది.

సులోచన వంట ఇంట్లో కూర ముక్కలు తరుగుతోంది.

మళ్లీ బిందె తీసుకుని ఇంట్లోనించి బయల్దేరింది సరళ ...

అప్పటికి బాగా చీకటిపడిపోయింది.

దీపాలు వెలిగాయి.

ఇంకా ఇంట్లోంచి పూర్తిగా బయటకు వెళ్లక ముందే సరళ కళ్లుతిరిగి పడబోయింది. చేతిలోవున్న బిందె జారి కిందపడి చప్పుడు చేసింది.

పరిగెత్తుకువచ్చి కింద పడబోతున్న సరళను పట్టుకుంది అనసూయ.

ఏమయ్యింది ?

"సరళ మాట్లాడలేదు. ఉన్నట్టుండి దొడ్లోకి పరిగెత్తి వాంతి చేసుకుంది.

సరళ వెనుకే పరుగుతీసి ఆమెను పట్టుకుంది అనసూయ.

"ఏమయ్యిందే ?" అడుగుతోంది అనసూయ

"ఏమయ్యింది ?"

మేష్టారి భార్య, సులోచన పరిగెత్తుకుంటూ వచ్చారు.

తల వంచుకుని నిలబడింది సరళ ...

"ఏమయ్యింది ?" అడిగింది మేష్టారి భార్య.

"ఏంకాలేదులే మువ్వెళ్లు" అనసూయ అన్నది.

ఆమె వెళ్లలేదు.

ఒకసారి కూతుర్ని పరిశీలనగా చూసింది సరళలో వచ్చిన మార్పును పసిగట్టింది.

ఆమె నిలువెల్లా వణికిపోయింది.

"సరళా !"

ఉలిక్కిపడింది సరళ ...

"నిజం చెప్పు... ఏమిటిదంతా ? నాకు నీ విషయం అనుమానంగానే వుంది. అయినా అదే నిజమవుతుందనుకో లేదు ... నీకు నెల తప్పింది కదూ" కూతుర్ని కుదుపుతూ అడిగింది.

సరళ మాట్లాడలేదు. శిలలా నిలబడిపోయింది.

సులోచన అక్కయ్య అనసూయ మొహంలోకి చూసింది.

"మాట్లాడవేమే... నిజమే కదూ"

"అమ్మా" ఏడుస్తూ తల్లి గుండెలమీద వాలిపోయింది సరళ ...

"ఛీ ... పాపిష్ఠిదానా" వెనక్కు నెట్టింది ఆమె కూతుర్ని ... కిందపడబోతున్న సరళను సులోచన, అనసూయ పట్టుకున్నారు.

వెక్కివెక్కి ఏడుస్తోంది సరళ ...

"ఛీ... ఛీ... ఈ ఇంటికేదో శని చుట్టుకుంది... తల పగిలిపోతోంది. ఏమిటిదంతా ? నిప్పులాంటి మనుషులమకున్నాను నా పిల్లలంతా...ఛీ..."

"చెప్పు సరళా ... ఏడవకు ... ఎవరతను .. చెప్పు ... నేను వెళ్లి మాట్లాడతాను. మీ పెళ్లి జరిపిస్తాను ... చెప్పు" అనునయంగా అడిగింది అనసూయ.

ఏడుస్తూనే వుంది సరళ ...

"రామేశం కాదు గదా" ఉన్నట్టుండి అడిగింది అనసూయ.

కాదన్నట్టు తల వూపింది సరళ.

"మరెవరు ?"

"వేణుగోపాల్"

"ఎవరతను ?"

చెప్పింది సరళ...

"ఏడవకు...ఇప్పుడే నేను వెళ్లి కరణంగారితో మాట్లాడతాను."

వాళ్లు లేరనీ, అతని పెళ్లికే వెళ్లారనీ చెప్పింది సరళ యేడుస్తూనే...

"అయ్యో... సరళా... ఎంత అన్యాయం జరిగిందే" అనసూయ బాధగా అన్నది.

సులోచన అందరినీ చూస్తోంది. సరళ ఎంత సులభంగా మోసపోయింది. ఇప్పుడేమిటి చెయ్యటం?

"అంతా నా తలరాత" నెత్తి కొట్టుకుంటూ అన్నది మేష్టారి భార్య.

నాన్నకు ఈ విషయం తెలిస్తే ? ఆయన ఈ షాక్‌ని తట్టుకోగలడా ? మళ్లీ గుండెపోటు వస్తే మళ్లీ గుండెపోటువస్తే నాన్న బతకడని డాక్టరు చెప్పాడు.

భగవాన్ ! ఇప్పుడేమిటి దారి ?

ఈ సమస్యకు పరిష్కారం యేమిటి ?

ఉలిక్కిపడింది సులోచన.

"అమ్మా... నాన్న ఇక్కడ పడిపోయాడే" అప్పుడే బయటనించి లోపలకు వచ్చిన మేష్టారి నాలుగోకూతురు శశి పెద్దగా అరచింది.

అందరూ అక్కడకు పరుగుదీశారు.

నడిమింటి గుమ్మం పక్కగా గోడకు జారగిలపడి పోయివున్నాడు మేష్టారు.

ఆయన ఎప్పుడు వచ్చాడో ఎవ్వరూ గమనించలేదు.

ఆయన పలకలేదు. కదలలేదు అసలు ఆయనలో చలనంలేదు.

"నాన్నా..." పిల్లలందరూ గొల్లుమన్నారు

"ఏమండీ" గుండెలు బాదుకుంది మేష్టారి భార్య.

మేష్టారు శాశ్వతంగా విశ్రాంతి పొందాడు

21

మళ్లీ తెల్లవారింది.

ఇంకా సూర్యుడు ఉదయించలేదు. గాలి బద్ధకంగా వీస్తోంది.

ఊరికి దూరంగా విసిరేసినట్టున్న రైలుస్టేషన్ నిశ్శబ్దంగా వుంది. స్టేషన్ ఆవరణలోవున్న చెట్లు గాలి చెప్పే కబుర్లు వింటున్నట్టు చిన్నగా తలలు వూపుతున్నాయి.

నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ స్టేషన్‌లోకి దూసుకు వచ్చి ఆగింది రైలు.

ఆగిన రైల్లోనించి దిగాడు నిరంజనం. అతని చేతిలో ఏర్‌బ్యాగ్ వుంది. అతనితోపాటు ఇంకో ముగ్గురు మనుషులుకూడా దిగారు. వాళ్లు స్టేషన్ మాస్టరికి టిక్కెట్లిచ్చి వెళ్లిపోయారు.

నిరంజనం దిగిన చోటునే నిలబడి ఒక్కసారి చుట్టూ చూశాడు.

అతనికి వాతావరణం ఎంతో ఆహ్లాదకరంగా వున్నట్లనిపించింది.

టిక్కెట్టిచ్చి రైలుపట్టాలు దాటి ముందుకు నడిచాడు నిరంజనం.

అతనికి ఎంతో ఆత్రుతగా వున్నది.

మేష్టారిని చూడాలి! తన సంతోషాన్నంతా ఆయన ముందు దిమ్మరించాలి.

అప్పుడు చూడాలి మేష్టారి మొహం ఎలా వెలిగిపోతుందో !

నడుస్తున్నాడు నిరంజనం.

పొలాల మధ్యనించి దారి.

ఎవ్వరూ ఎదురు రావటంలేదు. అప్పుడే సూర్యుడు మబ్బులను చీల్చుకుని బయటకు వస్తున్నాడు.

ఇన్నాళ్లకు మేష్టారి కోరిక తీరింది. ఆయన పడిన శ్రమకు తగిన ప్రతిఫలం దొరికింది.

తమ కష్టాలు తీరిపోయాయి.

తన చదువుకు తగిన ఉద్యోగం వచ్చింది. జీతం నెలకు ఏడువందలు. ఇక తనకు జీవితం గురించి దిగులులేదు. బ్రతుకు గురించిన భయం లేదు.

ఇప్పుడు తన ధ్యేయం ఒక్కటే ... తనకోసం ఎంతో శ్రమించిన తండ్రిలాంటి, దేవుడులాంటి మేష్టారిని సుఖపెట్టాలి. కనీసం ఈ వయసులోనైనా ఆయన్ని బాధ్యతల నించి విముక్తుడిని చేసి ఆ బాధ్యతలను తన మీద వేసుకోవాలి ...

మేష్టారూ ... ఇన్నాళ్లకు మీ కలలు పండాయి. ఈ సంతోషం కేవలం ఉత్తరం ద్వారా మీకు అందించటం ఇష్టంలేదు మేష్టారూ... నా అంతట నేనే స్వయంగా వచ్చి ఈ శుభవార్త మీకు చెప్పాలి. మిమ్మల్ని ఆశ్చర్యంలో, సంతోషంలో ముంచెయ్యాలి. అందుకే నాకు ఉద్యోగం దొరికినట్టు మీకు ఉత్తరం రాయలేదు మేష్టారూ ...

నిరంజనం తనకు బాగా ఇష్టమయిన పాట పాడుతున్నాడు... మధ్య మధ్యలో ఈల వేస్తున్నాడు.

అతనికి గాలిలో తేలిపోతున్నట్టుగా వుంది ...

సులోచన మనసులోకి వచ్చింది.

మై డియర్ సులోచనా ... వస్తున్నాను ... నువ్వు రాసిన ఉత్తరం అందింది. నీకు షాక్ కలిగించాలనే ఇలా ఉత్తరం రాయకుండా వస్తున్నాను. ఇక మనకు దిగులు లేదు.* మన మూగ ప్రేమని ధైర్యంగా నలుగురికీ తెలియజేస్తాను. ఇక నేను ఆగలేను.

ఇద్దరం మేష్టారి పాదాలమీద పడి ఆయన దీవెనలు పొందుదాం... వస్తున్నాను సులోచనా... వస్తున్నాను. గబగబా నడుస్తున్నాడు నిరంజనం

పొలాలుదాటి ఊళ్లోకి ప్రవేశించాడు.

'ఊరు మారలేదు' అనుకున్నాడు నిరంజనం.

వెలుగు కిరణాలు చెరువు నీటిలోపడి మెరుస్తున్నాయి నీళ్ళు.

మళ్లీ ఎన్నో నెలలతర్వాత తన వూళ్లోకి అడుగుపెట్టటం ? చెరువుకట్టదాటి గుడిముందుకు వచ్చాడు... ఒకరిద్దరు అతడిని పలకరించారు. కాని నిరంజనం మాట్లాడలేదు.

గబగబా అడుగులు వేశాడు.

మేష్టారి ఇంటిముందుకు వచ్చాడు.

ఆ ఇంటిబయట గుమికూడిన మనుషులను చూడగానే నిరంజనం గుండెలు జారిపోయాయి.

'ఆ ఇంట్లో ఎవరికి ఏమయ్యింది ?'

"పాపం... మేష్టారికి ... బతికినన్నాళ్లూ కష్టాలే... రాలిపోయాడు ... మంచి మనిషి" ఎవరో ఇద్దరు నిరంజనం పక్కనుంచి వెళుతూ అనుకుంటున్నారు.

పిడుగు పట్టినట్లనిపించింది.

పరుగుదీశాడు నిరంజనం.

మనుషులను చీల్చుకుని ముందుకెళ్లాడు.

గుండెలవరకు గుడ్డ కప్పబడిన ప్రాణం లేని మేష్టారి మొహం కనిపించింది.

"మేష్టారూ" మొదలు నరికిన చెట్టులా ఆయన మీదకు ఒరిగిపోయాడు నిరంజనం.

'ఇప్పుడు వచ్చావా నిరంజనం' మనసులోనే అనుకున్నది సులోచన.

"మేష్టారూ" పసిపిల్లాడిలా యేడుస్తున్నాడు నిరంజనం...

"నిరంజనం... మేష్టారు మనందరికీ అన్యాయం చేసి వెళ్లిపోయారు" పూడుకుపోయిన గొంతులో అన్నది మేష్టారి భార్య.

"మేష్టారూ... ఏమిటీ దారుణం. ఎంతో ఆశతో వచ్చాను మేష్టారూ... నాకు మంచి ఉద్యోగం వచ్చిందని చెప్పటానికి... ఇక మీ కష్టాలు తీరిపోయాయనుకున్నాను. కాని ఈ విధంగా అన్నింటినీ వదిలి వెళ్లిపోతారని అనుకోలేదు."

సులోచన కళ్లు ఎర్రగావున్నాయి. ఆమెకు దుఃఖం పొంగి వస్తోంది. నిజంగా తండ్రి బ్రతికి వున్నట్లయితే నిరంజనానికి మంచి ఉద్యోగం వచ్చినందుకు ఎంతో సంతోషపడేవాడు.

ఉన్నట్టుండి సులోచన ఇంట్లోకి పరుగు దీసింది, ఆమెకు వంటగదిలో ఉరితాడును మెడకు తగిలించుకోబోతున్న సరళ కనపడింది.


"సరళా" అరిచింది సులోచన పరిగెత్తి

"వద్దు... నువ్వెళ్లిపో... నన్ను చావనీ...నాకిదే తగిన శిక్ష."

బల్లమీదినుంచి కిందికి లాగింది సులోచన !

"నువ్విలాంటి పని చేస్తావని నాకు తెలుసు అందుకే నిన్న రాత్రి నుంచి కనిపెడుతున్నాను ఇంకెప్పుడూ ఇలాంటి పని చెయ్యనని ఒట్టెయ్యి ... నీ సమస్యకు పరిష్కారం ఆత్మహత్య కాదు బ్రతకడం ప్రతి మనిషికి వున్న హక్కు. పిరికిదానిలా చావటం ఎందుకు? లోకంలో మగవాళ్లందరూ మోసగాళ్లు కాదు. మంచివాళ్ళుకూడా వుంటారు"

"అపునీ ఉపన్యాసం... నేను దారుణమై



డాక్టర్ సలహాలు

డాక్టర్ కె. వెంకటేశ్వరరావు

హెచ్. ఆర్. – ఖమ్మం

నాకు దాదాపుగా మూడు సంవత్సరముల నుండి బంక విరోచనాలు అవుతున్నాయి. కొద్దిగా కారం తింటే వెంటనే నడుముచుట్టూ నరాలు పట్టేసి శబ్దాలు వస్తాయి. కళ్లు లోతుకుపోయి కళ్లల్లో ఎర్రజీర వస్తుంది. కాళ్లనరాలు గుంజుతాయి. రెండు,మూడు రోజులదాక భోజనమే మానివేయాల్సి వస్తోంది. అప్పుడప్పుడూ పొత్తికడుపులో నెప్పి వుంటుంది. కారం తగిలినప్పుడల్లా ఇలాగేవుంటోంది.

★ మలపరీక్షలో "ఎంట మీబాహి స్టొలిటికా" కనబడక పోయినప్పుడు సిగ్మాయిడో స్కోపీ చేసి పెద్ద ప్రేవుల చివరి భాగంలో ఉన్న పుండ్లలోనుంచి తీసిన స్మియర్ పరీక్షించవలసి ఉంటుంది.

కొంతమందికి అల్సరేటివ్ కొలైటిస్ అనేరోగం ఉంటుంది. ఆ రోగం ఉన్నప్పుడు పై లక్షణాలు ఏర్పడే అవకాశం ఉంటుంది. రోగ నిర్ధారణ తర్వాత చికిత్స ప్రారంభించవలసి ఉంటుంది.

బి. ఎమ్. – గుంటూరు

నాకు 9 నెలల క్రితం షుగర్ వున్నదని కనుగొనబడినది. అప్పటినుండి ఉదయం 9.30 గంటలకు వరి అన్నము, రాత్రి 9 గంటలకి గోధుమ రొట్టెలు ఆహారంగా తీసుకుంటూ డయానిల్ ఒక మాత్ర వేసుకొనుచున్నాను ఆహారము తిన్న తర్వాత ఒక కాకరకాయ పచ్చిది తినదలచినాను. ఇలా చేయవచ్చునా ?

★ ఇలా ఆహారం, మాత్రలు తీసుకొంటూ ఉన్నప్పుడు దాదాపు ప్రతిరోజూ మూత్ర పరీక్షచేసి చూడవలసి ఉంటుంది. అప్పుడుగాని ఈ నియమాల ఫలితం తెలియదు. షుగర్ ఉండటాన్నిబట్టి మాత్రల సంఖ్యను హెచ్చించటం తగ్గించటం చేయాలి పచ్చికాకరకాయ తినగలిగితే తప్పేమీ లేదు. దాని వల్ల ఉపయోగం ఎంత అనేది ఇంకా వివాదాస్పదంగానే ఉన్నది. పాంక్రియాటిక్ డయాబెటిస్‌లో పనిచేయవచ్చని ప్రస్తుత అంచనా.

బి. హెచ్. జె. – వైజాగ్

మా అమ్మగారికి కరోనరీ హార్ట్ డిసీజ్ వున్నది. ఉప్పు తగ్గించే వాడుతున్నాము. కాని అప్పుడప్పుడూ ఆయాసం వస్తూ వుంటుంది. లాసిక్స్ టాబ్లెట్స్ నెలకు పది చొప్పున ప్రతి నెలా ఇవ్వవచ్చునా ?

★ రక్తపుపోటు ఉన్నప్పుడు దానికి తగిన చికిత్స తీసుకోవటం అవసరం. రక్తపుపోటు ప్రమాణాన్ని బట్టి, కాళ్ళవాపు ఆయాసం మొదలయిన వాటి తీవ్రతను బట్టి వైద్యులు లాసిక్స్ వాడకాన్ని తీర్మానించటం జరుగుతుంది. రక్తపుపోటు మూలంగా ఏర్పడే కారొనరీ హార్టుడిసీజ్‌కి లాసిక్స్ వాడితే మాత్రం చాలదు. వైద్యులచేత పరీక్ష చేయించుకొని వారి సలహా ప్రకారం ఇతర మందులు కూడా వాడవలసి ఉంటుంది. నెలకి పది మాత్రలు లాసిక్స్ వాడటంలో తప్పులేదు.

ఎమ్. కె. ఎస్. – తుమ్మం

మా పాప 3 నెలల వయస్సులో వున్నప్పుడు మా బాబు కంటిలో పొడిచాడు. అది కంటిపాప పైన తెల్లగా, మందంగా పొరలాగా గుండ్రంగా బయటకు వచ్చింది. అది రోజు రోజుకి పెద్దదిగా అవుతోంది. నెప్పిగూడా వున్నది. చిత్తూరులో హాస్పటల్‌లో చూపించాము. వేలూరులో సి. ఎమ్. సి. లో చూపించాము. ఏదో ఇంజక్షన్ చేసారు. కళ్ళు ఇప్పుడు బాగానే కనిపిస్తున్నాయి. సి.ఎమ్.సి.లో పాప ఐదవ సంవత్సరములో ఆపరేషన్ చేసి తీస్తామని చెప్పారు. కాని ఇప్పుడు అడిగితే వీలు కాదంటున్నారు.

★ మీ పాపని మద్రాసులోని డాక్టర్ అగర్‌వాల్ కంటి ఆస్పత్రిలోగాని, శంకర నేత్రాలయాలో గాని చూపించటం మంచిది. ★

తప్పు చేశాను. నాన్నను పొట్టనపెట్టుకున్నాను... నన్ను చావనీ"

"జరిగిందేదో జరిగింది. అంతా మరచిపో... నిరంజనం వచ్చాడు. అతనికి చెబుదాం. అతను మంచి మనిషి. ఈ సమస్యకు పరిష్కారం అతను చూడగలడు. నా మాట విను అక్కా ... ఎప్పుడూ చీకటి వుండదు. వెలుగుకూడా వస్తుంది పద వెళదాం ..." అని గబగబా ఆ తాడును వూడదీసి అక్కడినించి సరళతో బయటకు వచ్చింది సులోచన.

నిరంజనం యేడుస్తూనే వున్నాడు.

ఎండెక్కుతోంది. సూర్యుడు ఆకాశంమీదికి పాకుతున్నాడు ఎవరో వెనుకనించి నెడుతున్నట్టు.

22

మేష్టారి అంత్యక్రియలు పూర్తయినాయి.

నిరంజనం మేష్టారి కుటుంబాన్ని తనతో రమ్మన్నాడు.

"ఎందుకు నిరంజనం ? వద్దు. నీ కెందుకు భారం ? మేష్టారు ఈ బాధ్యతలను మోయలేక ఎంత సతమతమైనారో ... నువ్వింకా చిన్నవాడివి. ఈ భారాన్ని నువ్వు తట్టుకోలేవు" అన్నది మేష్టారి భార్య.

"చిన్నవాడినే కావచ్చు. కాని నాకు తల్లి,

రేపటి ఉదయం

తండ్రిలేరు. నా వాళ్లంటూ ఎవ్వరూలేరు. నా సర్వస్వం మేష్టారే. మీరంతా నా వాళ్లే అనుకున్నాను. మేష్టారి బాధ్యతలన్నీ నా బాధ్యతలే ఆయన నాకు చేసిన ఉపకారానికి, ఆయన నా పట్ల చూపిన ప్రేమకు, వాత్సల్యానికీ నేనేం చేసినా మేష్టారి రుణం తీర్చుకోలేను. మేష్టారిని ఎంతగానో సుఖపెడదామనుకున్నాను. కాని నా దురదృష్టం.. ఆయన కనీసం నాతో మాట్లాడకుండానే ఈ లోకంనించి వెళ్లిపోయారు. మీరు నా మాట కాదనకండి. మీరంతా నాతో వచ్చెయ్యండి. నా నిర్ణయం మేష్టారి ఆత్మకు శాంతిని, సంతోషాన్ని కలుగజేస్తుంది" అన్నాడు నిరంజనం.

ఆమె వెంటనే మాట్లాడలేకపోయింది.

తర్వాత "నిరంజనం ... నువ్వు మామూలు మనిషివి కాదు, ఆయనకు కొడుకు వుండీ లేనివాడయ్యాడు. చివరికి ఏ తల్లి కన్నబిడ్డవో నువ్వుమాకు దిక్కయినావు" అన్నది భారంగా.

"అలా అనకండి ... మీరంతా నావాళ్లు. రేపు ఉదయమే మనం బయల్దేరుదాం" అన్నాడు నిరంజనం.

ఆ రాత్రి కూడా ఆ ఇంట్లో ఎవ్వరూ నిద్రపోలేదు.

తెల్లవారబోతున్నది.

అనసూయ భర్తతో, పిల్లలతో వెళ్లిపోయింది.

కాశీపతి – కోటమ్మతో ఆ వూళ్లోనే వుండిపోతానని చెప్పి వెళ్లిపోయాడు.

మేష్టారు సగంలో వదిలేసిన సంసార రథాన్ని లాగుతూ నిరంజనం రైలు స్టేషన్ కేసి నడక మొదలుపెట్టాడు.

శాపం పొందిన మనుషుల్లా అతని వెనుకే నడుస్తున్నారు వాళ్లందరూ.

అందరి గుండెల నిండా చీకటి, భవిష్యత్తు గురించిన ఆలోచనలు. చీకటి తెరలు తప్పుకుంటున్నాయి. అంతా తూర్పువైపు ఆకాశంలోకిచూశారు సూర్యుడు ఉదయించే ప్రయత్నం చేస్తున్నాడు వెలుగు వస్తోంది...

[అయిపోయింది]


కానుక

నా మిత్రుడు మద్దాలి ప్రదీప్ కుమార్‌కు స్నేహ కానుకగా -

— రచయిత

బామ్మగారి అమెరికా ప్రయాణం

'అమంత.'



ఈ సమస్యని ఎలా విడదీయాలో ఎవ్వరికీ పాలు పోవటం లేదు. ఇంత ఉత్సాహంగావున్న పార్వతమ్మగారిని నిరుత్సాహపర్చడం ఎలా ? పోనీ ఆవిడ కోరిన ప్రకారం జర్పించాలంటే ఎలా సాధ్యం?

"ఏరా కుమార్ — ఇప్పుడు యిలా అయ్యిం దేమిట్రా ? అమ్మకి ఎలా నచ్చచెప్పాలిరా ?" కొడుక్కేసి చూస్తూ అడిగింది, తల్లి సువర్చల.

ఇంతకీ అసలు సంగతి చెప్పకుంటే, సమస్య ఏమిటో అర్థంకాదు. పార్వతమ్మగారు సువర్చల తల్లి. ఆవిడని అమెరికావచ్చి, ఓ సంవత్సరమైనా వుండమని అమెరికాలోవున్న పార్వతమ్మగారి కొడుకులూ, సువర్చల అన్నదమ్ములూ పదే పదే రాస్తూ వచ్చారు. ఆఖరిసారిగా, వాళ్ళు సువర్చలకి చాలా నిష్ఠూరంగా వుత్తరం వ్రాశారు, సువర్చలకి వాళ్ళ అమ్మని పంపడానికి యిష్టంలేనట్లుగా. కాని తల్లిని ఒంటరిగా అంతదూరం. ఎలా పంపడం ? అది ఓ ప్రాబ్లెమ్‌గా వుండేది. ఇంతలో పార్వతమ్మ మనుమడూ, సువర్చల కుమారుడు అయిన కుమార్‌కి అమెరికా టూర్ ప్రోగ్రాం తగిలింది. అందరూ ఊపిరి పీల్చుకున్నారు, వాళ్ళ ప్రాబ్లెమ్‌కి పరిష్కారం దొరికిందని. వీసాలూ, పాస్‌పోర్టులూ రడీ అయ్యాయ్. టిక్కెట్లు రిజర్వేషన్‌కూడా అయ్యాయ్. ప్రయాణం యింక పది రోజులు వుంది. పార్వతమ్మగారు అమెరికా ప్రయాణపు ఏర్పాట్లతో నెల రోజులనుంచి హడావుడిగావుంది. కుమార్ మేనమామలకీ, పిల్లలకీ యివ్వవలసిన ప్రెజెంటేషన్స్ అన్నీకొని, కష్టమ్స్ రూల్సుకి అడ్డురాకుండా జాగ్రత్తగా పాకింగ్ చేశాడు. ఇంట్లో అంతా ఫారెన్ వాతావరణం చిందులు వేస్తోంది.

ఇంతలోకే వచ్చిపడింది, ప్రస్తుత సమస్య. కుమార్ టూర్‌ని వాళ్ళ ఆఫీసువాళ్ళు ఓ సంవత్సరం వాయిదా వేసి, అతని టికెట్ కాన్సిల్ చేశారు. కాబట్టే ఇప్పుడు పార్వతమ్మ ఒక్కర్తే వెళ్ళాలి. తోడు ఎవ్వరూ లేరు.

పార్వతమ్మకు మాతృభాష తెలుగు మాత్రం వచ్చు. చిన్నప్పుడు ఆమె తండ్రి నేర్పిన సంస్కృతం కొద్దిగా జ్ఞాపకం వుంది ఆమెకు. కాని ఆమె వెళ్ళవలసింది అమెరికా. విమానంలో దగ్గరసా రోజున్నర ప్రయాణం చేయాలి. ఏది కావాలన్నా, అడగాలన్నా ఇంగ్లీషు విధిగా రావాలి. కాని పార్వతమ్మగార్కి ఇంగ్లీషు రాదు. ఆమెను ఒకర్తిని ఎలా పంపడం ? ఆమె ఎలా ప్రయాణం చేస్తుంది ? అదీ ప్రస్తుత సమస్య !

ప్రయాణం వాయిదా వేస్తే ఇంకేమన్నా ఉందా ? పాలపొంగు లాంటి ఆమె ఉత్సాహం మీద నీళ్ళు చల్లినట్లేగా— పైగా సువర్చలగారి అమెరికన్ సోదరులు ఊరుకుంటారా ? ఉత్తరాల యుద్ధం మొదలు పెట్టరూ ? అదీ సువర్చల సమస్య,

ఇంట్లో ఎవ్వరికీ బుర్రలు పనిచేయటం లేదు. పార్వతమ్మగారిని అమెరికా పంపాలి, సాయం ఎవరైనా వున్నా లేకపోయినా. అందరి ఆలోచనా అదే.

"అమ్మమ్మా — ఒక్క దానివీ ప్రయాణం చేయగలవా ? మామయ్యలకి ఫోను చేస్తే వాళ్ళు ఎయిర్ పోర్టుకి వస్తారు. నేను దగ్గర వుండి బొంబాయిలో ప్లేను ఎక్కిస్తా." కుమార్ అడిగాడు.

"వెడతానురా — ఆ మాత్రం ప్రయాణం చేయలేనా ?"

"ఏం బామ్మా — ఇది ఆర్టీసీ బస్సెక్కి కట్టమూరు వెళ్ళడం అనుకున్నావా ?" నవ్వుతూ అంది కుమార్ చెల్లాయి.

"అదేమిటే — ఇది మాత్రం ఏం కష్టం — ఇక్కడ ఎక్కి అక్కడ దిగడమేగా ?" అర్థంగాక అడిగింది, పార్వతమ్మ.

"అదికాదు బామ్మా— నీకు విమానంలో ఆకలి యిందనుకో— ఎలా అడుగుతావ్?" మళ్ళీ అడిగింది.

"యిలా అడుగుతా" సౌంజ్ఞలు చేస్తూ చూపింది పార్వతమ్మ.

'వాళ్ళు చేపకూర యిచ్చారనుకో - వద్దని ఎలా చెపుతావ్ ?'

'ఇలా చెపుతా' మళ్ళీ సౌంజ్ఞలు చేసింది పార్వతమ్మ.

"వద్దని చెపుతావా, సరేలే. మరి ఏది కావాలో ఎలా చెపుతావే ?" మరొక ప్రశ్న.

పాపం ! పార్వతమ్మగారికి సమాధానం దొరక లేదు. మౌనంగా వుండిపోయింది —

"వూరుకోండే మరీ చిన్నపిల్లని చేసి మాట్లాడుతున్నారు" సువర్చల పిల్లలని కోప్పడింది.

పార్వతమ్మగారికి ఏం పాలు పోవటంలేదు. తను ఎంత పొరపాటుచేసింది ? తన కూతురు యిల్లంతా వెస్టరన్ స్టైల్లో వుంటుంది. పిల్లలంతా కాన్వెంటు విద్యార్థులే. తనే ఓ సంవత్సరం ముందు నుంచి, వాళ్లదగ్గర నేర్చుకొని వుంటే, ఈపాటికి తనూ ఇంగ్లీషు మాట్లాడగలిగేది. అధమం తనకేమి కావాలో అక్కర్లేనిదో చెప్పగలిగి వుండేది తనకి ముందుచూపు లేకుండా పోయింది.

పార్వతమ్మగారికి పట్టుదల ఎక్కువయింది. ఎలాగైనా అమెరికా ప్రయాణం చేసి తీరాలి. తోడు వున్నా లేకపోయినా, ఇంగ్లీషు వచ్చినా రాకపోయినా, ఈ ప్రయాణం జరిగి తీరాలి. ఆలోచనలు మొదలు పెట్టింది. జీవితంలో ఎన్నో సాధించింది. బ్రతుకు మధ్యలో భర్త పోయినా, ఆస్తులు కాపాడుకుంటూ వచ్చి, పిల్లలని పెంచి పెద్దచేసి పెళ్లిళ్ల చేసింది. ఇప్పుడు పిల్లలందరూ చాల పెద్ద హోదాల్లో వున్నారు. అటువంటి తనకు యీరోజు అమెరికా ప్రయాణం ఓ సమస్యగా వుంది.

డైనింగ్ టేబిల్ దగ్గర కూర్చుని అడిగింది.

"ఏరా కుమార్, బొంబాయిలో విమానం ఎక్కితే ఎక్కడా దిగి మారక్కరలేదుగా — తిన్నగా అమెరికాలోనే దిగవచ్చుగదా ?" అని.

"అంతే అమ్మమ్మా—ఎక్కడా మారక్కరలేదు. కానీ సుమారు ముప్ఫై గంటలు పైనే విమానంలో కూర్చోవాలి. పైగా విమాన ప్రయాణం పడకపోతే వాంతులు రావచ్చు. వాళ్ళని అడిగితే ఏదన్నా మందు యిస్తారు. కానీ నువ్వు అడగాలిగా—అందుకు ఇంగ్లీషు రావాలిగా ?" కుమార్ ప్రశ్నార్థకంగా సమాధానం చెప్పాడు.

"సరేలే — విమానంలో మనం ఏది అడిగినా యిస్తారుగా — తినడానికీ; తాగడానికీ డబ్బులు ఏమీ యివ్వక్కర్లేదుగా ?" మళ్ళీ అడిగింది.

"అన్నీ యిస్తారు అమ్మమ్మా — దగ్గరవుండి టాయ్‌లెట్‌కి తీసుకొని వెళ్ళమన్నా తీసుకువెడుతుంది హోస్టెస్. కాని వచ్చిన చిక్కల్లా నువ్వు ఇంగ్లీషులోనే అడగాలి."

"ఉహూ — " పార్వతమ్మ ఇంక ఏమీ అడక్కుండా భోంచేయడం ఆరంభించింది.

ఆ రాత్రి పార్వతమ్మగారికి కంటిమీద కునుకు లేదు. తను విమానం ఎక్కినట్లు — ఆకలేసినట్లు— అన్నం కోసం సంజ్ఞలు చేసినట్లు — వాళ్ళు ఏదేదో పెట్టినట్లు — తనకి వాంతి అయినట్లు — అందరూ విదలించి చూసినట్లు — మధ్యలో తనని ఎక్కడో దింపేసినట్లు — విచిత్రంగా ఊహలు రాసాగాయ్.

తెల్లవారింది — పార్వతమ్మ చకచక తన పనులు చేసుకుంటోంది. చాల హుషారుగావుంది. ఎవ్వరికీ ఏమీ అర్థం కాలేదు.

"బామ్మా — టిక్కెట్టు కాన్సిల్ చేయనా ?" కుమార్ ఆఫీసుకు వెడుతూ అడిగాడు.

"రెండు రోజులు ఆగరా, చెపుతా" పార్వతమ్మ చెప్పింది నవ్వుతూ —

కుమార్ మరేం అడక్కుండా వెళ్ళిపోయాడు. మధ్యాహ్నం తన గదిలో కాన్వెంట్‌లో సెవెన్త్ చదువుతున్న మనుమరాలితో తలుపులు వేసుకొని కూర్చుంది, పార్వతమ్మ. గుసగుసలూ, నవ్వులూ — ఎవ్వరికీ ఏమీ అర్థంకాలేదు; వాళ్ళు ఏమిచేస్తున్నారో. సాయంత్రం ఏడుగంటలకి తలుపులు తెరుచుకున్నాయ్. పార్వతమ్మా మనుమరాలూ అలసిపోయిన మొహాలతో బయటకు వచ్చారు.

రాత్రి డైనింగ్ టేబులు దగ్గర పార్వతమ్మ చాల హుషారుగా వుంది.

"నా ప్రయాణం గురించి నా నిర్ణయం చెపుతున్నానురా" పార్వతమ్మ ప్రకటించింది. అందరూ ఆమెకేసి ఆసక్తిగా చూశారు, ఏం చెపుతుందోనని.

"నేను వక్కర్తినే అమెరికా ప్రయాణం చేస్తున్నా" పార్వతమ్మ నిశ్చలంగా చెప్పింది.

విన్నవాళ్ళు అదిరిపడ్డారు. మళ్ళీ ఆవిడేఅంది.

"కుమార్‌వచ్చి నన్ను బొంబాయిలో విమానం ఎక్కిస్తాడు. బొంబాయివరకూ ఇద్దరం యిక్కడ నుంచి విమానంలో వెడతాం—అమెరికాలో వాళ్ళు రిసీవ్ చేసుకుంటారు."

"కానీ మామ్మా — రోజన్నర ప్రయాణం— మధ్యలో ఏదన్నా కావలసివస్తే ఎలా" కుమార్

ఆడపిల్లల పట్ల చిన్న చూపు!

ఆడపిల్లలు చదువుల్లో వెనుకబడి ఉండటానికి కారణం ఏమిటి ? ఉపాధ్యాయుల నుండి, తలితండ్రుల నుండి సరైన ప్రోత్సాహం లభించకపోవటం వల్లనే ఆడపిల్లలు చదువుల్లో వెనుకబడి ఉంటున్నారని పశ్చిమ జర్మనీలో ఈ విషయమై ప్రత్యేక పరిశోధనలు చేశారు. ఈ పరిశోధనల్లో 35 మంది ఉపాధ్యాయులను,సుమారు వెయ్యి మంది విద్యార్థులను పరిశీలించారు. ఈ పరిశోధనల రహస్యం వారికి తెలియనివ్వలేదు. పాఠాలు చెప్పేటప్పుడు ఉపాధ్యాయులు ఎక్కువగా మగపిల్లలపైనే శ్రద్ధ చూపుతున్నారు. పొగడ్తలు, తిట్లుకూడా ఎక్కువగా మగపిల్లలకే లభిస్తున్నాయి. విరామ సమయంలో కూడా వీరు ఎక్కువగా మగపిల్లలతోనే మాట్లాడుతున్నారు. ఈ రకంగా ఆడపిల్లలను చిన్నచూపు చూస్తున్నారని ఈ పరిశోధనల్లో తేలింది.

బామ్మగారి.... ప్రయాణం

సంశయంగా అడిగాడు.

"అవన్నీ నేను చూసుకోగలను" ఆవిడ సమాధానం చాల నిబ్బరంగావుంది. అందులోని అర్థం ఆవిడమనుమరాలి ఒక్కర్తికే తెలుసు.

మర్నాడే ఓవర్‌సీస్ కాల్ బుక్‌చేసి, కుమార్ మేనమామలకు, పార్వతమ్మగారి ప్రయాణంగురించి చెప్పాడు. ఒక్కర్తే వస్తోందని విన్నవాళ్ళు కంగారు పడ్డారు. కాని పార్వతమ్మగారు తన నిర్ణయం మారదంది.

అనుకున్న ప్రకారం పార్వతమ్మగారిని బొంబాయిలో ప్లేనుఎక్కించాడు కుమార్, జాగ్రత్తలు చెపుతూ— పార్వతమ్మగారు నవ్వేసింది, తన బ్రీఫ్‌కేస్ పదిలంగాపట్టుకొని. కుమార్ మళ్ళీ కాల్ బుక్ చేసి చెప్పాడు, ఏర్‌పోర్టుకి తప్పకరమ్మనమని.

అమెరికాలో బ్రీఫ్‌పట్టుకొని విమానం దిగుతున్న పార్వతమ్మగారిని చూసిన కొడుకు రవికి మనసు కుదుటపడింది.

"అమ్మా విమానంలో చాలయిబ్బంది పడివుంటావ్—ఏం బాధ పడ్డావో ఏమో ?" రవి చాల ఓదార్పుగా అన్నాడు. పార్వతమ్మనవ్వింది. "ఏం యిబ్బందీ పడలేదురా. నాకు కావలసినవన్నీ అడిగి చేయించుకున్నా, పాపం ఆ అమెరికన్ ఆడపిల్లలు (హోస్టెసెస్) చాల మంచివాళ్ళురా." పార్వతమ్మ ఎయిర్‌హోస్టెసెస్‌కు కాంప్లిమెంట్లు చెప్పింది.

"నీవు ఇంగ్లీషు నేర్చుకున్నావా ?" రవి చాల ఆశ్చర్యంగా అడిగాడు.

"నాకు యింగ్లీషు రావటంకూడానా ?" పార్వతమ్మ మాటల్లో కొడుక్కి సమాధానం దొరకలేదు.

"మరి వాళ్ళని ఎలా అడిగావమ్మా ?"

"ఇలా అడిగా" బ్రీఫ్‌కేస్ కేసి చూపిస్తూ చెప్పింది. రవికి ఏదీ అర్థంకాలేదు.

పార్వతమ్మ బ్రీఫ్ తెరిచింది. దాన్నిండా అట్ట ముక్కలు సిగరెట్టుపెట్టె సైజులో వున్నాయ్ — సుమారు నూరూ నూటయాభై వరకు వున్నాయ్.

"ఏమిటమ్మా యివి ?" రవికి ఇంకా ఏమీ బోధపడలేదు.

పార్వతమ్మగారు గర్వంగా నవ్వింది.

"చెప్తా విను —నాకు కాఫీ కావాలి. అందులో పంచదార వుండకూడదు. ఆ పిల్లని ఇంగ్లీషులో అడగాలి. ఎలా అడిగానో తెల్సా... ఇలా... అడిగా" పార్వతమ్మ ఓ అట్టముక్క వెతికి తీసింది.

ఆ అట్టముక్కమీద ఒకవైపు తెలుగులో రాసివుంది — 'నాకు కాఫీ కావాలి; పంచదార మాత్రం వేయవద్దు' అని. రెండవవైపు తిప్పింది 'ఐ వాంట్ కాఫీ బట్ విత్ అవుట్ షుగర్' అని వ్రాసివుంది. పార్వతమ్మ యింకో అట్ట తీసింది.' "నేను టాయ్‌లెట్‌కి వెళ్ళాలి. దయచేసి దగ్గరవుండి తీసుకొని వెళ్ళవలసినదిగా కోరుచున్నా !" అని ఒకవైపు తెలుగులో వ్రాసివుంది. వెనకవైపు "ప్లీస్ హెల్ప్‌మి టూది టాయిలెట్" అని వ్రాసివుంది.

రవికి వాటిని చూస్తూంటే ఆశ్చర్యంవేసింది. గబగబా మిగతావాటిని తీసి చదవటం మొదలెట్టాడు. విమానం ఎక్కిన దగ్గరనుంచి దిగే వరకూ, ఎదురయ్యే అన్ని సమస్యలకీ తర్జుమాలు ఇంగ్లీషులో వ్రాసివున్నాయ్.

"బెల్టు పెట్టుకోలేకపోతున్నా, దయచేసి సహాయం చేయండి, వికారంగావుంది, శాకాహార భోజనమే కావాలి, గుడ్డు వద్దు" వగయిరా.

పార్వతమ్మ మొహం గర్వంతో వెలుగుతోంది.

"నేను ఎయిర్‌పోర్టుకి రాకపోతే ఏంచేసేదానివే అమ్మా ?" రవి కొంటెగా అడిగాడు.

పార్వతమ్మ చిరునవ్వు నవ్వింది. బ్రీఫ్‌కేస్ తెరిచింది. పోకెట్ నుంచి ఎర్రటి పెద్ద సైజు అట్ట తీసింది. అందులో ఒకవైపు తెలుగులోవుంది.

"నేను యిండియా నుండి వంటరిగా వచ్చా. అమెరికా నాకు కొత్త. ఇంగ్లీషు భాష నాకు రాదు. మా అబ్బాయి ఎయిర్‌పోర్టుకు వస్తానని రాలేదు. దయచేసి యీ నెంబరుకు ఫోనుచేసి, వారి అమ్మగారు వచ్చినారనీ, వెంటనే రమ్మని కబురుచేయండి. వీలయితే అక్కడకు తీసుకొని వెళ్ళండి" అనివుంది. వెనక్కి తిప్పి చూస్తే దానికి యింగ్లీషు తర్జుమా, అందులో రవి ఫోను నెంబరూ, ఇంటి అడ్రసూ వున్నాయ్.

రవి ఆశ్చర్యానికి అంతులేదు.

"అమ్మా! నువ్వే కనుక రాజకీయాల్లోదిగితే, ప్రైమినిష్టరువి నువ్వే అయ్యేదానివే" అంటూ తల్లిచేతులు ఆపేక్షగా పట్టుకున్నాడు రవి. ★

కృతజ్ఞతలు

ఈ కథకు ఐడియా యిచ్చిన మిత్రుడు దూర్వాసుల చంటి (పెద్దాపురం) గార్కి కృతజ్ఞతలు—

— 'అమంతా'

సినిమా

జయభేరి ఆర్ట్ ప్రొడక్షన్స్ చిత్రంలో మురళీమోహన్, జయసుధ

"మా హీరో ఇదివరకు ధరించిన పాత్రలన్నీ ఒక ఎత్తు. ఈ చిత్రంలోని పాత్ర ఒక ఎత్తు. ఆయన సరసన జయసుధ నాయిక," అన్నారు మాగంటి వెంకటేశ్వరరావు. ఈయన "వారాలబ్బాయి, పిచ్చిపంతులు" అనంతరం నిర్మించే జయభేరి ఆర్ట్ ప్రొడక్షన్స్ కొత్త చిత్రానికి బాలమురుగన్ కథకుడు. ఆత్రేయ, పూసల సంభాషణలు రాస్తున్నారు చక్రవర్తి స్వరకల్పనలో ఆత్రేయ గీతాలు రాస్తారు. డి. రాజగోపాల్ సంకలనకర్త. "జూన్ – జూలై మాసాల్లో షూటింగ్ జరుగుతుంది," అన్నారు నిర్మాణ సారధి కిశోర్. రాజాచంద్ర స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో తయారవుతుంది మురళీమోహన్ సమర్పించే చిత్రం.



కవిత, మురళీమోహన్ 'గ్రహణం విడిచింది'లో

నందమూరి బాలకృష్ణ హీరోగా వై. కన్నయ్య చిత్రం

"ఎస్. డి. లాల్ డైరెక్టరు," అన్నారు వై. కన్నయ్య. ఈయన కృష్ణాఆర్ట్ ఫిలిమ్స్ పతాకంలో త్వరలో ప్రారంభించే చిత్రంలో నందమూరి బాలకృష్ణ హీరో.

బాపు, రమణలతో పద్మాలయ చిత్రం

నవంబర్ నుంచి చిత్రీకరణ జరిగే చిత్రంలో జయసుధ నాయిక. ముళ్ళపూడి వెంకటరమణ రచన, బాపు దర్శకత్వంలో తొలిసారిగా పద్మాలయ తయారుచేసే ఈ చిత్రం ముఖ్యంగా మహిళల సమస్యలకు సంబంధించినది.

"లేఖ మరణం" పై శోభ తల్లి ఆగ్రహం!

"లేఖయుడె మరణం—ఒరు ఫ్లాష్ బాక్"...

"లేఖ మరణం— ఒక ఫ్లాష్ బ్యాక్" పేరున మలయాళంలో ఓ చిత్రం తయారైంది. దీనికి సుప్రసిద్ధ మలయాళ దర్శకుడు కె. జీ. జార్జ్ డైరెక్టరు. ఈ చిత్రాన్ని విడుదలకు అనుమతించవనీ, న్యాయస్థానంద్వారా చర్య తీసుకుంటాననీ స్వర్గీయ శోభ తల్లి శ్రీమతి ప్రేమ ప్రకటించింది. కారణం— ఆ చిత్రంలోని రెండు పాత్రలు, కొన్ని సన్నివేశాలు తనను, తన కూతుర్ని స్ఫురణకు తెచ్చేలా వున్నాయని ఆమె ఆరోపణ. శోభ ఉద్దేశ్యపూర్వకంగానే ఆత్మహత్యకు పాల్పడిందని చూపడం, తనను వారకాంతలా చిత్రించడం— ఇవే ఆ చిత్ర నిర్మాణంలోని లక్ష్యాలని ప్రేమ వాదన. ఈ చిత్రంలో శోభ (లేఖ)లా నళిని, ప్రేమలా శుభ, బాలు మహేంద్రలా మలయాళ నటుడు గోపి నటించారట.

"బాలు మహేంద్ర మా ఇంట్లో రెండేళ్లపాటు నివసించినప్పుడు కె.జి. జార్జ్ దర్శకత్వం వహించిన 'ఉల్కాడల్' మలయాళ చిత్రంలో మా అమ్మాయి హీరోయిన్‌గా నటించింది. అసలు ఆ చిత్రం ద్వారానే బాలు మహేంద్ర ఛాయాగ్రాహకుడుగా ప్రసిద్ధి పొందారు పైపెచ్చు— కె. జి. జార్జ్ మా ఫామిలీఫ్రెండ్ కూడాను. అందుకే మమ్మల్ని హీనంగా చిత్రిస్తూ ఓ చిత్రం రూపొందించబడిందంటే నాకెంతో బాధగా ఉంది. బాలు మహేంద్ర మీది మచ్చ తొలగిపోవడానికీ, ఆయనకు ప్రజలలో మంచి పేరురావడానికీ కూడా జరిగిన ప్రయత్నం ఈ చిత్రం అని చెప్పక తప్పదు. అసలు ఇటువంటి చిత్ర మొకటి తయారవుతోందని ముందే నాకు చూచాయగా తెలిసింది .. మేము తెలిసో తెలియకో ఎవరికీ కీడు చేయలేదు. అనవసరంగా మమ్మల్నిలా అప్రదిష్టపాలు చేయడం అన్యాయం. శోభ మరణానికి కారకులెవరో ఆ భగవంతుడికే తెలుసు. భగవంతుని కళ్ళు ఎవరూ కప్పలేరు. ఎవరూ తప్పించుకోలేరు," అని ఎంతగానో పరితపించింది ప్రేమ.

ఈ చిత్రంలో నటి లేఖ 'ఊర్వశి' గౌరవం పొందిన సందర్భంలో జరిగిన అభినందన సభ మద్రాసు కన్నిమేరా హోటల్లో చిత్రీకరించబడింది. ఈ సన్నివేశంలో పలువురు ప్రసిద్ధ మలయాళ దర్శకులు, నటీనటులు పాల్గొన్నారు.

డైరెక్టర్ కె. జీ. జార్జ్ సమాధానం: "ఈ చిత్రం విడుదలకు అనుమతించవని ప్రేమగారు అనడం తమాషాగా ఉంది. అసలు ఇది శోభ జీవితం ఆధారంగా తయారైందని ఆరోపించడానికి ఏ ఆధారాలు ఉన్నాయి? ఒక చిత్రాన్ని చూస్తున్నప్పుడు— దాంతో తమ జీవితానికి ఎక్కడో ఏదో పోలిక ఉందన్న భ్రాంతి కలిగితే, నిజానికి అది చాలా గొప్ప చిత్రంకిందే లెక్క. ప్రతి చిన్న కథకూ ఏదైనా 'ప్రేరణ' ఉన్నా— తప్పలేదు. ఏ చిత్రాన్ని చూస్తున్నా ఎక్కడో ఒకచోట తమ జీవితానికి దగ్గరగా ఉందన్న భ్రమ కలగడం అసహజమేమీ కాదు. అంత మాత్రంచేత ఆ చిత్రం విడుదలవకూడదంటే, అసలు సినిమాలు తీయడమే మానెయ్యవలసి వస్తుంది. ప్రేమగారి ఆరోపణమూలంగా మా చిత్రాన్ని చూడాలనే తహతహ ప్రజలలో ఎక్కువై, మా చిత్ర ఘన విజయానికి తోడ్పడవచ్చు."

నిర్మాతల సంజాయిషీ: "సినిమా జీవుల మనుగడ పూలపాన్పు కాదనీ, ముళ్ళబాట అని తెలియజేయడమే ఈ చిత్రంలోని ప్రధానోద్దేశ్యం అంతేగానీ, శోభకూ— ఈ చిత్రానికీ ఏ విధమైన సంబంధమూ లేదు. ఈ చిత్ర రంగంలో చిత్ర నిర్మాతల నుంచి సినిమా పాత్రికేయులవరకు ఎన్నో కష్టాలను, సమస్యలను ఎదుర్కొనిదే ఉచ్ఛ స్థితికి రాలేకపోతున్నారు. అదే ప్రధాన ఇతివృత్తంగా రూపొందించాం. అంచేత, ఈ చిత్రం చూసే సినిమారంగంలోని ప్రతివారికీ ఏ భాషవారైనా సరే— ఈ చిత్రం తమ జీవితానికి సంబంధించినదే అన్న భావన కలగవచ్చు. అంత మాత్రానికే, ఈ చిత్రం శోభ జీవితానికే సంబంధించినదని ఆరోపించడంలో అర్థమేమీ లేదు. 'స్టే 'ఆర్డర్' తేవడానికి ముందు ప్రేమగారు ఈ చిత్రాన్ని ఒకసారి చూడడం మంచిది, చూశాక ఇక ఆమె ఇష్టం."

డేవిడ్ కాచ్‌పిళ్ళె, ఇన్నసెన్ష్ ఈ చిత్ర నిర్మాతలు. వీరిలో ఇన్నసెన్ష్ ఈ చిత్రంలో ఫిలిమ్ జర్నలిస్టుగా నటించారు.

[జి. వి. జి.]

చిత్రాల పేర్లు

చిరంజీవి, రాధిక నాయకా నాయకులుగా కోడి రామకృష్ణ స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో టి. త్రివిక్రమరావు నిర్మించే విజయలక్ష్మి ఆర్ట్‌పిక్చర్స్ చిత్రం పేరు "గూఢచారి నెంబర్—1"

శోభన్‌బాబు హీరోగా దాసరి నారాయణరావు కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వంలో ఎన్. ఎన్. భట్ సమర్పించే లలితాలయమూవీస్ చిత్రం పేరు "జగన్"

"గూడెంలో ఏం జరిగింది?"

1982 సంవత్సరంలో ఉత్తమ దర్శకుడుగా ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వ కాంస్య నంది అవార్డు గ్రహీత లయన్ యు. విశ్వేశ్వరరావు "కీర్తి కాంత కనకం" చిత్రం విడుదలైన రోజునే తన తదుపరి చిత్రం "గూడెంలో ఏం జరిగింది?" ప్రారంభించారు. "నేను డైరెక్టు చేసిన అయిదు చిత్రాలకూ నా అదృష్టంకొద్దీ అవార్డులు లభించాయి. మరో విశేషం — మా విశ్వశాంతి సంస్థ 25వ ఏట ప్రవేశించింది... పదిరికుప్పం దహనకాండ ఆధారంగా నేను రూపొందిస్తున్న 'గూడెంలో ఏం జరిగింది?' చిత్రంలో సుంకర సత్యనారాయణగారిని పరిచయం చేస్తున్నాను. ఇంకా మంగళగౌరి, మురళీకృష్ణ, లలిత, ఎన్. ఎస్. ప్రసాద్, నాగేంద్రరావ్‌ప్రసాద్‌లు కూడా ఈ చిత్రంలో ఉంటారు. ఈ చిత్రాన్ని పూర్తిగా ఔట్‌డోర్‌లో షూటింగ్ చేస్తున్నాను," అని తెలిపారు ★

'పులి—బెబ్బులి'లో జయప్రద, కృష్ణంరాజు



సీరియల్

అందానికి అవతలివైపు

కేవీయస్

46

(గత సంచిక తరువాయి)

మదరాసు వచ్చేసింది సుందరి. మళ్ళీ యాంత్రిక జీవితంలో పడింది.

శతదినోత్సవానికని తను వెళ్ళటం, సుమంత్ తారసపడటం, అతనితో ఊరవతలగా కొన్ని సంవత్సరాల తరువాత మళ్ళీ ఒకసారిగడపటం, తనలో తాను నవ్వుకుంటున్నట్టు అతను నవ్వటం— అంతా కలలో జరిగినట్టు గుర్తొస్తోంది.

"ఐ స్టిల్—"

సుమంత్ పెదవివిప్పి చెప్పబోగా తను చెప్పనివ్వక ఆపేసి దాటేయించినమాట ఆమె మనసులో నిశ్శబ్దంగా ప్రతిధ్వనిస్తోంది— "ఐ స్టిల్—"

సుమంత్ జ్ఞాపకాలన్నీ ఒక్కసారిగా చుట్టుముట్టాయి. 'దొంగల మంటపం'లో నడిచిన సంభాషణ అంతా మననం చేసుకునేందుకు ప్రయత్నం చేసింది.

'అయితే సుమంత్ అంత లోతయిన మనిషా?' అనుకుంది.

ఏదో పిక్చర్‌లో పెళ్ళిపీటల సీన్ జరుగుతోంది.

మెడలో తాళికట్టటానికి హీరో లేడాడు.

మొదట అతను శ్యామలరావులా అనిపించాడు.

సినిమాలలో ఎన్నో పెళ్ళిపీటల సీనుల్లో తాళి కట్టించుకుంది సుందరి.

నిజ జీవితంలో తను శ్యామలరావుచేత కట్టించుకున్న తాళికి అర్థం ఏమిటి ?

సుమంత్‌చేత కట్టించుకోని తాళికి అర్థం ఏమిటి ?

కేశవన్ కొత్త ఫిల్మ్ తీస్తున్నాడని తెలిసి, అతను తనతో సంప్రదిస్తాడని ఎదురుచూస్తోంది సుందరి.

రానేవచ్చాడు కేశవన్. "సుందరీ !— సాయంత్రానికి అంతా సెటిల్ అయిపోయింది. జడ్. రావుగారు ముఖ్యమైన పార్ట్‌నర్‌గా వుంటారు — వాళ్ళావిడ పేరుమీదే అనుకో! స్క్రిప్టువర్కు రేపట్నుంచే — ఊటీలో జరుగుతుంది. చెప్పటం —మరిచాను. ఈ సినిమాకు వర్ణశ్రీని బుక్ చెయ్యమని రావుగారు పట్టుబట్టారు. నువ్వయితే కారెక్టర్‌కి సరిపోతావని ఎంత చెప్పినా వినిపించుకోలేదు. నేను సరేననక తప్పలేదు. బీఎస్టీ ఫిలిమ్సు కొత్త ప్రొడక్షన్ మొదలెడ్తున్నారుగా — దాన్లో చూదాంలే..."

కేశవన్ తమాషా మనిషి. ఒక్కొక్కప్పుడు పూర్తిగా వ్యాపారధోరణిలో మాట్లాడతాడు. ఒక్కొక్కప్పుడు స్వంత మనిషికన్న ఎక్కువ ఆత్మీయతగా ప్రవర్తిస్తారు.

"నువ్వేం వర్రీ అవకు సుందరీ... ఈ కేశవన్ అంటే ఏమిటి తెలీదా నీకు ?... కొత్త సబ్జెక్ట్సు రెండు మూడు తయారు చేస్తున్నాను. వాటిలో నీ ఇమేజ్ బూస్టప్ కావాలసిందే ... అలా దిగులుగా కూచోకు. రా — కాస్త రిలాక్స్ అవుదాం ..." మద్యం విషయంలో మితవాదే అయినా, చాలా హుషారుగా ఉంటాడతను.

47

ఇంట్లో పనిమనుషులున్నారు. వంటమనిషుంది. షూటింగ్ కార్యక్రమాలూ మిగత అపాయింట్మెంట్లూ సరిచూసి ఏర్పాటు చెయ్యటానికి సెక్రెటరీ ఉన్నాడు.

అయినా, వెలితి అనిపించకుండా గడిచిన దినం లేదు సుందరికి.

ఒకసారి ఒక అనాథ శరణాలయం తరఫున ఎవరో పెద్దమనుషులు వచ్చారు సుందరిని చందా అడగటానికి.

ఇన్‌కంటాక్సు బెడద నుంచి తప్పుకోవటానికి ఇటువంటి చందాలు కొంతలో కొంత ఉపకారం.

కొంచెం ఘనంగానే చందా చెక్కు రాసిచ్చి వాళ్ళని సాగనంపుతూండగా, సుందరికో ఆలోచన వచ్చింది చప్పున.

"ఏమండీ — మీ శరణాలయం నుంచి నేనొక పిల్లాణ్ణి తెచ్చుకోవచ్చునా ?— పెంచుకోటానికి—" అంది.

ఆ నిర్వాహకుల ముఖాలు వెలిగిపోయాయి. "ఓ— తప్పకుండా... అంతకంటేనా?..." అన్నాడు వాళ్ళలో ఒకాయన.

ఆ సాయంత్రం అనాథశరణాలయానికి వెళ్ళింది సుందరి.

మరీ పాపల్ని పెంచటం ఆమెకు ఎందుకో ఇష్టం లేదు. ఒక అయిదేళ్ళ పిల్లవాణ్ణి ఎంచుకుని, అవసరమైన కాగితాల మీద సంతకం పెట్టి— వాణ్ణి ఇంటికి తీసుకొచ్చింది సుందరి.

వాడి పేరు సోము. ఇంట్లో వచ్చీరాగానే ఆ పిల్లవాడు పొందిన ఆశ్చర్యం, ఆనందం—వర్ణనాతీతం.

పనివాళ్ళను అందర్నీ పిలిచి ఇకమీదట సోమును తన కొడుకును చూసుకున్నట్టు చూసుకోవాలని చెప్పింది. సుందరి.

సోముకి కొత్త బట్టలు కుట్టించింది, ఆ బట్టల వంక వాడు అద్భుతంగా చూసుకుంటూ ఉంటే ఎంతో సంతోషించింది.

వాడికో గది ఏర్పాటుచేసి అందులో పుస్తకాలూ అవీ తెప్పించి పెట్టి— వాడు చదువుకోవటానికి సదుపాయాలు చేసింది.

ఇంగ్లీష్ మీడియం స్కూల్‌కి యూనిఫారంలో కారులో వెళ్తున్న సోముని చూసుకోవటం ఎంతో గర్వంగా ఉంది సుందరికి.

అయితే ఈ ఆనందం సుందరికి ఎంతోకాలం నిలవలేదు. ఇంతాచేసి "ఏదీ — అమ్మా అనవూ నన్ను ?—" అంటే బేలగా చూస్తాడు సోము.

అలవాటు లేదు వాడికి.

సుందరిని అసలు వాడెప్పుడూ పిలవడు, అవసరమైతే దగ్గరకొచ్చి నిలుచుంటాడు.

'అమ్మా' అని పిలవమని సుందరి అడిగినప్పుడల్లా ఇక ఆ పూట బితుకు బితుకు మంటూ ఉంటాడు.

షూటింగ్ నుంచి తను వచ్చేసరికి సోము తన కోసం హాలులో ఎదురుచూస్తూ ఉంటాడనీ —

కారు ఆగగానే పరుగెత్తుకుంటూ వచ్చి తనని వాటేసుకుని తలెత్తి చూస్తూ "వచ్చావా అమ్మా— ఇంతసేపా ?..." అంటాడనీ—

జుత్తుని వేళ్ళతో రాస్తూ వాణ్ణి లోపలికి తీసుకెళ్తాననీ —

... అలా ఎన్నో రకాలుగా అనుకుంది సుందరి. కాని, ఆమె కోరికలేవీ ఫలించలేదు.

ఔట్‌డోర్ నిమిత్తం ఒక పదిహేను రోజులు కాంప్ వెళ్ళింది సుందరి.

షూటింగ్ జరుగుతుండగా మెసేజ్ వచ్చింది— సోము కనిపించటంలేదని.

జరిగిన కథ—11 సుందరి చాలా అందంగా వుంటుంది. ఆ అందమంతా ఆమె కళ్ళలోనే ఉందని చూసిన వాళ్ళంతా అనుకొంటుంటారు. ఓ ఉత్తరం ద్వారా, ఆ తర్వాత తన అందంతో ఆమెను ఆకట్టుకొంటాడు ఉద్యోగం చేస్తున్న శ్యామల్రావ్. పరీక్షలవగానే సుందరి శ్యామలరావ్‌ని పెండ్లి చేసుకుంటుంది. సుందరి శ్యామలరావ్ ప్రోద్బలంతో, దూరపు చుట్టం జగన్మోహన్ సహకారంతో 'సినిమా' లోకంలోకి అడుగు పెడుతుంది. ఆ లోకంలో ఆమెకు రకరకాల అనుభవాలు ఎదురవుతాయి. కానీ అనతికాలంలోనే మంచి పేరు సంపాదించుకుంటుంది సుందరి. ఆ పేరు సంపాదించుకోవడానికి కొన్ని అడ్డదార్లు కూడా తొక్కవలసివస్తుంది. దీనా కారణంగా శ్యామల్రావ్ సుందరిల మధ్య గొడవలు చెలరేగుతాయి. శ్యామలరావ్‌తో తెగతెంపులు చేసుకొంటుంది సుందరి. ప్రేక్షకుల్లో సుందరి ఇమేజ్ తగ్గుతుంది. కేశవన్ చిత్రంలో సుందరికి తిరిగి అవకాశం లభిస్తుంది. పాత స్నేహితుడు సుమంత్ కనిపిస్తాడు. పాత స్మృతులు ఆమె మనసును అల్లకల్లోలపరిచాయి.

మామూలుగానే – కారులో స్కూలుకి వెళ్లాడట సాయంత్రం కారువెళ్లేసరికి–సోము మధ్యాహ్నమే వెళ్లిపోయాడని తెలిసింది. అనాథ శరణాలయానికి తెలియజేసి, పోలీస్ కంప్లెయింట్ ఇవ్వమని ఫోనులో చెప్పింది సుందరి.

ఆమెలో శూన్యం మరీ భారంగా తయారయింది.

మళ్లీ మదరాసు చేరుకునేసరికి – సమాచారం తెలిసింది. సోము పోలీసులకి దొరికాడుట. కాని సుందరి బంగళాకి మాత్రం రానన్నాడు. ప్రస్తుతం అనాథ శరణాలయంలో ఉన్నాడు. ఫోన్ చేసింది సుందరి. "మేమెంతగానో ప్రయత్నిస్తున్నాం. ఊరికే ఏడుస్తాడు, పోనీ – మీరొకసారి రాగలరా ? మిమ్మల్ని చూస్తే ఒప్పుకుంటాడేమో..."

"అవసరంలేదు – మీకు చాలా శ్రమఇచ్చాను– మన్నించాలి–సోమునేమీ అనకండి, వాణ్ణి మునుపటిలాగే శరణాలయంలో ఉండనివ్వండి, నాకా అదృష్టమున్నట్టులేదు"అని ఫోన్ పెట్టేసింది సుందరి.

48

కొత్త స్క్రిప్టులు సిద్ధంచేశాడు కేశవన్, అతనిచిత్రాలకు చక్కటి ప్రజాదరణ లభిస్తూనే ఉంది. కొత్త కొత్త ప్రయోగాలుచేసే దర్శకుడిగా అతనికి పరిశ్రమలో పేరూ పలుకుబడీ ఉన్నాయి.

మూడు చిత్రాలలో కేశవన్ దర్శకత్వంలో నటిస్తోంది సుందరి. స్వంతంగా భారీ ఎత్తున సినిమాస్కోప్ ఈస్ట్‌మన్‌కలర్ తీసే ప్రయత్నంలో అతనున్నాడు.

షెడ్యూలూ షూటింగూ అంటూ నిమిత్తం లేకుండా కేశవన్ సుందరి ఇంటికి చిత్తం వచ్చినప్పుడు వస్తూ పోతూ ఉండటం పరిపాటే ! ఇందుకు సుందరి ఏ అభ్యంతరమూ చెప్పలేదు.

ఒకసారి హడావుడిగా వచ్చిన కేశవన్ చెప్పిన మాటకి లోలోపలే ఎంతో చిరాకుపడింది సుందరి. "మంత్రిగారు... వూళ్ళోకొచ్చారు. ఇదివరకు నాకు చాలాసార్లు చాలా విషయాల్లో సహాయం చేశారు. రేపు సాయంత్రందాకే వుంటారట... ఇప్పుడే ఆయన్తో మాట్లాడివస్తున్నా.. తెరమీదేతప్ప నిన్ను ఆయనెప్పుడూ నేరుగా చూళ్ళేదుట... వీలయితే అహఁ... తప్పకుండా– నువు సాధ్యమైనంత తొందరగా– అంటే సాయంత్రం తర్వాత– ఆయన్ని చూడాలి..."

ఇంకా వివరంగా ఏం చెప్పాలి ? అర్థమైంది సుందరికి.

ఆ మంత్రి తనను చూడాలి. కాబట్టి తను ఆయన్నిచూడాలి. 'చూడటం' అంటే ఏమిటి ?

ఇంతకూ ఆ సదరు మంత్రికి అరవై దాటిన వయసు. చాలా కాముకుడనీ, అల్ప సంతోషి అనీ, రకరకాల వదంతులు.

"ఏమైనాగాని... మీరిలా అడగటం..." అని అభ్యంతరం చెప్పబోయింది సుందరి.

"ప్లీజ్– సుందరీ ! నా భవిష్యత్తూ దాంతోటు నీ భవిష్యత్తూ కూడా ఈయన మీద చాలా వరకు ఆధారపడి ఉంది... మన సినిమాస్కోపుకి.."

"సరేలెండి –" అంది సుందరి, బరువుగా నిట్టూరుస్తూ.

సుందరి వెళ్ళేసరికి మంచి హుషారులో ఉన్నాడు సదరు మంత్రి. ఫుటోల్లో టోపీతో చూసిన అలవాటు, టోపీలేని ఆయన్ని చూడటం ఆయన ప్రేతాన్ని చూసినట్టు అనిపించింది.

"రా సుందరీ – ఎన్నో రోజులుగా చూడాలనుకుంటున్నా .. ఇన్నాళ్ళకి కేశవన్ అరేంజ్ చేశాడు. కేశవన్ చాలా బ్రిలియంట్ ఫెలో – చాలా ఆర్టిస్టిగ్గా తీస్తాడు సినిమాలు..."

తన గ్లాసు నింపుకుని సుందరికో గ్లాసిచ్చాడు

స్టీరియోనుంచి సన్నగా పాశ్చాత్య సంగీతం వినిపిస్తోంది. 'వాల్యూం' ఎక్కువ చేశాడాయన.


"రా సుందరీ – డాన్సు చేద్దాం –" అంటూ సుందరి నడుముమీద చెయ్యేసి రూమంతా గిరగిరా తిరగనారంభించాడు.

"వయసుమళ్ళినా– మీలో హుషారుపోలేదు–" అంది సుందరి, నవ్వుతూ.

"అబ్బ – అందమంతా నీ కళ్ళలో ఉంది అహఁ..."

తెలుగు మర్చిపోయి బూతుల్లోకి వెళ్లిపోయాడాయన.

తెల్లవారుతూండగా సుందరికి శరీరమంటేనే ఏహ్యభావం కలిగింది.



అందానికి అవతలివైపు

అక్కడేఉన్న అద్దంలోని సుందరిని చూసి ఏదో చెప్పబోయింది, మానేసింది.

చేతికందిన పేపర్‌వెయిట్ తీసి, అద్దాన్ని బద్దలుకొట్టింది.

49

"నేను చిత్రసీమనుంచి విరమిస్తున్నాను."
— సుందరి.

ఈ వార్త సినిమా పత్రికల్లో ప్రముఖంగా అచ్చయింది, ప్రముఖ పత్రికల్లో సినిమా పేజీల్లోనూ పెద్ద టైపులో పడింది.

పరిశ్రమలోని ప్రముఖులందరూ ఆమెకు ఫోన్ల మీద ఫోన్లు చేసి తమ 'కన్సర్న్' తెలియజేస్తూ — "ఎందుకూ ? అంత అవసర మేమొచ్చింది ? మేమంతా ఏమైపోవాలి ?—" అన్నట్లుగా పరామర్శించారు.

తోచినట్టు సమాధానాలు చెప్పింది సుందరి.

ఒకరికి చెప్పినట్టు మరొకరికి చెప్పలేదు.

దాంతో రకరకాల వదంతులూ వ్యాఖ్యానాలూ బయలుదేరాయి.

ఇంతకీ పత్రికా విలేఖరుల సమావేశంలో—

"బహుశా నేను చిత్రసీమ నుంచి విరమిస్తానేమో —" అంది సుందరి.

అది ఈ విధంగా అచ్చయి ఇంత గందరగోళాన్ని సృష్టించింది.

అచ్చయిన ఆ ప్రకటన తెచ్చిపెట్టిన ప్రచారం వల్ల సుందరి కోసం వచ్చే నిర్మాతల సంఖ్య కొంచెం ఎక్కువయింది.

"విరమించేలోగా మా పిక్చర్లో మీరు నటించాల్సిందే —" అంటూ పట్టుబట్టారు కొందరు.

తీవ్రంగా ఆలోచించింది సుందరి — ఈ విరమించటం గురించి, ఏమీ తోచలేదు.

విరమించి ఏం చెయ్యటం ? ఈ రకమైన జీవితానికి అలవాటు పడ్డాక — ఏం తోస్తుంది ?— అనిపించింది.

"ఇప్పుడప్పుడే విరమించటం లేదు —" అని మరొక ప్రకటన ఇచ్చి, వచ్చిన ఆఫర్‌నల్లా ఒప్పుకుంది సుందరి. దాంతో ఇంకోసారి — ఊపిరి తిరగనంత బిజీగా తయారయిపోయింది.

"మొదటి ప్రకటన కూడా సుందరి చేసిన ట్రిక్ !" అని కొందరు వ్యాఖ్యానించారు.

కేశవన్ చిత్రాలు ఒకటి వెంట ఒకటి రిలీజయి మూడూ బాక్సాఫీస్ హిట్స్ అయాయి. వాటిలో ఒక చిత్రంలో సుందరి నటనకు ప్రముఖ సంస్థల మంచేగాక ప్రభుత్వం నుంచి కూడా బహుమతి లభించింది.

బహుమతి అందుకున్న రోజు— మళ్ళీ ఒకసారి అద్దం ముందు నిలబడింది సుందరి.

అద్దంలో సుందరివేపు చూడాలంటే భయమేస్తుంది. ఆ శరీరాన్ని బద్దలు కొట్టాలనిపిస్తుంది.

ఆ శరీరం — అది —

చప్పున కదిలి ఇవతలికొచ్చేసింది సుందరి.

50

'నయనతార' సుందరి కెమిరా కన్నులో కన్ను పెట్టి ఒకానొక భారీ బడ్జెట్ ప్రణయమయ చిత్రంలో శృంగార సన్నివేశంలో నటిస్తోంది.

ఆంధ్రుల అభిమాన శృంగార నాయకుడితో పడకసీను నటిస్తోంది.

కాగితం మల్లెపూల పందిరి మంచం కాంతివంతంగా ఉందిగాని అది పరిమళించటంలేదు. కెమిరానే ప్రియుడుగా భావిస్తూ శృంగారం అభినయిస్తోంది సుందరి, అవును మరి — అది క్లోజప్.

మిడ్ షాటుకి మళ్ళీ హీరో భుజంమీద చెంప ఆన్చి నిలుచుంది. కెమిరావంక చూడకుండా — "రాజా—" అంది. కట్.

హీరో ముఖం క్లోజప్. 'పజెషన్' సుందరి తల వెనుకనుంచి.

"సుందరీ !—" కట్.

సుందరి అసలుపేరే హీరోయిన్‌కీ ఉంచారు. అదో ప్రత్యేకత.

మిడ్ షాట్ — సుందరి తల అటునుంచి ఇటు తిప్పి — తల పైకెత్తకుండా కళ్ళుమాత్రం పైకి తిప్పి — "రాజా — నేను నిన్ను ప్రేమిస్తున్నాను... నిజంగా నిన్నే ఎప్పుడూ ప్రేమించాను రాజా —" అనాలి.

ఆ తరువాత హీరో క్లోజప్, అతని నవ్వు.

తర్వాత సుందరి పెదవుల క్లోజప్ — "నా మనసు —" కెమిరా కిందికి టిల్ట్ అవుతూండగా — "నా ఈ తనువు — అణువణువు —" సుందరి నడుముమీద హీరో చేతులు బిగిసి ఉంటాయి. కట్, పైకి — హీరో ముఖంలోకి చూస్తున్న కళ్ళు — మెల్లగా మూతబడటం — క్లోజప్. "అన్నీ నీవే రాజా !" కట్.

ఫుటోగ్రాఫరు సతమతమవుతున్నాడు.

"రాజా — నిన్ను ప్రేమిస్తున్నాను..." దీన్నే రెండు మూడుసార్లు తియ్యాల్సి వచ్చింది.

కళ్ళు పైకెత్తినప్పుడు — ఫ్లడ్ లైట్ల కాంతి జిమ్మని చిమ్ముతుంది కళ్ళలోకి, అంది సుందరి కనుపాపలో మెరుస్తోంది. ఆ 'మైన్యూట్ డీటెయిల్' పట్టెయ్యాలని ఫుటోగ్రాఫర్ తాపత్రయం.

చిరాకు పడకుండా సహకరిస్తున్నాడు హీరో ?

సుందరి పైకి మామూలుగా కనబడాలని ఎంతగానో ప్రయత్నిస్తోంది. కాని వీలుకావటంలేదు. చుట్టూ ఎవరితోనూ పేచీ లేదామెకు. తనతో తనకే సరిపోవటంలేదు.

లోలోపల ఏదేదో జరిగిపోతోంది, లైట్లారిపోతున్నాయి, వెలుగుతున్నాయి, ఆరుతున్నాయి, చక్రాలు తిరుగుతున్నాయి, తలుపులు తెరుచుకుంటున్నాయి.

సుందరీ ... నీ కళ్ళు— ఏవో తలుపులు .. ఎందుకు ? ఎవరో పక్కమీంచి లేచారు ... అమ్మ అరుస్తోంది కెవ్వున—అమ్మ ఏడుస్తోంది ... చీకటి, రైలు వెళ్తోంది. ఏదో వాసన, మ్యాట్లో పిల్లం సందడి, గోల, సుందరీ— నీ కళ్లెంత బావుంటాయే ... నీ కళ్లెంత ...

చాక్లెట్ల మామయ్య—అమ్మ ఏడుస్తోంది నాన్న తలొంచుకున్నాడు ...

సుందరీ — ఎంత బాగుంటావు నువ్వు...దాబా

మీద ఎవరో...ఒళ్లంతా తడిమి...బుగ్గలు పుణికి... చీకటి, చీకటి, సినిమా జరుగుతోంది. సినిమా –

అమ్మ పక్కన తను – తెరమీద హీరోయిన్ తెల్లచీరలో ఆడుతూ పాడుతూ నీళ్లలో తడుస్తూ లేస్తూ ...

ఇంటి వరకు వెనకే వస్తున్నాడు – ఎవరో అబ్బాయి...

పచ్చ స్కూటర్ పక్కనే పాతికేళ్ల సుమంత్– ఎంత మారిపోయాడు ! ఏమీ మారలేదుట –

''ఐ స్టిల్...'' సుమంత్.

స్టిల్ సుమంత్.

యూకలిప్టస్,

కళ్లు మూతబడితే – పైన శ్యామలరావున్నా లోపల సుమంత్ లేడూ ?

''సుందరీ !...నేను – నీ పక్కన నడవను–'' ...''ఎంత స్వీట్‌గా నవ్వుతావు !...''

చీకటి

సినిమాలో సుమంత్,

ఎలా చూశాడు ?

మనిషి లోపలి చూపు, మంచివాడూ-తెలివైన వాడూ !–

''అమ్మా-షాట్ రెడీ...''

''వూఁ...''

బాగానేవుంటావు... నువ్వు గొప్ప సౌందర్య వతివి... కాని– కాని ?

సుమంత్ ! ఊరుకో... షాట్ రెడీట–

నువ్వు అందమైనదానివే... నీకు అహంకారం కూడా లేదు–

సుమంత్ ! ఎంత దుర్మార్గుడివి నువ్వు !

''ఆఁ... స్టార్ట్ !...''

''రాజా !... నేను నిన్ను ప్రేమిస్తున్నాను. నిజంగా నిన్ను నేను ప్రేమిస్తున్నాను...''

''కట్– కట్–''

''అమ్మా– డైలాగు...''

''లైట్సాన్ !–''

చదువు కుంటోంది.

''సారీ అండీ !... ఈ సారి...''

''స్టార్ట్ –''

సినిమాతరువాత రూము. రూములో సంగీతం వెనుకనుంచి చేతులు. యు ఆర్ మై డ్రీమ్స్ గర్ల్ క్వీన్ ఆఫ్ ఆల్ రోసెస్– నా గులాబీ జాబిల్లివి.,. మరెవరు ? శ్యామలరావు... తోటలో పచ్చటి చెట్లు చెట్లు అందంగా ఉంటాయే– మీతో ఒక్కసారి మాట్లాడటమే బ్రతుక్కి సార్థకత– వాడెవడు ? పుస్తకాల వాసనలో హఠాత్తుగా లైబ్రరీలో– ముద్దు– వణుకు–

''రాజా !– నిన్ను నేను ప్రేమిస్తున్నాను– నిజంగా నిన్నే ఎప్పుడూ ప్రేమించాను రాజా !...''

''కట్ !–''

షాట్ ఓకె అయింది.

సుందరి కెలాగోఉంది. చుట్టూ పనులు మామూలుగా జరిగిపోతున్నాయి. లోపల్లోపల ఏవో విడిపోతున్నాయి.

–యూకలిప్టస్, తప్పా రైటా? శ్యామలరావు– మొగుడు.శ్యామలరావు– ఏమైపోయాడు నాన్న ? ఎందుకు నాన్నా ? అలా చూడకు నాన్నా !– నేను అమెరికాలోఉన్నాను నాన్నా...

రాలేను ! అప్పుడే చచ్చిపోకు ! షూటింగుకి ఇబ్బందని– డి అండ్ సీ– లేదు లేదు– సోము కూడా పారిపోయాడు– ఇలాంటివి తప్పవు అన్నాడు–నీలూ– నీలూ మంచివాడే అందరూ మంచివాళ్ళే– జలజా నువ్వు చెప్పిందే రైటు– వీణా అయాంసారీ– నన్ను మన్నించకు వూఁహూఁ.. మన్నించకు– నన్నుచంపు.. చెట్టియార్ బంగారు పన్ను – శ్యామలరావు – మనుషుల్లో మృగం– మృగం కట్టిన తాళి ఎగతాళి– నీలూ కూడా అంతే– ఎవరైనా అంతే – కేశవన్ తెలివైనవాడే– ఇతనూ అంతే – లైట్లు జిగేలు మని —

''షాట్ రెడీ –''

మంత్రయినా, మంత్రి పిలిచినా – ఎందుకని పోవాలి నేను ? తమ్ముడూ రైటే – వాడూ వీడూ రైటే ...

''అమ్మా – షాట్ రెడీ ...''

''స్టార్ట్ —''

హీరో ఎవరు ?

శ్యామలరావు – కేశవన్ – చెట్టియార్ – మంత్రి – ప్రేక్షకుడు – వీణ – పల్లవి —

డాబా మీద చీకటి —.

ఎవరీ హీరో ?

''నా మనసు ...''

నాకు మనసూ లేదు పాడూ లేదు. నాకు మనసే లేదు.

''నా ఈ తనువు –''

బద్దలు కొట్టాలి ... పాడు చెయ్యాలి ... ధ్వంసం చెయ్యాలి – కాల్చాలి. చంపాలి.

లైట్లెయ్యండి. ఆర్పండి. వెయ్యండి. క్లాప్–

''అణువణువు... అన్నీ నీవే రాజా !...''

దగా దగా దగా — అంతా దగా ...

అంతే గదా — అంతా దగా –

తనువు అణువు అంతా రంగుపొంగు–మాంసం.

సుందరి చచ్చిపోయింది అద్దంలో. చచ్చిపోవాలి.

శరీరం.

తనువులే ఇచ్చా. అణువులే ఇచ్చా. మనసే ఇవ్వలేదు. నాకు మనసు లేదు. అందం – రంగే.

ఆర్పండి.

శరీరం — రంగే.

ఆర్పండి. వెయ్యండి.

క్లాప్ !

సుందరి నవ్వులో దారి తప్పిన భయంకరమైన మెరుపు చూసినవాడు ఒక లైట్ బాయ్– ''సార్'' అనబోతున్నాడు డైరెక్టర్‌తో –

''షాట్ ఓకె–'' అనబోతున్నాడు, అనేశాడు డైరెక్టరు –

సుందరివంక చూసి, నోరు తెరిచేశాడు.


''నో‌కె. అంతా నో‌కె. రాజా నీకు ప్రేమిస్తున్నాను. నిన్ను మనసిస్తున్నాను... ఈ తనువు – అణువణువు –''


హీరోయిన్‌కి మతి తప్పిందని ఫ్లోరంతా క్షణంలో గగ్గోలెత్తిపోయింది –

ఎవరైనా తేరుకుని ఏదైనా చేసేలోపలే వెర్రి కేకలు పెట్టుకుంటూ ఫ్లోర్‌నుంచి రయ్యిమని బైటపడి స్టూడియో గేటుదాటి నాలుగురోడ్ల కూడలిదాటి బట్టలు చింపేస్తూ విసిరేస్తూ ''రాజా – నా తనువు – అణువణువు–'' అంటూ కేకలేస్తూ పరుగెత్తిపోతూ కనిపించింది సుందరి

ఏమౌతుంది సుందరి ?

(అయిపోయింది) ●





కొత్త గొంతులు

టి.యల్. కాంతారావు

సంఘంలో దయనీయమైన
ఉపేక్షకు గురైన సామాన్యులారా!
నేను మీవాణ్ణి
మీ గురించే వ్రాస్తాను.
అర్థంకాకుండా రాయడం
మిమ్మల్ని అవమానించడానికికాదు
మీకు అర్థంకాకుండా
మీలో ఉండే మూగ జీవిత బాధే
నా కవిత.

— పి. హనుమయ్య.

వయస్సుతో నిమిత్తంలేని ఈ తరం కవి హనుమయ్యగారు. ఆయన భాషా పరిజ్ఞానం, మేధా పాటవం అపారమైనవి. వచనంలోనూ, పద్యంలోనూకూడా చేయితిరిగిన రచయిత, కవి హనుమయ్యగారు. వచన కవితలో ఆయన శక్తిని చెప్పనవసరంలేదు. ఉమర్‌ఖయ్యాం, టాల్‌స్టాయ్, లూసన్ మొదలైన ప్రపంచ ప్రముఖ మహా రచయితల్ని, కవుల్ని రసవత్తరంగా అనువదించిన ప్రజ్ఞ ఆయనది. ఆయన కవిత్వానికి హృదయం లక్షణం; మానవత్వం లక్ష్యం. సాంద్రమైన జీవితానుభూతి చిక్కని కవిత్వంగా ఆయన అక్షరాలలో రూపు కట్టింది. తన కవిత్వానికి నడక అసలులేదని ఆయన చెప్పినా జీవితాభిముఖంగా నడిపించే లక్షణం ఆయన కవిత్వంలో స్పష్టంగా ఉంది. ఆలోచనాత్మకం, అంతర్ముఖీనం అయిన నడక ఆయన కవిత్వానికి ఉన్నది. తనేం రాసేదీ కవికి తెలియదేమో కాని తను ఏం రాసిందీ పాఠకుడికి తెలుస్తుంది.

మానవ జీవన చైతన్యం అనేక ముఖాలుగా విస్తరిస్తుంది. సమాజాన్ని సంపూర్ణంగా వదలివేసిన జీవన చైతన్యం ఏ కవికీ ఉండదు. అట్లా ఉండేటట్లయితే ఆ కవిత్వం నిష్ప్రయోజనమైనదవుతుంది. మానవుడికి కూడు, గూడు, బట్ట అత్యంత ప్రాథమిక అవసరాలే అయినా, ప్రాథమిక దశనుంచి చైతన్యించి, విస్తృత పరిధిలో విహరించడానికి అవే ఆలంబనాలు అవుతాయి. ప్రాథమిక అవసరాలే పారమార్థికత వైపు ప్రస్థానింపజేస్తాయి. ఆరంభమేలేని దానికి అంతం ఉంటుందా? ఈ సమాజంలో ఈ ప్రాథమిక అవసరాల కోసం నిరంతరం శ్రమించేవాళ్ళే ఎక్కువ. సంఘ జీవితం దీనాతి దీనంగా పరిణమించటానికి మూలం ఆర్థికం కాదా? ఈ ఆర్థిక శక్తే మనిషిని పీడకుడుగానూ, పీడితునిగానూ తయారుచేస్తోంది. నిజమైన కవి హృదయం అన్యాయానికి స్పందించకుండా ఉంటుందా? సాటి మానవుడి దరిద్రావస్థకు చలించకుండా ఉంటుందా? ఉండదనే హనుమయ్యగారు చెబుతున్నారు.

ఈ భూలోకంలో
మానవ పుత్రులలో అధిక సంఖ్యాకులకు
తలదాచుకోడానికి
ఇంకా కొంపలు లేవని
ఇటీవలె విన్న గిజిగాడు
విస్తుపోయి విలపిస్తున్నాడు.
డ్యూటీ దిగివచ్చిన పాకీ పనివాడికి
పన్నీటిస్నానం, పట్టువస్త్రాలు
అందించాలనే
నైసర్గిక న్యాయానికింకా నాలుక
మొలవలేదు.
ఇవ్వడానికి పుచ్చుకోడానికి మధ్య నున్న
సరిహద్దును
చెరిపివేస్తేనేగాని
మానవుడసలైన జీవితంలో
ప్రవేశించలేడు.

ఇవ్వడానికి పుచ్చుకోడానికి మధ్యనున్న సరిహద్దే ఉండటానికి, లేకపోవడానికి మధ్యనున్న సరిహద్దుకూడా. దీన్ని చెరిపేస్తే ఏ ఆచ్ఛాదనలూలేని స్వచ్ఛమైన మానవుడు మనుగడ సాగిస్తాడు. ప్రాథమిక అవసరాలను అధిగమించిన ఏ చైతన్యమైనా మనిషిని—ఈ సంఘానికీ, దాని జీవితానికీ దూరంగా ఉండమని చెప్పదు. అట్లా చెప్పితే అది చైతన్యం కాదు; మరొకటి ఏదో అయి ఉండాలి. ఏమేరకు మనిషి జ్ఞాని అయినా, ఆ జ్ఞానం అంతా సాటి మనిషిని ఉద్ధరించడానికి కాదా? కాకపోతే— ఇన్ని మతాలూ, సిద్ధాంతాలూ దేనికి? అన్నీ మనిషి జీవితాన్ని కేంద్రబిందువుగా చేసుకొని పుట్టినవే. కాకపోతే కొన్ని సిద్ధాంతాలు మనిషిని ముందుకు నడిపిస్తాయి; మరికొన్ని వెనక్కు నడిపిస్తాయి. హనుమయ్యగారి కవిత్వ హృదయ స్పందన వెనుక మానవుణ్ణి మినహాయించిన ఏ సిద్ధాంతం కాని, మతం కాని, మరొకటి కాని లేవు. కవుల్లో యాంటీ కమ్యూనిస్టులూ ఉండవచ్చు. యాంటీ థియరిస్టులూ ఉండవచ్చు. వాళ్లకు కూడా మనిషే పునాది. లేకపోతే ఆ కవిత్వానికి విలువ లేదు. కవిత్వం కవిత్వానికి కాకుండా ఇతర ప్రయోజనాలు ఏదో నిర్వహించి తద్వారా కవిత్వంకాకుండా పోతోందనే వాదం భ్రమాత్మకమైనది. ఎవరెన్నిచెప్పినా కవిత్వం తాను నిర్వహించవలసిన చారిత్రక బాధ్యతను ఏ యుగంలోనూ విస్మరించలేదు; ఈ యుగంలోనూ విస్మరించదు. ఈ లోపుగా విశుద్ధ కళావాదులు కవిత్వాన్ని గురించి, అది ప్రసాదించే ఆనందాన్ని గురించి, మరోమెట్టు పైకెక్కి బ్రహ్మానందాన్ని గురించి పగటికలలు కనవచ్చు.

శ్రీమంతులు కుడిచే మృష్టాన్నం
ప్రతి ముద్ద
అన్నార్తుల చూపులతో ఎంగిలిపడిందే.
రెండు కళ్ళూలేని ఆ అంధుడు
అడుక్కోడానికి వస్తున్నాడు.
సాధ్యమైతే నా కన్నొకటి తీసి
అతడికి పెట్టేంత యీవికి అర్హుడు
ఆ తకు తక్కువ ఏమిచ్చినా
న్యాయం చేసినట్లుకాదు.

అంటున్న కవి వాక్కులో ఏ వేదన దాగి ఉందో తెలిస్తే — కవిత్వం ప్రయోజనాతీతమైందని ఎవడూ చెప్పడు. అక్కడ శబ్ద చమత్కారాల్లేవు. అలంకార ఆభరణాలు లేవు. సమాస బందోబస్తులు లేవు, ఛందస్సు సంగతి ఇప్పుడు చెప్పటం మరీ అనవసరం. వీటన్నిటికీ అతీతమైన మానవ వేదన మనస్సుని మూలిగించే విధంగా కవితాకృతిలో ఘనీభవించింది.

మానవ జీవితంలోని బలాన్ని, బలహీనతని కవిత్వంగా చెప్పటంలో సిద్ధహస్తులు హనుమయ్యగారు. మహమ్మదీయుల కళ్ళు మెక్కాలో, హిందువుల కళ్ళు కాశీలో, క్రైస్తవుల కళ్ళు జెరూషలేములో ప్రపంచంలో వాళ్ళు ఎక్కడున్నాకలుస్తాయట. మనుషుల కళ్ళు మాత్రం జీవిత పరమార్థంలో కలుస్తాయట. ఆ చెప్పటంలో ఎంతో వ్యంగ్యం ఇమిడి ఉంది. మతం మనిషిని మనిషిగా చూడనివ్వదు గదా! ఆయన పొయిటిక్ ఎక్స్‌ప్రెషన్‌కు 'ఆకలిగొన్న కళ్లకు! క్షమాపణ చెప్పుకునే పులివిస్తరాకులు! గొర్రెక్కూడా జాలి బుట్టించే కసాయివాడి కత్తి చేతులు! దయ్యాల వంటి ఆశలు! అమ్మాయిల వంటి దిళ్లు! అద్దంలోతప్ప తమను చూచుకోలేని అభాగ్యులు' మొదలైన పదాలు ఎన్నైనా ఉదాహరణలుగా ఇవ్వవచ్చు.

జీవితానికి ఎన్ని కోణాలైతే ఉన్నాయో అన్ని కోణాలను అనుభూతి తంత్రులుగా మీటి జీవన వీణను వినిపిస్తారు హనుమయ్యగారు. జీవితానికి సరిహద్దులు లేనట్లుగానే ఆయన కవిత్వానికీ సరిహద్దులులేవు. హాలాహలాన్ని అమృతంగా మార్చేందుకు ఎన్ని జన్మలైనా ఎత్తాలనే తపన హనుమయ్యగారిది. చీకట్లు నిండిన సమాజంలోకి మళ్ళీ వెలుగు రావాలని; క్షీణించిన విశ్వాసం మళ్ళీ మానవ జీవితంలో పునరుత్థానం కావాలని ఆయన ఆశ.

నాకు కుక్కపిల్లకు మధ్య దూరం
ప్రాణస్పందనక్కూడా అందనంతగా
ఎదిగిపోయింది
దాన్ని మళ్ళీ కలుసుకోవాలంటే
పాముల విషాన్ని, సింహాల క్రౌర్యాన్ని
ఏనుగుల మదాన్ని
మరీ ప్రమాదకరమైన మనుషుల
అహంకారాన్ని దాటాలి.

అధికార దర్పం

కందుకూరి వెంకట మహాలక్ష్మి

ఇటూ, అటూ ఓసారి చూసి-గభాల్న బల్లమీదున్న సగం బిస్కట్ల పేకెట్‌ని తీసి పేంటు జేబులో పెట్టుకుంటున్న సాగర్‌నిచూసి నిరుత్తరుడైనాడు రాజు.

తమూ, సాగర్ పది నిమిషాల్క్రితం ఆ ఇంటికి వచ్చినప్పుడు ఆ పేకెట్‌లోంచే బిస్కట్లు తీసి బంట్రోతు ఎదురుగా కూర్చున్న అల్సేషియన్ కుక్కకి పెడుతున్నాడు. తనని ఆ బంట్రోతు లోపలికి తీసికెళ్ళినప్పుడు సాగర్ తనతో "రాజూ! నువ్వెళ్ళి ఆ కాగితాలమీద సంతకాలు పెట్టేంచుకు రారా! నేను ఇక్కడే వుంటా" నన్నాడు. 'సరే' అని లోపలికెళ్ళేడు. సంతకాలు చేయించుకుని బైటికొస్తూ సాగర్‌చేసిన ఈ నీచపు పనిని కళ్ళారా చూసాడు. రాజుకి నిజంగానే మతిపోయింది. "ఛీ! ఇంత నికృష్టమైన పని చేసాడేమిటీ వెధవ!" అనుకున్నాడు మనసులోనే. పైకి ఏమన్నా మర్యాదగా వుండదని, బాధపడతాడని చూడనట్లే నటిస్తూ. "ఏరా సాగర్! నా పని అయిపోయింది, ఇంటికెళ్దామా?" అన్నాడు.

"ఓ అయాం రెడీ—" అంటూ హుషారుగా తలెగరేసాడు. ఇద్దరూ కలిసి బస్‌స్టాండుకొచ్చి తనింటివైపుకెళ్ళే బస్సెక్కారు.

రాజు మనస్సు అస్తవ్యస్తంగా వుండి సాగర్‌తో ఇందాకటంత ఫ్రీగా, హుషారుగా కబుర్లు చెప్పలేక పోతున్నాడు. ఎంత మర్చిపోవాలన్నా మరుపు రావటం లేదు.

సాగర్, తనూ ఇన్‌టర్‌నుంచి, బి.ఏ. దాకా ఒకే కాలేజీలో చదువుకున్నారు. అన్నదమ్ముల్లా ఇద్దరూ రోజల్లా కలిసే తిరిగేవారు, కలిసే చదువుకునేవారు. ఒకరినొకరు పూర్తిగా అర్థం చేసుకున్న స్నేహితులు. వాదనొచ్చిందంటే మాత్రం మొండిగా వాదించి పట్టుదలగల సాగరే నెగ్గేవాడు. రాజుది కాస్త మెత్తని స్వభావం. దాంతో తప్పొప్పులు ఎవరివైనా, ఏది న్యాయమేది అన్యాయమైన "పోనీ లేరా!" అంటూ తగ్గిపోయేవాడు. "అలా అన్నింటికీ తగ్గిపోగూడదు. మనిషిలో పట్టుదల వుండాలి. లేకపోతే ఒకడి చేతిక్రింద నీళ్ళే శరణ్యం" అనేవాడు.

ఇద్దరూ బి.ఏ.లతోటే ఆర్థిక ఇబ్బందుల వల్ల చదువులాపేసారు. రాజుకి ఢిల్లీలో ఓ ప్రయివేటు కంపెనీలో చిన్న ఉద్యోగం రావడంతో అతను ఢిల్లీ కాపురస్థుడయ్యాడు.

సాగర్‌కి కదుపులోని చల్ల కదలకుండా కాకినాడలోనే ఉద్యోగం వచ్చింది. దాంతో అతని జీవితం నిశ్చింతగానే సాగిపోతోంది.

ఆఫీసు పనిమీద ఢిల్లీకి వచ్చిన సాగర్ ఢిల్లీలో



వున్న వాళ్ళ బాబాయ్ దగ్గిర దిగాడు. వచ్చినరోజే రాజుని చూడ్డానికి వాళ్ళింటికి వెళ్ళేడు. సాగర్ వెళ్ళేసరికి రాజు చాలా హడావిడిగా వున్నాడు. ఎక్కడికో వెళ్ళడానికి తయారవుతున్నాడు. సాగర్‌ని చూసి చిరునవ్వుతో ఆహ్వానించాడు.

"ఎక్కడికిరా బాబూ ! ప్రయాణం," అన్నాడు ఇటూ, అటూ తిరుగుతూనే తనతో కబుర్లు చెప్తున్న రాజుతో.

"ఈ రోజు మా బాస్ కూతురి పుట్టిన రోజురా ! అక్కడ పన్లు చూసిపెట్టడానికి తొందరగా రమ్మన్నాడు. అందుకే ఈ కంగారురా ! రారా ! అలా బజార్లోకెళ్లి వద్దాం" అంటూ బజారుకెళ్ళి వచ్చారిద్దరు.

మేనేజరింటిదాకా రాజుకూడా వెళ్ళిన సాగర్ తిరిగి వెళ్ళిపోతుండగా "సారీరా ! ఈరోజు ఈ హడావిడివల్ల సరదాగా, సావకాశంగా కబుర్లు చెప్పుకోడం పడలేదు, రేపు సాయంకాలం తొందరగా భోజనానికే వచ్చెయ్య"మని మరీ, మరీ చెప్పి పంపేడు.

"సరే భాయ్ !" అని వెళ్ళిపోయాడు సాగర్.

అన్నమాట ప్రకారం మర్నాడు ఆరుగంటలకల్లా రాజు ఆఫీసు గేటు దగ్గిర నిలబడ్డాడు సాగర్.

ఆఫీసునుంచి బైటికొస్తున్న రాజు సాగర్‌ని చూసి నవ్వుతు "హాయ్ సాగర్ ! వచ్చావా ?" అంటూ పలకరించాడు.

అ ధి కా ర ద ర్పం

"నువ్వు రమ్మంటే రాకపోవడమా ! నీతో ఎన్నో కబుర్లు చెప్పాలని వచ్చినదగ్గరనుంచి తహ, తహ లాడిపోతుంటే ! అందునా మనం కలుసుకుని నాలుగేళ్ళయి పోతోందాయె !" అన్నాడు.

'పదరా ! దారిలో చిన్నపనుంది. అది చూసుకొని ఇంటికెళ్దాం'' అన్నాడు రాజు.

''ఇవాళకూడా ఏం పనిరా ?'' అన్నాడు సాగర్.

''ఏం లేదురా ? ఈ పే ప ర్ల మీ ద మా మేనేజర్‌చేత సంతకాలు పెట్టించుకుని వచ్చేద్దాం. ఇవి చాలా అర్జంటు పేపర్లురా ! రేప్పొద్దున్నే డిస్పాచ్ చెయ్యాలి. ఈ రోజు మా బాస్ ఆఫీసుకిరాలేదు. నిన్న వాళ్ళమ్మాయి పుట్టినరోజు అయిందికదా ? అలసిపోయాడుట. సాయంత్రమొచ్చి సంతకాలు పెట్టించుకెళ్ళమని ఫోన్ చేసాడు. జస్టు ఓ పది నిమిషాలేరా ! అటునుంచి మా ఇంటికెళ్ళిపోదాం'' అంటు బస్‌స్టాపువైపుకి దారితీసాడు.

రాజుని అనుసరించాడు సాగర్.

మేనేజరింటికెళ్లి గేటు తీసేసరికి నౌకరేస్తున్న బిస్కట్లు అందుకుంటోన్న ఆల్సేషియన్ వీళ్ళని చూసి గేటుమీదకి దుమికి ''భౌ, భౌ'' మంది. వచ్చినపని నౌకర్‌తోచెప్పగానే కుక్కనికట్టి, బిస్కట్ల పేకెట్ బల్లమీదపెట్టి రాజుని లోపలికి తీసుకెళ్ళాడు.


బైటికొస్తూ తన కళ్ళారాచూసిన ఆ దృశ్యాన్ని మర్చిపోదామన్నా మర్చిపోలేకుండా వున్నాడు రాజు. ''కుక్కబిస్కట్లు దొంగిలించే అంత నీచానికెందుకు దిగజారాడు ? ! అంత బిస్కట్లు తినాలనివుంటే కొనుక్కుతినలేనంత హీనస్థితిలో లేడే ! చదువుకునే రోజుల్లో ఎంతహుందాగా వుండేవాడు. పైగా మనిషికి గౌరవం, మర్యాద ముఖ్యమని నీతులుబోధించేవాడు.తనే చిన్నపొరపాటుచేసినా ఖండించి చెప్పి తన్ని సరిదిద్దేవాడు. అలాంటిసాగరేనా ఈ పని చేసింది !!'' అని అదేపనిగా ఆలోచించసాగాడు. ''న మ్మ లే ని నిజం'' అనుకున్నాడు మనసులోనే.


ఇంటి స్టాపు రాగానే బస్సు దిగారిద్దరు.

''ఏరా.రాజూ ! అలావున్నావేరా ? మీ మేనేజరేమన్నా అన్నాడా ? లోపలికెళ్లిరాగానే నీ మూడ్ మారిపోయింది ! ఇందాకటి హుషారులేదు, డల్‌గా అయి పోయావేం ?'' అన్నాడు.

న గ వా చి లా వేసిన ఆ ప్రశ్నకి రాజు వళ్ళు మండింది. సాగర్‌ని గట్టిగా దులిపెయ్యాలనిపించింది. కానీ ఎందుకో ఏమీ అనలేక ''ఏం లేదురా ! బాగానే వున్నానే !'' అన్నాడు నవ్వడానికి ప్రయత్నిస్తూ.

ఇంట్లోకి రా గా నే వి శా ల ఎ దు రొ చ్చి ''అంకుల్ !'' అంటూ సాగర్‌ని చుట్టేసింది. విశాలని ఎత్తుకున్న సాగర్‌తో ''మా అమ్మాయితో కబుర్లు చెప్తూ వుండరా ! అయిదు నిమిషాల్లో





ముఖం కడుక్కుని వస్తా'' నంటూ లోపలికెళ్ళాడు రాజు.

''అంకుల్‌ని అల్లరి పెడుతున్నావా విశాలా !'' అంటూ వేడి వేడి కాఫీలతో లోపలికొచ్చింది రాజు భార్య లలిత.

''లేదు మమ్మీ ! అంకుల్ చూడు నాకు ఎన్ని క్రీమ్‌బిస్కట్లు తెచ్చారో !'' అంటూ రెండు చేతుల్లో వున్న బిస్కట్లని చూపించి, సంతోషంతో గంతులేస్తూ ఓ బిస్కట్ నోట్లో పెట్టుకుంది.

అప్పుడే లోపలికి ప్రవేశిస్తున్న రాజు కూతురి చేతిలో, నోట్లో బిస్కట్లని చూసి ఒక్కక్షణంపాటు సాగర్‌కేసి ఊపిరి బిగపట్టి కోపంగా, అసహ్యంగా చూసాడు. మరుక్షణమే ''ఛీ!'' అంటూ వచ్చి కూతురి నోట్లోంచి, చేతుల్లోంచి బిస్కట్లు లాక్కుని వీధిలోకి గిరటేసాడు.

నోటి దగ్గర బిస్కట్లని లాక్కుని పారెయ్యడంతో విశాల గట్టిగా ఏడవడం ప్రారంభించింది.

భర్త అలా ఎందుకు చేసాడో అర్థంకాక లలిత నివ్వెరపోతూ చూస్తూ నిలబడిపోయింది. గట్టిగా ఏడుస్తూ విశాల తల్లిదగ్గరకి రాగానే ఎత్తుకుని వూరడిస్తూ 'ఏమయిందండీ? బిస్కట్లలా ఎందుకు పారేసారు?' అంది భర్తవైపు కోపంగా చూస్తూ.

''కుక్కబిస్కట్లు తినే అంత ఖర్మ నా కూతురికేం పట్టలేదు. కావాలంటే వాళ్ళూరు తీసుకెళ్ళి వాడి పిల్లలకి పెట్టుకోమను'' అంటూ భార్యమీద ఎగరడంతో అసలేమీ తెలియని లలితకి ఏమీ అర్థంకాక రాజూ, సాగర్‌లని మార్చి, మార్చి చూసింది. సాగర్ ఈ గొడవతో తనకేం నిమిత్తంలేనట్టు పేపరు చూసుకోసాగాడు. ''కుక్క బిస్కట్లేమిటండీ! క్రీమ్ బిస్కట్లుతెచ్చి సాగర్ దానికిచ్చాడు. నిన్న అతనెదురుగానే ఆ బిస్కట్ల పేకెట్ చింపిందని దానిని చావగొట్టేరు. పాపం చంటిపిల్ల బిస్కట్లకి దెబ్బలుతిందని ఇవాళ తెచ్చి దానికిచ్చినట్లున్నారు. దానికింత రాద్ధాంతం, నామోషీ ఎందుకూ'' అటూ ఈసడింపుగా చూసి విశాలనెత్తుకుని లోపలికెళ్ళిపోయింది లలిత.

అంతవరకూ జరిగిన గల్లంతు, ఘర్షణ ఒక్కసారి ఆగిపోవడంతో, చిన్న గాలిదుమారం లేచి చప్పబడినట్లయి గదంతా నిశ్శబ్దం ఆవరించింది. ఇంతవరకు తనకేం పట్టనట్లు పేపరు చదువుతున్న వాడల్లా, లలిత లోపలికెళ్ళగానే సాగరే ముందుగా ఓ కాఫీకప్పు తీసుకుని, ''కాఫీ తాగరా రాజూ!''అన్నాడు. రాజు ఏమీ మాట్లాడకుండానే కాఫీకప్పు అందుకుని ఖాళీ చేసేడు.

నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ ''రారా రాజూ ! లలిత వంటచేసేలోపల అలా బైటికెళ్ళొద్దాం.'' అంటూ లేచాడు. ఇష్టంలేకపోయినా వెళ్ళక తప్పలేదు రాజుకి.

సాగర్‌వెంట నడుస్తున్న రాజుకి అంతా అయోమయంగా వుంది. ''ఇన్ని మాటలన్నా సాగర్‌కి చీమ కుట్టినట్లయినా లేదేమిటి! గ్రహించుకోలేదా? అతనెదురుగానే ''కుక్కబిస్కట్ల''ని నిందించినా, బిస్కట్లు బైట పారేసినా ఏమీ పట్టించుకోకుండా తనతోమామూలుగా కబుర్లుచెప్తూ, షికారు రమ్మన్నాడేమిటి!! ఆత్మాభిమానం,గౌరవం, మర్యాద అంటూ లెక్చర్లిచ్చేసాగరేనా ఇంతలామారిపోయింది?! మంచీ, మర్యాద లేకుండా ఆ బిస్కట్లు తెచ్చి నా కూతురికే ఇవ్వడమేమిటి ? వీడికి మతిగానీ పోలేదు కదా ?'' అని ఆలోచించ సాగాడు.

''ఒక్క నిమిషంరా !'' అంటూ ఎదురుగా వున్న ఓ షాపులోకెళ్ళి ఇంకో బిస్కట్ల పేకెట్ కొనుక్కొచ్చాడు సాగర్. అంతవరకూ ఓర్చుకున్న రాజుకి ఆ పాకెట్ చూడగానే పట్టలేని ఆగ్రహం వచ్చి, శరీరంలోని రక్తం ఉడకసాగింది. అదెవరికోసం కొన్నాడో తెలిసినా సాగర్ నోట విని దులిపెయ్యాలని, ఏమీఎరగనట్లు ''అది ఎవరికోసంరా!'' అన్నాడు వీలయినంత సౌమ్యంగా.

''విశాలకిరా ! పాపం ఇందాకా దాని నోట్లో బిస్కట్లు కూడా విసిరేసావు'' అన్నాడు మామూలుగానే.


సాగర్ మాటలకి తారాజువ్వలా లేచాడు రాజు ''ఒరేయ్ సాగర్ ! ఏమిటిరా నీ ఉద్దేశ్యం ? చాలాసేపటి నుంచీ నీ చర్యలు చూస్తున్నాను. ఇంటికి భోజనానికి పిల్చి ఎందుకవమానం చెయ్యడమని వూరుకున్నాను. వూరుకున్నకొద్దీ నీ బుద్ధి మరీ దిగజారిపోతోంది. మా మేనేజరు బంట్రోతు కుక్కకి పెడుతున్న బిస్కట్ల పేకెట్ నేను బైటికొస్తుండగా నీ పేంటు జేబులో దాచడం చూసాను ఆ వెధవ దొంగ గడ్డి తెచ్చి నా పిల్లకే పెట్టేవు. చాటుగా దాచి తెచ్చిన ఆకుక్క బిస్కట్లు కూతురికి పెడుతుంటే ఏ తండ్రి చూస్తూ వూరుకుంటాడురా విసిరెయ్యక ! నీ చర్యలు చూసానని తెలియచెప్పడానికే అవి నీ ఎదురుగా అలా విసిరేసాను. ఎంతలేనివాడి కూతురయినా దానికి కుక్క బిస్కట్లు తినే అంత ఖర్మ పట్టలేదు. అవి విసిరేసానని సిగ్గుపడి మళ్ళీ ఈ పేకెట్ కొన్నావా ? నీ ముష్టి బిస్కట్లు తినకపోతే అదేంచావదు. దయచేసి నా కూతురికి నీ ముష్టి బిస్కట్లు అక్కరలేదు. ఇవ్వకు'' అంటూ ఆవేశంతో ఎగురుతున్న రాజుని చూసి

''ఒరేయి రాజూ! మీ మేనేజర్ కుక్కకి పెడుతున్న బిస్కట్లు కుక్క బిస్కట్లు కావురా! అవి మనలాంటి గుమాస్తాలం మన పిల్లలకి కొనిపెట్టలేని ఖరీదైన బిస్కట్లే, ఆ మేనేజర్ కుక్కకి తినిపిస్తున్నాడు. కుక్కతింటోన్నవితెచ్చి నీ కూతురి కిచ్చాను

ప్రేమ వివాహాలు వద్దు !

ప్రేమ వివాహాలపట్ల ఎక్కువమంది జపానుయువతులు విముఖత చూపుతున్నారు. వివాహాలగురించి జికె ఇన్‌స్టిట్యూట్ ఇటీవల ఒకసర్వే జరిపింది. కొన్ని ముఖ్యనగరాలలో నివసించే 698 మంది స్త్రీలను ప్రశ్నించారు. వీరిలో 60శాతం అవివాహితులు కాగా మిగిలినవారు గత అయిదేండ్లలో వివాహమైనవారు. ప్రేమించి వివాహం చేసుకోవాలా అనే ప్రశ్నకు 40.9 శాతం మంది కాదని సమాధానమిచ్చారు. సుమారు 37 శాతం మంది మాత్రం ప్రేమించినవ్యక్తినే వివాహమాడాలని తెలిపారు. ఎక్కువమందికి వివాహం పట్ల వాస్తవదృక్పధంఉన్నట్లు కన్పిస్తున్నది. వీరు వివాహాన్ని నిర్మాణాత్మక ఒప్పందంగా భావించారు.





అధికార దర్పం

గనక నీకవి కుక్కబిస్కట్లయ్యాయి. ఒక్కసారి నిన్నటిరోజుని గుర్తుచేసుకో.

మీ మేనేజర్ తన కూతురి పుట్టినరోజుకి మీలాంటి వాళ్ళని పార్టీకి పిల్చాడు. ఎందుకు ? ప్రేమతోకాదు. అక్కడకూడా మీకు ఆయన ఆఫీసరే గనక. మీలాంటి వాళ్ళచేత ఇంట్లోకూడా చాకిరీ చేయించుకోడానికి. అప్పుడు నీకు నామోషీలేదురా ? ఈ పౌరుషం ఏమయింది ? పైగా ఆ పుట్టినరోజు కెళ్తూ ఏదో ప్రెజెంట్ తీసుకెళ్ళాలని తెగ తాపత్రయపడ్డావు. నెలాఖరు డబ్బుల్లేవని నా దగ్గరే ఓ పదిరూపాయలడిగి, బజారంతా తిరిగి ఆ పది రూపాయలకే ఏమీరాక క్రీమ్ బిస్కట్ల పేకెట్ కొన్నావు. ఆ పేకెట్‌చూసి విశాల బిస్కట్లిమ్మని ఏడిచింది. తనకీకావాలని మారాం చేసింది. ఏం,అప్పు చేసి దానికే ఓ పేకెట్ కొనలేకపోయావా ?''

''అయితే అందుకు కుక్కకి పెడుతున్నవి తెచ్చిస్తావా ?'' అన్నాడు రెచ్చిపోతు.

''ఆగు. రోడ్డుమీదలా ఎగరకు— అంతా వింటూ చూస్తున్నారు. నిన్న నువ్వు ఆ పేకెట్ బల్లమీద పెట్టి లోపలికెళ్ళగానే విశాల చాటుగా ఆ పేకెట్ మూత తెరిచింది. అది చూసి నువ్వు ఉగ్రుడవై పోయావు. ''చిన్నపిల్ల దానికి జ్ఞానంలేదు. తినాలన్న ఆశతప్ప'' అనయినా ఆలోచించకుండా ఆ పేకెట్ చింపినందుకు వళ్ళు తెలీకుండా చావగొట్టేవు. అది నీ మేనేజర్ కూతురికని, తమ మేనేజర్ కూతురిలాంటిదాన్ని కానని ఆ పసిదానికి తెలిసుంటే అది చింపేది కాదేమో ! కానీ నీకో !! నీ కూతురికన్నా ఆ మేనేజర్ కూతురెక్కువ. అందుకే నీ బిడ్డని ఏడిపించి మెహర్బానీ పొందడానికి మేనేజర్ కూతురికి తీసుకెళ్ళేవు'' అన్నమాటల్ని సాగర్ పూర్తిచెయ్యకుండానే రాజు అందుకుని ''అలాగని ఎవరన్నారు ? పుట్టిన రోజుకి ఏదో కానుక తీసుకెళ్తారు అలాగే నేనూ కొన్నాను. అది చింపిందని కోపమొచ్చి కొట్టేను. అంత మాత్రాన నా కూతురికన్నా మేనేజర్ కూతురు గొప్పది అన్న అర్థం, భావం ఎక్కడుంది ?'' అన్నాడు.

''ఉందిరా ! వుంది. మేనేజర్ కూతురే కాదు. అతని కుక్కకూడా నీ కూతురికంటే గొప్పదిరా ! అందుకే నువ్వు నీ కూతురికి కొనిపెట్టలేని బిస్కట్లు మేనేజర్ వాళ్ళ కుక్కకి పెడుతున్నాడు. కాదు, కాదు. నువ్వే మీ మేనేజర్ కుక్కకి నీ కూతురికి కొనిపెట్టలేని బిస్కట్లు పెట్టేవురా ! చాలీ చాలని జీతాలతో బ్రతుకులు సాగిస్తూ, నెలాఖర్న డబ్బుల్లేకపోయినా అప్పుచేసి, పటాటోపానికి, నీ శక్తికి మించినా బిస్కట్ల ప్యాకెట్ ని కొని నీ మేనేజర్ కూతురికని తీసుకెళ్ళేవు. అవి నీ బిడ్డ తాహతుకి మించిన ఆహారం — నీ యజమాని కుక్కకి ఫలహారమని తెలుసుకో. కావాలంటేచూడు'' అంటూ ఇందాకా మేనేజరింట్లో జేబులో దాచిన బిస్కట్ల ప్యాకెట్ కాగితాన్నితీసి రాజుకి చూపించాడు. దాని మీద ప్రెజెంటెడ్ టు రమా ఫ్రం రాజు'' అని నిన్న తను వ్రాసి అంటించిన కాగితం చూసి ఎప్పటిలాగే సాగర్ ఎదుట తల వాల్చేసాడు రాజు. ★

“డాక్టర్, మాకు ఒకరంటే ఒకరికి ఎంతో ప్రేమ, కాని...”


దిలీప్, రజని ఎంతో బెంగతో తమ కుటుంబ డాక్టర్‌ని కలుసుకున్నారు. “మేము బహుశ ఒకరికొకరం తగమనుకుంటాం డాక్టర్” అని, తన విచారాన్ని కప్పిపుచ్చుకుంటూ అన్నాడు దిలీప్. డాక్టరుగారు నెమ్మదిగా ప్రశ్నించి రజని సమస్య తెలుసుకున్నారు. విషయం ఏమిటంటే, ఆమె జననాంగం లోపల పొడిగా వుండటం వల్ల వారి దాంపత్య సంబంధానికి ఇబ్బంది కలుగుతోంది. డాక్టర్ ఇలా చెప్పారు. ఇటీవలి వరకూ ఈ అవసరానికి తగిన సాధనమేదీ ఉండేది కాదు. కాని అదృష్టవశాత్తూ ఇప్పుడు జాన్సన్ అండ్ జాన్సన్ కంపెనీ—ఈ కంపెనీ పిల్లల సంరక్షణ ఉత్పత్తులకు పేరు పొందిన కంపెనీ— ఒక ఉత్పత్తిని తయారుచేసింది. దాని పేరు కె-వై* జెల్లీ. ప్రత్యేకంగా తయారైన ఈ జెల్లీ స్వచ్ఛమైనది, తేలికగా వుండే జారుడునిచ్చేది, అచ్చం శరీరపు సహజమైన జారుడు ద్రవం లాగా ఉంటుంది. అంతేకాదు. ఇది నీటిలో కరిగిపోతుంది, పట్టుకొని కాని, జిడ్డుగా కాని ఉండదు. దీన్ని ఎంతో అనువుగా ఉపయోగించవచ్చు, సులభంగా కడిగేసుకోవచ్చు.

డాక్టర్ ఇంకా ఇలా అన్నారు. కె-వై* జెల్లీ క్రిములు లేనిది. దీని పి. హెచ్. స్థాయి (ఆమ్ల, క్షార నిష్పత్తి) మనుష్య చర్మానికి అనుగుణంగా ఉంటుంది. అంచేత, ఇది పూర్తిగా సురక్షితమైనది. దీన్ని భార్యా భర్తల్లో ఎవరైనా ఉపయోగించవచ్చు. కె-వై* జెల్లీ రాసుకోగానే, పొడిదనం పోయి మృదుత్వం వస్తుంది. ఈ జెల్లీ ఒక పల్చని పొరలాగా ఏర్పడి, సున్నితమైన చర్మాన్ని ఒరిపిడి నుంచి కాపాడుతుంది అని వివరించారు డాక్టర్. కొంతకాలం తర్వాత వారికి కె-వై* జెల్లీ ఉపయోగించవలసిన అవసరం ఉండకపోవచ్చు. అయినప్పటికీ దాంపత్య సంబంధం సంతృప్తినిచ్చేందుకు ఒక జారుడు పదార్థంగా ఈ జెల్లీని వారు ఉపయోగించడం మంచిది అని సలహా ఇచ్చారాయన.


దిలీప్, రజనిల బెంగ తీరింది. కాని వారికో అనుమానం వచ్చింది. “....మాకు పిల్లలు పుట్టడానికి ఇది ఆటంకం కలిగించదా డాక్టర్” అని అడిగారు. ఆరోగ్యమైన, చక్కని బిడ్డల్ని కనడానికి కె-వై* జెల్లీ ఎటువంటి ఆటంకం కలిగించదు అని చెప్పారు డాక్టర్.

తేలికైన మనసులతో సెలవు పుచ్చుకున్నారు ఆ దంపతులు. ఇంకొక వైవాహిక జీవితం ఇప్పుడు సుఖప్రదం కాబోతోంది.

“డాక్టర్ మాకు ఒకరంటే ఒకరికి ఎంతో ప్రేమ, కాని...”




LUBRICATING JELLY
K-Y
NON-GREASY WATER SOLUBLE
MILD LUBRICATING JELLY
కె-వై* జెల్లీ
ప్రపంచమంతటా దంపతులకోసం
డాక్టర్లు సిఫారసు చేసినది.
Johnson & Johnson



కొలుచు కంటెతీరు చనుకట్లు పయింబడు....

జమ్మి కోనేటిరావు

ఈ ఒక్క పద్యం చాలు మన సంస్కృతిలో స్త్రీ వక్షోజాలకి ఎంత ప్రాముఖ్యం, పవిత్రత ఆపాదించబడిందో తెలుసుకోడానికి. కరుణరసం, భక్తి రసం కనబడతాయి కాని శృంగారరసం ఏకోశానా కనబడదు. కమలా కుచ చూచుక కుంకుమతో అనే శ్రీ వెంకటేశ్వర సుప్రభాతస్తోత్రం కూడా ఈ విషయాన్ని ధృవీకరిస్తుంది. ఇందులో శృంగార రసం కన్న భక్తిరసం మేళవింపు ఎక్కువ. ఇక కాళిదాసు కుమారసంభవంలో పార్వతీదేవిని వర్ణించిన సందర్భంలో ఎక్కువ శృంగారరసమే ఉందేమో! ''ఆమె కుచద్వయం పరిపూర్ణత్వాన్ని సూచిస్తూ, అవి ఒకదానినొకటి రాసుకొంటూ ఉంటే ఆ రాపిడిని ఆమె భరించలేకపోతోంద''ని అన్నాడు. అసహజమైన లైంగిక భావాలకి ఈ సందర్భాలలో తావులేదు.

వెనకటికి ఒక వైద్యకళాశాల తరగతిలో క్లాస్ ముగింపులో ఒక డాక్టర్ ఉపాధ్యాయుడు ఇలాఅన్నాడు. ''... అందువల్ల మీరు గమనించవలసింది స్త్రీ వక్షోజాలు పసిపాపలు ఆహార స్వీకారానికి సృష్టి నిర్దేశించిన నిర్మాణాలేకాని పెద్దవాళ్ల ఆనందానికి, అనుభవానికి చిహ్నంకాదు సుమండీ'' అని. అమ్మాయిలు సిగ్గుతో తలవంచుకోడం, అబ్బాయిలు ముసిముసినవ్వులు సహజంగానే జరిగాయి.

అయితే సాంస్కృతికరీత్యా, బిడ్డ పోషణరీత్యా ఇవి సత్యమే అనుకొన్నా మానవలైంగిక ప్రవృత్తికి వీటికి సంబంధంలేదా? అంటే కేవలం వీటిని మానవుడు ఆ దృష్టితో చూడడం (వర్ణించడం) దోషమా? జీవశాస్త్రరీత్యా దీనికి జవాబు 'కాదు' అని అనవలసివస్తుంది.

క్షీర గ్రంధులయిన ఈ నిర్మాణాలు, ఈ రూపంలో మానవజాతికి ప్రత్యేకమైనవి. కొంతవరకైనా మానవలైంగిక ప్రవృత్తికి అనుగుణంగా ఇవి పరిణమించాయి. నిజంగా మానవజాతికి ఇవి వరం అనాలి. ఇతర ప్రయిమేట్‌లయిన కోతులు, వాలిడీలలో క్షీరగ్రంధులు సంతానోత్పత్తి కాలంతోబాటు అభివృద్ధి పొందడం, తరువాత క్షీణించడం జరుగుతుంది. అప్పుడు కూడా చూచుకం మాత్రం అభివృద్ధి చెందుతుంది. అయినా వాటిలో కూడా పాలు సమృద్ధిగా స్రవిస్తాయని గమనించాలి. అందువల్ల పాల సరఫరాకి, వక్షోజ పరిమాణానికి సంభంధం లేదు. మానవజాతిలో సంతానోత్పత్తి ప్రత్యేకంగా ఒక కాలానికిపరిమితం కాలేదు. పరిణామంలో ఇది మనకు సంబంధించి లోపించింది. అన్ని కాలాలలోను లైంగిక సంబంధానికి, సంతానోత్పత్తికి అవకాశం ఉంది.

మానవుల్లో కుచద్వయం శాశ్వత నిర్మాణాలుగా రూపొందాయి. ఆకారంలోనూ, రూపంలోను ఆకర్షణీయంగా ఏర్పడ్డాయి. వివిధ మానవ తెగల్లో ఇవి అర్థగోళాకారం (మనతోపాటు యూరపియన్ మధ్య ఆశియా ప్రాంత ప్రజలు) మూత ఆకారం (జపాన్, చైనా స్త్రీల సందర్భంగా) త్రికోణాకారం (నీగ్రో వనితలు) ఇంకా దీర్ఘ నిర్మాణాలుగా ఏర్పడతాయి.

ఇక్కడ ఒక చిత్రమైన విషయం దృష్టిలోకి తీసికోవాలి. మానవజాతి పూర్వీకులలో లైంగిక సంబంధం చతుష్పాదులలో మాదిరిగా పరభాగం నుంచి జరిగేదనేది నిర్వివాదాంశం. ఏదో దశలో, మానవుడు ద్విపాద లక్షణం రూపొందించుకొనే కాలాల్లో ఇది పరస్పర అభిముఖ పద్ధతిలోకి మారింది. దీనివల్ల పురుషుల ఆకర్షణకు వక్షోజ ద్వయం ఈ రూపంలో పరిణమించి ఉంటుంది. అంతవరకు పృష్ఠభాగంలోని పిరుదులు ఈ కార్యాన్ని నిర్వర్తించేవి. నిజానికి ఇప్పటికే అనేక ఆఫ్రికన్ తెగలలో స్త్రీకి ఉండే పిరుదుల ప్రాముఖ్యాన్నే అందానికి ఆకర్షణకి చిహ్నంగా భావించడం జరుగుతోంది. వక్షోజ ప్రాముఖ్యం లేదు వారికి.

వక్షోజాలు అని పిలవబడే ఈ నిర్మాణాలు నిజానికి రూపాంతరం చెందిన స్వేదగ్రంధులు. పురాతన క్షీరదాలలో, ఈ గ్రంధులే గంధ(సెంట్) గ్రంధులుగా కూడా రూపొందాయి. మానవుల్లో ఆ



గ్రంధులు అంతగాలేవు. కాని అన్ని క్షీరదాలలో మాదిరిగా క్షీరగ్రంధులు అభివృద్ధి చెందుతాయి. పురుషుల్లో ఇవి తక్కువగా క్షీణ దశల్లో ఉన్నా స్త్రీలలో అధికంగా ఉంటాయి.

ఆధునిక కాలంలో మన సమాజం స్త్రీ వక్షోజాలకు, వాటి ప్రదర్శనకు అధికప్రాముఖ్యం ఇస్తోంది. ఇది కేవలం పాశ్చాత్య దేశాల్లోనేకాక, మన దేశంలో కూడా వ్యాపిస్తోంది. సమాజంలో స్త్రీ తన బాధ్యతను కూడా మర్చిపోయి, తికమకపడే స్థితికి వచ్చింది. వక్షోజాలు తన ఆకర్షణ అధికం చేసుకోడానికి ఉపయోగించుకోవాలా, సంతానానికి పాలు అందివ్వడానికి వినియోగించాలా తేల్చుకోలేకపోతోంది ఆధునిక స్త్రీ. ఒక ప్రక్క బ్రాసరీ ఉపయోగం, టాప్‌లెస్ 'అలంకరణ'తో అలవాటుపడి, పసిపిల్లలకు డబ్బాపాలు, పోతపాలు ఇవ్వడంతో తృప్తిపడుతున్నారు. మరొక ప్రక్క పోతపాలు పసిపాపకు హానికరమేకాక, తన ఆరోగ్యానికి కూడా భంగకరమని గ్రహించడం జరుగుతోంది. గత పది, పదిహేను ఏళ్ల నుంచి పిల్లకు తనే పాలు ఇవ్వాలని గుర్తించగలుగుతున్నారు.

ఇటీవల ఒక ప్రముఖ పాలడబ్బాల కంపెనీ కొన్ని ప్రకటనలు చేసింది. అందులోనూ ఈ తికమక కనబడుతుంది. స్త్రీ తన స్వంత పాలే బిడ్డలకి ఇవ్వడం శ్రేష్ఠం అని చెప్తూ, ఆశక్తి లేకపోతే మా పాలు పట్టండి అని వారి సందేశం (సిగరెట్ తాగడం హానికరం అని అంటూనే కాలిస్తే మాత్రం మా సిగరెట్లు కాల్చండి అన్నట్లు.) ఈ సందర్భంగా వెనకటికి ఒక విద్యార్థి పరీక్షాధికారికిచ్చిన జవాబులు గుర్తుకొస్తాయి. ఆ జవాబులు చాలవరకు ఈ పాల కంపెనీ ప్రకటనల రూపంలోనే ఉంటాయి. తల్లిపాలు ఎందువలన శ్రేష్ఠం? అని అసలు ప్రశ్న. అన్ని పోషకపదార్థాలు, విటమిన్‌లు తగిన పాళ్లలో ఉంటాయని, ఎప్పుడు కావాలంటే అప్పుడు లభ్యం అవుతాయని, సరియైన ఉష్ణోగ్రతలో లభ్యం అవుతూ తల్లి ఒడిలోని వెచ్చదనాన్ని స్వీకరించవచ్చని, స్వచ్ఛంగా హైజినిక్‌గా ఉంటాయని, పాలు చెడిపోవడం సమస్యే లేదని అంటూ 'పిల్లికూడా దొంగతనంగా తాగలేదు' అన్నాడు. ఇక గిన్నెలు కడుక్కోవడం అవసరం లేదంటూ వెంటనే గుర్తుకొచ్చింది కాబోలు. 'ఈ పాలు చక్కని మృదువైన పాత్రలలో పాపకి అందుతాయి' అన్నాడు.

ఇటీవల అనేక పరిశోధనల వల్ల కేవలం పిల్లకే కాక, తల్లికికూడా చనుబాలివ్వడం ఎంత అవసరమో, శ్రేష్ఠమో గ్రహించడం జరిగింది. ఒకటి వక్షోజ క్యాన్సర్ నివారించడానికి అవకాశం ఉంది. రెండోది, తిరిగి గర్భధారణ కొంతకాలం ఆలస్యం కావడానికి అవకాశం ఉంది. పాలిచ్చే కాలాన్ని పొడిగించి స్త్రీ గర్భధారణ దూరం చేసుకోవచ్చు. మూడోది, గర్భాశయం పాలు ఇస్తుండే రోజుల్లోనే క్రమంగా ముడుచుకొని యథాస్థానానికి, పరిమాణానికి చేరుతుంది. పైసదుపాయాలతోపాటు పాలలోని కొలెస్ట్రాల్ బిడ్డ జీర్ణ నాళాన్ని సరియైన స్థితిలో ఉంచడం జరుగుతుంది. మొత్తానికి తల్లి బిడ్డలకు ఒక విధమైన సంపూర్ణమైన మానసిక తృప్తి, తద్వారా మంచి ఆరోగ్యానికి అవకాశం ఉంది. అందుకనే ఫ్రాయిడ్, హేవలాక్ ఎల్లిస్ వంటివారు తల్లిపిల్లల మధ్య తీర సంబంధం, స్త్రీ పురుషుల మధ్య సంబంధానికి దగ్గిర అంటూ సిద్ధాంతీకరించారు. స్తన్యం ఇస్తున్న స్త్రీకి సెక్స్ వాంఛ చాలా తక్కువ మోతాదులో ఉంటుంది.


ఈ జీవ విధిని నిర్వర్తించడంలో స్త్రీ, సంతానం ఇద్దరూ కూడా మానసిక సంతృప్తి పొందడానికి అవకాశం కలుగుతోంది. పాలుతాగడానికి ఉపక్రమించగానే బిడ్డ వక్షోజ చూచుకాన్ని కాక దాని చుట్టూ వున్న అరియోలా అనే ముదురువర్ణ ప్రాంతాన్ని వత్తిడికి గురిచేస్తుంది. బిడ్డ పెదిమల తాకిడికి, చూచుకం, అరియోలాలోని అనేక జ్ఞాన కణాలు ఉత్తేజంపొంది ఈ సమాచారం మెడడులోని పీయూషదేహం హైపోథలామస్‌కు చేరుతుంది. అక్కడనుంచి ప్రతి చర్య సమాచారం తిరిగి వక్షోజాలలోని క్షీర నిష్క్రమణ జరిగే విధంగా పురికొల్పుతుంది. ఇది లోపిస్తే పాలు ప్రయత్న పూర్వకంగా పిండి బిడ్డకు అందించవలసి వస్తుంది.

వక్షోజాలు సెక్స్ సింబల్‌గా "గుర్తించింది" అమెరికా అంటారు. భారతదేశంలో ఏనాటినుంచో దేవాలయాలమీద బొమ్మలకు వక్షోజ ప్రాముఖ్యం చూపినా అది కేవలం లేదా చాలావరకు మానవ సమాజ లక్షణం, ఆహార పోషణకు సంబంధించినదిగానే భావించాలి. సెక్స్ సింబల్‌గా గుర్తించినా అది బాధ్యతగాను విధిగాను భావించారుకాని కేవలం ఆనందానికి, అనుభవానికి పరిమితం కాలేదు.

పిల్లలకి పాలివ్వడానికి ఉపయోగపడే తిత్తులు కూడా స్త్రీ వక్షోజ మొనలు పాలు తాగుతున్నప్పుడు ఎలా ప్రవర్తిస్తాయో అలా కృత్రిమంగా ప్రవర్తించే విధంగా రూపొందిస్తున్నారు. అన్ని రకాల ప్రకటనలకు వక్షోజాలే అవసరం అయే స్థితికి వచ్చారు. బ్రాసరీలవల్ల చనుకట్టు ఆకారం అందర్నీ ఆకట్టుకొనే విధంగా పెంచడం కాని, తగ్గించడం కాని ప్లాస్టిక్ సర్జరీవల్ల రూపం, ఆకారం సరిదిద్దుకోవడం మొదలైన వాటికి కూడా తావు ఏర్పడింది. ఇది క్రమంగా అన్ని దేశాలకు— మనదేశానికికూడా— వ్యాపించింది.

కాని ప్రస్తుతం అమెరికాలోనే రివర్స్ ఉద్యమం ఆరంభమయింది. పిల్లలకు తల్లి పాలివ్వడమే శ్రేష్ఠమని దండోరాలు వేసుకొంటున్నారు, అంతేకాదు, మానవ క్షీరం నిలవచెయ్యడం, గడ్డకట్టించి అవసరమైన ప్రాంతాలకు, తల్లులకు అందజెయ్యడం ఆరంభమయింది. దీనికి కూడా ఒక 'బ్యాంక్' ఏర్పడినా ఆశ్చర్యంలేదు.

మరొక విషయంతో ఈ వ్యాసం ముగిస్తాను



పాలిచ్చేటపుడు తల్లి 'చంటి' పాపని ఏ పక్క ఉంచుకొంటుంది? ఏ పక్క 'చన్ను' అందిచ్చినా ఎడమ ఒడిలో కూర్చోబెట్టుకొని ఎడమ హృదయానికే హత్తుకొని ఉంచుకొనడం ఎక్కువగా జరుగుతుందని పరిశోధనలు నిరూపించాయి. నూటికి 80 సార్లు ఈ పద్ధతిలోనే జరుగుతుందిట. గర్భంలో ఉన్నపుడు తల్లి గుండె చప్పుడుకు అలవాటుపడిన శిశువు ఇప్పుడు కూడా ఆ గుండె చప్పుడు విని హాయిగా, నిర్భయంగా తల్లి ఒడి సుఖాన్ని అనుభవిస్తాడేమో. వర్జిన్‌మాత పాలిస్తున్న కొన్ని వందలాది సంవత్సరాల పాటు చిత్రీకరించిన పటాలలో కూడా (వందలాది పటాలను గమనించాక) 80 శాతం వరకు ఇదే పద్ధతిలో ఉండడం గమనార్హం! ★

సీరియల్

జీవన్మృతులు

ఇంగ్లీషు మూలం: బ్రామ్ స్టోకర్
స్వేచ్ఛానువాదం: కొలను వెంకట దుర్గాప్రసాద్



(గత సంచిక తరువాయి)

మినా డైరీ :

"అతనికి కొన్ని శక్తులున్నాయి. అయినా వాటికి కొన్ని పరిమితులున్నాయి. నిజం చెప్పాలంటే, అతనుకూడా ఒక బానిస. అంతకంటే ఖైదీ అనవచ్చు. నాలుగు గోడలమధ్యవున్న పిచ్చివాడు అని చెప్పొచ్చు. అతను ఎక్కడికి వెళ్ళాలనుకుంటే అక్కడికి వెళ్ళలేడు. ప్రకృతిలోని కొన్ని విషయాలకు అతను లోబడి వుండవలసిందే. కారణం మనకు తెలీదు. అతను ఏదైనా మార్గంలో ప్రవేశించాలంటే వీలుపడదు. ఎవరో ఒకరు అతన్ని లోపలికి రమ్మనమని ఆహ్వానించాలి. తర్వాత తను ఎటువంటి సమయంలోనైనా ఆ ప్రదేశంలోకి ప్రవేశించగలడు. లోపలికి ప్రవేశించే రోజున అతని దుష్టశక్తులు పనిచెయ్యవు. అప్పుడు అతనికి పరిమితమైన స్వేచ్ఛ మాత్రమే వుంటుంది. అతను ఎక్కువగా మిట్ట మధ్యాహ్నం, సూర్యోదయం, సూర్యాస్తమయ వేళల్లోనే మారతాడు. ఈ విషయాలన్నీ మనం తయారుచేసుకున్న రికార్డునుబట్టి విశదమవుతున్నాయి. కొన్ని వూహిస్తున్నాం. కాబట్టి అతను కొన్ని పరిధులకు లోబడివుంటూ అతను చెయ్యదల్చుకున్నది చేస్తాడు. కొన్ని విషయాలు అతడ్ని అశక్తుడ్ని చేస్తాయి. అవేవిటంటే, వెల్లుల్లిపాయలు, అది మనకు తెలిసిందే. ఇక పవిత్రమైన చిహ్నాలు, అంటే శిలువలాంటివికూడా. ఈ రెండు విషయాల్లో అతను చాలా దూరంగా వెళ్ళిపోతాడు. ఇంకా కొన్ని విషయాలున్నాయి, అవి పోను పోనూ మీకే తెలుస్తాయి. పెద్ద గులాబీ పువ్వు కొమ్మతో అతని శవపేటికమీద వుంచితే, అతను అందులోంచి బయటకు రాలేడు. పవిత్రమైన బుల్లెట్‌తో శవపేటికను పేల్చితే అతను నిజంగా చచ్చిపోతాడు. తర్వాత ఇక అతని బెడద వుండదు. అతని తలను నరికినా అతని పీడ వదులుతుంది." అన్నాడు వాన్‌హెల్సింగ్.

"ఆ విధంగా ఏవిటంటే, అతను శవపేటికలో వున్నప్పుడు కనిపెట్టి, మనం అతడ్ని చంపేయాలి. కానీ అతను చాలా తెలివిగా ప్రవర్తిస్తుంటాడు. బుడాపెస్ట్ యూనివర్సిటీలో, ఆర్మీనియస్ అని నా మిత్రుడున్నాడు. అతన్ని కొన్ని వివరాలు అడిగాను. అతను చెప్పినదాన్నిబట్టి డ్రాకులా చాలా పురాతన ప్రాణి. టర్కులతో యుద్ధం చేసినవాడు. అదే నిజమయితే, డ్రాకులా సామాన్యమైనవాడు కాదు. అతను వున్న రోజుల్లోనూ, తర్వాత శతాబ్దాల్లోనూ డ్రాకులా చాలా తెలివిగలవాడు అన్న విషయం ప్రచారంలో వుంది. గొప్ప సమయస్ఫూర్తి వున్నవాడు. మొండివాడుకూడా. ఆర్మీనియస్ ఏమంటాడంటే, డ్రాకులా వంశం చాలా మంచిది, గొప్పది అంటాడు. వాళ్లలో కొంతమందికి దయ్యాలతో సంపర్కం వుందిట. ఈ డ్రాకులా కూడా దయ్యాలతో సంబంధం వున్నవాడే, అని ఒక చోట రాసిన లిపి ప్రకారం అర్థం అవుతోంది. ఆ వంశంలో కొంతమంది మంచివాళ్ళు వుండటంచేత, వీళ్ళు కొన్ని ఆటలు ఆడగలుగుతున్నారు." అన్నాడు వాన్‌హెల్సింగ్ మళ్ళీ.

ఇట్లా సంభాషణ జరుగుతుండగా, మోరిస్ చాలా తీక్షణంగా కిటికీ వంక చూసి, చప్పుడు లేకుండా లేచాడు. గదిలోంచి బయటకు వెళ్ళిపోయాడు. సంభాషణ క్షణకాలం ఆగింది. ప్రొఫెసర్ వాన్‌హెల్సింగ్ మళ్ళీ మొదలు పెట్టాడు.

"ఇక మన కార్యక్రమాలు నిర్ణయిద్దాం. సేకరించిన విషయాలు మన ముందు వున్నాయి. జొనాథన్ సేకరించిన దాన్నిబట్టి, డ్రాకులా కోటలోంచి విట్‌బీకి యాభై చెక్క పెట్టెలు వచ్చాయని తెలుస్తోంది. అవన్నీ 'కార్‌ఫాక్స్' కు చేర్చబడ్డాయి. వీటిలో కొన్ని పెట్టెలు మాయమయ్యాయి. ఇప్పుడు మనం మొట్టమొదట చెయ్యాల్సిన పని ఏవిటంటే, మిగిలిన చెక్కపెట్టెలన్నీ వున్నాయా లేదా? లేకపోతే, మరికొన్ని మాయమయ్యాయా ? ఇవన్నీ మన గోడ అవతలివేపు వున్న ఇంట్లో కనిపెట్టాల్సిన విషయాలు."

అనుకోకుండా సంభాషణ ఆగిపోయింది. బయట పిస్టలు పేల్చిన శబ్దం వినపడింది. కిటికీ పైభాగం అద్దం పగిలి ముక్కలయ్యింది. గది అంతా అద్దం ముక్కలు వెదజల్లబడ్డాయి. నాది చాలా సున్నితమైన మనసు అనుకుంటా, అరవకుండా వుండలేకపోయాను. అందరూ ఒక్కసారి గెంతారు. ఆర్థర్ కిటికీ దగ్గరకు పరుగెట్టాడు కిటికీ తలుపులు తీసాడు. బయటనుంచి మోరిస్ గొంతు వినిపించింది

"సారీ, మీకు అనవసరంగా ఇబ్బంది కలిగించాను. లోపలికొచ్చి విషయం చెపుతాను." ఓ నిముషం తర్వాత మోరిస్ లోపలికి వచ్చారు.

"చాలా తెలివి తక్కువగా ప్రవర్తించాను. మీరంతా నన్ను క్షమించాలి. మిసెస్ మినా, ముఖ్యంగా మీరు నన్ను క్షమించాలి. మీరు బాగా భయపడి వుంటారు. అసలు జరిగిందేవిటంటే, ప్రొఫెసర్ వాన్‌హెల్సింగ్ మాట్లాడుతుండగా, ఒక పెద్ద గబ్బిలం కిటికీ రెక్కమీద కూర్చుని వుండటం చూసాను. ఇప్పటివరకూ ఈ విషయాలే వింటూ కూర్చున్నా కదా, కిటికీలో వున్నది అదే అనుకున్నాను. బయటకెళ్ళి పిస్టల్ పేల్చాను. సాయంత్రం పూట అట్లాగే కనబడ్డవాటిని కాలుస్తుంటాను" అన్నాడు మోరిస్.

"మీరు దాన్ని కొట్టారా ?" వాన్ హెల్సింగ్ అడిగాడు.

"ఏమో నాకు తెలీలేదు. కొట్టలేదనుకుంటా, ఎందుకంటే, అది పారిపోవటం చూసాను."అన్నాడు మోరిస్. ఇక ఏమీ మాట్లాడకుండా కూర్చున్నాడు వాన్‌హెల్సింగ్ తన సంభాషణ కొనసాగించారు.

"చెక్కపెట్టెలన్నిటినీ మనం ఆరాతియ్యాలి. తర్వాత మనం అతడ్ని అట్లాగే బంధించటానికి సిద్ధపడి వుండాలి. లేదా చంపగలగాలి. అతన్ని నేల మీద దిగనీయకుండా చేయాలి. మధ్యాహ్నం సాయంత్రం మధ్య సమయంలో అతను మనిషి రూపంలో పడుకుని వుంటాడు. అతన్ని దెబ్బతీయటానికి అదే మనకు సరైన సమయం."

"మేడమ్ మినా, మీరు ఈ ఒక్క రాత్రితప్ప ఇక మీరు ఈ విషయంలో దూరంగా వుండాలి. మీరు మాకు ఎంతో అవసరం. మీరు ఇటువంటి

జరిగిన కథ — 26 : ఆ రాత్రికి లూసీ సమాధి దగ్గరకు వచ్చి చూస్తే దాంట్లో ఆమె కనిపించదు. చర్చి ఆవరణలో పొంచివున్న సెవార్డ్‌కి లూసీ కనిపిస్తుంది. వాన్‌హెల్సింగ్‌కి దొరికిన పసిపాపను పోలీసులకి అప్పగిస్తారు. కానీ ఆ పాప మెడపై గాట్లు లేకపోవడం గమనిస్తారు. ప్రొఫెసర్ వాన్‌హెల్సింగ్ ఉత్తరం ద్వారా ఆర్థర్‌ను, క్విన్సీమోరిస్‌లను రప్పిస్తాడు. వాళ్లకి కూడా సెవార్డ్‌కి చూపించిన దృశ్యాన్ని చూపిస్తాడు. ఆర్థర్‌ని గుర్తుపట్టిన లూసీ అతన్ని చేరుకోబోయేంతలో వాన్‌హెల్సింగ్ అడ్డుపడతాడు. లూసీ సమాధిలోకి వెళ్తుంది. లూసీ శరీరంలో ప్రవేశించిన రాక్షసిని హతమారుస్తాడు ఆర్థర్, వాన్‌హెల్సింగ్ చెప్పిన విధంగా. జోనాథన్ డైరీ చదివి కొన్నివిషయాలు తెలుసుకుంటాడు డాక్టర్ సెవార్డ్. జోనాథన్ 'డ్రాకులా' గురించిన వివరాలను సేకరిస్తుంటాడు. మినాహార్కర్ తనకు తానే మిస్టర్‌రెన్‌ఫీల్డ్‌కు పరిచయం చేసుకుంటుంది. డాక్టర్ వాన్‌హెల్సింగ్‌కు మినా తన డైరీని ఇస్తుంది.

ప్రమాదమైన విషయాల్లో తలదూర్చకూడదు. ఈ రోజు విడిపోయిన తర్వాత, మీరిక ఎటువంటి ప్రశ్నలు వేయకూడదు. సమయం వచ్చినపుడు మీకు అన్ని విషయాలూ చెపుతాం. మేమంతా మగవాళ్లం కనుక, ఈ ప్రమాదాలని ఎదుర్కొని నిలబడగలం. మీరు మాకు వెలుగులాంటివారు. మీరు ప్రమాదంలో వున్నట్టు తెలిస్తే మాకు తోచదు'' అన్నాడు.

అట్లా అనగానే, అందరి మనసులు కుదుట పడ్డాయి. జోనాథన్ ఎక్కువగా సంతోషించినట్టు కనిపించాడు. నన్ను వదిలి వాళ్లంతా ధైర్యంచేసి ఈ కార్యక్రమంలో దిగడంమాత్రం నాకు దిగులుగా వుంది. వాళ్లు బాగా ఒక నిర్ణయానికొచ్చేశారు. నా చేతుల్లో ఏమీలేదు.

మోరిస్ సంభాషణ మొదలెట్టాడు. ''మనం ఇప్పుడు సమయాన్ని వృధా చెయ్యటానికి లేదు. మనం ఆ ఇంటికెళ్ళి చూడాలి. సమయానుకూలంగా అతనితో ప్రవర్తించాలి. మనం తొందరపడితే, మరొక ప్రాణాన్ని రక్షించవచ్చు.''

వాళ్లంతా అంత తొందరగా కార్యక్రమంలో దూకేస్తుంటే, నాకు దిగులు ఎక్కువయింది. నేను వాళ్ల పనులకు అడ్డుపడితే, నన్ను పూర్తిగా దూరం చేస్తారనిపిస్తుంది. వాళ్ళు కార్‌ఫాక్స్‌లో వున్న యింటికి బయలుదేరి వుంటారు.

వాళ్ళు నన్ను నిద్రపొమ్మన్నారు, ఒక మగవాడిలా తన ప్రియమైనవాళ్ళు ప్రమాదంలో వున్నప్పుడు, ఆడది ఎట్లా నిద్రపోగలుగుతుంది. పడుకుని నిద్రపోతున్నట్టు నటించాలి. జోనాథన్ తిరిగి వచ్చేటప్పటికి నిద్రపోతూ కన్పించాలి, లేకపోతే కంగారు పడతాడు.

డాక్టర్ సెవార్డు డైరీ :

అక్టోబరు, 1; (ఉదయం నాలుగు గంటలు):

మేమంతా అప్పుడే బయలుదేరుదామనుకుంటూ వుండగా, రెన్‌ఫీల్డు దగ్గర్నుంచి కబురు వచ్చింది. ఎంతో ముఖ్యమైన విషయం గురించి మాట్లాడా లట, నన్ను వెంటనే చూడాలని కోరాడు. పొద్దుటే వచ్చి కలుస్తానని చెప్పు, అని కబురు తెచ్చిన వాడితో అన్నాను. మళ్లీ పనిలో మునిగిపోయి వున్నప్పుడు, అతను అన్నాడు.

''అతను ఎందుకో చాలా తొందరపడుతున్నాడు సార్ ! అతను అంత ఆదుర్దాపడటం నే నెప్పుడూ చూడలేదు. ఎందుకో తెలీదు.

కానీ మీరు గనక అతన్ని వెంటనే చూడనట్ట యితే, ఏదో దారుణం తలపెట్టేట్టు వున్నాడు.''

మా పనివాడి గురించి నాకు బాగా తెలును. అతను కారణం లేకుండా, అంత ఇదిగా చెప్పడు. అందుకే అతనితో చెప్పాను ''సరే, ఇప్పుడే బయలు దేరి వస్తున్నా.''

మిగతావాళ్లను కాస్త వేచివుండమని చెప్పాను. తిన్నగా మా 'పేషంట్' దగ్గరికి వెళ్లబోతుండగా,

''మిత్రమా జాన్, నన్ను కూడా అతనిదగ్గరికి తీసుకెళ్లు'' అన్నాడు ప్రొఫెసర్ వాన్‌హెల్సింగ్. ''అతని గురించి నువు డైరీలో రాసిన విషయాలు చాలా చదవదగ్గవిగా వున్నాయి. మన కేసుకు ఇతనికి ఎంతో దగ్గర సంబంధ ముంది. అతన్ని చూడాలని నాకు బాగా అనిపిస్తోంది. ముఖ్యంగా, అతని మనసు సరిగా లేనప్పుడే చూడాలి'' అన్నాడు.

''నేను కూడా రావచ్చా ?'' ఆర్థర్ అడిగాడు.



"మరి నేను ?" మోరిస్ అడిగాడు.

"నేను రావచ్చా ?" జోనాథన్ అడిగాడు.

నేను తలూపాను. అందరం కలిసి బయలు దేరాం అతని దగ్గరికి.

రెన్‌ఫీల్డు చాలా ఉద్రేక స్థితిలో కనిపించాడు. అయినా అతని మాటల్లో తెలివితక్కువతనం కనిపించలేదు. అతని చేష్టల్లో ఎంతో అర్థం గోచరించింది. అతను పిచ్చివాడు కాదని మేం అంతా అనుకుంటున్నట్టు అతను ప్రవర్తించాడు. మేం నలుగురం అతని గదిలోకి ఒక్కసారే ప్రవేశించాం. కానీ ఎవరూ ఏం మాట్లాడలేదు మొదట. అతనే మొదట మాట్లాడాడు నాతో. తనని వెంటనే పిచ్చి ఆసుపత్రినుంచి విడుదల చేయమని ప్రార్థించాడు. పూర్తిగా తనకు పిచ్చి నయమయిందని వాదించాడు. "మిత్రులందర్నీ వేడుకుంటున్నాను. మీరు నన్ను వెంటనే విడుదల చెయ్యమని చెప్పండి. అవునుగానీ, వీరిని పరిచయం చెయ్యనేలేదు" అన్నాడు నావేపు తిరిగి.

అతని మాటలు నాకు ఆశ్చర్యాన్ని కలిగించాయి. ఓ పిచ్చివాడికి ఇతర్లని పరిచయం చెయ్యటం అనేది నాకు ఎప్పుడూ తోచని విషయం. అతని చేష్టల్లో ఎంతో హుందాతనం గోచరించింది. వెంటనే పరిచయం చేసాను. "గాడ్ ఆల్మింగ్ ప్రభువు (ఆర్థర్); ప్రొఫెసర్ వాన్‌హెల్సింగ్; మిస్టర్ క్విన్సీ మోరిస్, టెక్సాస్; — ఇతను మిస్టర్ రెన్‌ఫీల్డ్."

అతను అందరితో కరచాలనం చేశాడు.

"గాడ్ ఆల్మింగ్ ప్రభూ ! విండామ్‌లో మీ తండ్రిగార్ని కలిసే అవకాశం కలిగింది. మీకు ప్రభువు బిరుదు వుందని అంటే, ఆయన ఈ లోకంలో లేరన్నమాట. ఇది చాలా విచారకరమైన విషయం. ఆయన ఎంతోమందికి ప్రీతిపాత్రుడయ్యారు. అందరి గౌరవాన్ని అందుకున్నారు."

"మిస్టర్ మోరిస్. మీ దేశంగురించి మీరు చాలా గర్వపడాలి."

"వాన్‌హెల్సింగ్‌లాంటి వ్యక్తిని కలిసినప్పుడు ఎంతో సంతోషంగా వుంటుంది ! సార్ ! మీ పేరు ముందర ప్రొఫెసర్ అనీ, డాక్టర్ అనిగానీ సంబోధించనందుకు నన్ను తప్పు పట్టకండి. మీరు వీటన్నిటికీ అతీతులు. మనస్తత్వశాస్త్రంలో ఆరితేరిన వారు. మిమ్మల్ని డాక్టరుఅనీ, ప్రొఫెసర్ అని సంబోధించి, మీ జ్ఞానానికి ఒక పరిధిని ఏర్పరచటం అవివేకమనిపిస్తుంది నాకు. మీరంతా మీ వృత్తికి, మీ దేశానికి పేరు ప్రతిష్ఠలు సంపాదిస్తున్నవారు. మీరంతా నన్ను పిచ్చివానిగా జమకట్టకుండావుంటారని తలుస్తాను. డాక్టర్ సెవార్డు, మీరు ఒక డాక్టరుగా, ఒక శాస్త్రజ్ఞునిగా, మానవతాదృష్టితో నన్ను వదిలి వేయవలసిందిగా కోరుతున్నాను." ఈ చివరి మాటలు అతను ఎంతో ఉన్నతమైన ప్రవర్తనతో అన్నాడు.

మేం అంతా దాదాపు నిశ్చేష్టులమయ్యామనే చెప్పాలి. అతని గత చరిత్ర, ప్రవర్తన తెలిసినప్పటికీ, అతన్ని వదిలివేయాలనే నిశ్చయానికొచ్చాను. అతనికి పిచ్చిలేదని నాకు సంతృప్తి కలిగింది. అతని విడుదలకు సంబంధించిన మామూలు పనులు పూర్తిచేసి, అతన్ని రేపు ఉదయం పంపిస్తా

జీవన్మృతులు

నని చెప్పదామనుకున్నాను. కానీ అట్లా వాగ్దానం చేసేకన్నా కొంతసేపు వేచివుండటం మంచిదనిపించింది. ఎందుకంటే, ఇతను మళ్ళీ వెంటనే పిచ్చిగా ప్రవర్తించేధోరణి గలవాడు. 'పేషంటు చాలా వరకు కోలుకున్నాడు' అని పైకి చెప్పాను. రేపు ఉదయం కాసేపు విషయాలు మాట్లాడి నిన్ను తప్పకుండా త్వరలో విడుదలచేయటానికి ప్రయత్నిస్తాను అని చెప్పాను. కానీ నా మాటలకు అతను సంతృప్తి చెందినట్టు లేదు.

"డాక్టర్ సెవార్డు ! నా మాటను మీరు తర్వాత వినరేమో. నేను ఇప్పుడే వెళ్ళిపోవాలనుకుంటున్నాను— ఇప్పుడంటే ఇప్పుడే— ఈ క్షణమే— ఇక్కడ్నుంచే. పరిస్థితి అట్లావుంది. ఇప్పటికిప్పుడు మీకు చెప్పటం, మీరు ఒప్పుకోడానికి వీలుపడదని తెలుసు. కానీ ఒక మంచి డాక్టరయిన మీకుచెప్పటం అవసరమని భావించాను." అన్నాడు రెన్‌ఫీల్డు. నా మొహంలోకి చూసాడు. నా అయిష్టతను గమనించి, వాళ్లవేపు తిరిగాడు. వాళ్ళుకూడా ఎటువంటి భావమూ వ్యక్తీకరించక పోవడంతో—

"నా విడుదలగురించి అడగటంలో తప్పు వుందా !" అడిగాడు.

"వుంది" అన్నాను సంకోచించకుండా. అనవసరంగా చాలా కఠినంగా అన్నానని నాకు అనిపించింది.

ఒక్కక్షణం మౌనంగా వున్నాడు. తర్వాత అన్నాడు.

"అయితే నా విన్నపాన్ని మరో విధంగా మార్చుతాను. పోనీ ఒక సహాయం అనండి, కోరిక అనండి, అది తీర్చండి. ఇప్పుడు నేను వేడుకుంటున్నది నా కోసం కాదు. ఇతర్లకోసం. అంటే కారణాలు అడగకండి. అవి చెప్పేస్వేచ్ఛ నాకు లేదు. కానీ నేను అడుగుతున్నది ఇతరుల మంచికోసమని హామీ ఇస్తున్నాను. నాలో ఏమాత్రం స్వార్థంలేదు. నేను చెయ్యవలసిన విధిఒకటి వుంది. మీరు నన్ను కాదు, నా హృదయంలోకి పరికించిచూడండి, నా ఆలోచనలు మీరు అర్థంచేసుకుంటారు. నేను నిజమైన మంచి మిత్రుడినని మీరు ఒప్పుకుంటారు." అన్నాడు రెన్‌ఫీల్డు.

అలా అని మా అందరివేపు పరీక్షగా చూసాడు. ఒక్కసారే, ఇతను ఇంత మేధావిలా మాట్లాడటం,

రెండే !

విరామంలేకుండా ప్రకృతిలో
మనకి కనిపిస్తూ వుండేవి రెండే ...
రాత్రి ... పగలు ...

అనుమానం లేకుండా జీవుల సృష్టిలో
కూడా మనకి కనిపిస్తూవుండేవి రెండే
చావు ... పుట్టుక !

— ఎస్ వి ఆర్ సత్యనారాయణమూర్తి

పిచ్చి మరొక రకంగా మారిందేమోననిపించింది కాబట్టి అతన్ని ఒక్కసారి వదిలి కనిపెడుతూ వుండటం మంచిదనిపించింది.

వాన్‌హెల్సింగ్ మాత్రం రెన్‌ఫీల్డును పరీక్షగా గమనిస్తున్నాడు. అతని కనుబొమ్మలు ముడిపడి వున్నాయి. అతని చూపు రెన్‌ఫీల్డుమీద కేంద్రీకరించి వుంది.

వాన్‌హెల్సింగ్, రెన్‌ఫీల్డుతో మాట్లాడిన విధానం నాకు అప్పుడు ఏమీ అనిపించలేదు గానీ, తర్వాత చాలా ఆశ్చర్యపరచింది. అతను రెన్‌ఫీల్డును తన సమానుడిగా భావించి సంబోధించినట్టుగా వుంది. అతను ఇట్లా అన్నాడు :

"మీరు ఈ రాత్రికే విడుదలై ఎందుకు వెళ్లి పోవాలనుకుంటున్నారో, మీ కారణాలు చెప్పండి. మీ కారణాలు నాకు సంతృప్తి కలిగించినా చాలు, ఎటువంటి ఆటంకం లేకుండా, డాక్టర్ సెవార్డుతో చెప్పి, మీరు కోరిన విధంగా మీ విడుదలకు ఏర్పాటు చేస్తాను."

దానికి రెన్‌ఫీల్డు విచారంగా, చెప్పలేనని సూచిస్తూ తల తిప్పాడు. వాన్‌హెల్సింగ్ కూడా కాస్త అసంతృప్తి చెందాడు.


"అలా కాదు సార్ ! కాస్త ఆలోచించండి. కొన్ని కారణాలవల్ల మీరు విడుదల కావాలనుకుంటున్నారు. అవి మీరు మాకు చెప్పి, మమ్మల్ని ఒప్పించండి. మీ కారణాలు చెప్పలేక పోవటం వల్లనే మీ ఆరోగ్యం గురించి, సందేహపడవలసి వస్తోంది. మీరు దయచేసి కారణాలు చెప్పండి. మేము కూడా మీకు తోడ్పడతాం" అన్నాడు వాన్‌హెల్సింగ్.

అయినా రెన్‌ఫీల్డు అడ్డంగా తలూపాడు. తర్వాత అన్నాడు —

"డాక్టర్ వాన్‌హెల్సింగ్ ! నేను చెప్పాల్సిందేమీ లేదు. మీరు ఎక్కువగా అడగదల్చుకుంది లేదు. కారణాలు చెప్పగలిగిన స్వేచ్ఛ నాకు వుంటే చెప్పటానికి నేనెందుకు వెనకాడుతాను. నా విషయాల్లో నేను మాస్టర్ని కాను. నన్ను దయచేసి నమ్మండి. అంతకంటే వేరే చెప్పలేను. మీరు గనుక నన్ను పోనివ్వకపోతే, జరిగేవాటికి నేను బాధ్యుడ్ని కాదు" అన్నాడు రెన్‌ఫీల్డు.

ఇదంతా చూస్తుంటే, కాలయాపన తప్ప మరొక విధంగా పరిష్కారం కనిపించటం లేదు. అందువల్ల నేను తలుపు దగ్గరికి వెళుతూ "రండి రండి వెళదాం. మనకి చాలా పనివుంది, గుడ్‌నైట్" అన్నాను.

నేను తలుపు దగ్గరికి చేరగానే, అతనిలో కొత్త మార్పు వచ్చింది. అతను నావేపు గబగబా వస్తుండటం గమనించాను. మళ్లీ నామీద హత్యా ప్రయత్నం చేస్తాడేమో అనుకున్నాను...కానీ నా ఆలోచన తప్పు అనిపించింది. అతను నా దగ్గరకు వచ్చి నా రెండు చేతులూ పట్టుకుని ఎంతో దీనంగా వేడుకున్నాడు. అతని మాటలకు కరిగిపోవాల్సి వచ్చింది. వాన్‌హెల్సింగ్ వైపు చూసాను. అతను నావేపే చూస్తున్నాడు. అతని చూపు అర్థమయింది. అందువల్ల కఠినంగా కాకపోయినా, గంభీరంగా మారిపోయాను. అతన్ని మెల్లగా వెనక్కి పంపేస్తూ



laCunha/GCM/76/TL/82

జీవన్ వృత్తులు

న్నాను, అతని వేడుకోలు వినదల్చుకోవటంలేదంటూ. పూర్వం ఇతనితో ఇట్లాంటి అనుభవమే అయింది. ఏదైనా కోరిక మొదలైతే, అతనిలో ఉద్రేకం హెచ్చుతూవుంటుంది. ఇదివరకు "పిల్లి" కావాలన్న ప్పుడూ ఇలాగే అయ్యాడు. వీల్లేదు అన్నప్పుడు కోపంతో వూగిపోయాడు ఇప్పుడు అలాగే అవుతా డనుకున్నాను గానీ, కోపానికి బదులు భయంతో వూగిపోయాడు. వెంటనే నాకాళ్లమీద పడిపోయాడు. రెండు చేతులూ జోడించి, దీనంగా విలపిస్తూ —

"డాక్టర్ సెహాబ్ ! నా మాట వినండి. నా విన్నపాన్ని ఆలకించండి. నన్ను వెంటనే ఇక్కడ్నించి పంపించి వేయండి. నన్నెక్కడికి పంపించాలనుకుంటే అక్కడికి పంపించండి. నాతోపాటు మీ పనివాళ్లను కూడా పంపించండి. కావాలంటే కొరడాలు,గొలుసులు వాళ్లకు ఇచ్చి పంపండి. ఇట్లాగే ఈ బట్టలలోనే పంపించండి. కావాలంటే, నా కాళ్లకు ఇనుపబంధం వెయ్యండి. ఎట్లాగైనాసరే, నన్ను బయటకు పంపించండి. నన్ను ఇక్కడ వుంచేయటం వల్ల మీరు నాకెంత అపకారం చేస్తున్నారో మీకు తెలీదు. నేను హృదయపూర్వకంగా అర్థిస్తున్నాను. నా ఆత్మతో అడుగుతున్నాను. నన్నిక్కడ వుంచి మీరు ఎట్లా, ఎవరికి అపకారం తలపెడుతున్నారో నేను చెప్పలేను. చెప్పే పరిస్థితిలో లేను. మీరు నమ్మిన దేవునికోసం, మీకు ప్రియమైన వాళ్లకోసం, మీరు పోగొట్టుకున్న ప్రియమైన వారికోసం – నన్ను ఇక్కడ్నించి తొందరగా పంపేసి నా ఆత్మను రక్షించండి ... ఏమిటీ నా మాటలు వినపడటంలేదా ? అర్థం కావటం లేదా ? ఇక నీకెప్పుడు అర్థం అవుతుంది ? నాకు ఏమాత్రం పిచ్చి లేదని, మంచివాడినేనని తెలీటం లేదా? నేను మతి భ్రమించినవాడ్నికాదు. పిచ్చివెధవని కాదు. నాలత్మనురక్షించుకోవటంకోసం పోరాడుతున్న మంచి మనిషిని. నా మాటలు ఆలకించు. దయచేసి ఆలకించు. నన్ను వెళ్లనివ్వు... వెళ్లనివ్వు. వెంటనే వెళ్లనివ్వు" అన్నాడు. అతని చెంపలమీదుగా కన్నీళ్ళు ధారగా కారుతున్నాయి.

ఈ పరిస్థితి ఇట్లాగే కొనసాగితే, అతను మరింత రెచ్చిపోయి విరుచుకుపడిపోతాడనిపించింది. అతని భుజాలు పట్టుకుని పైకి లేవనెత్తాను.

"రండి. ఇక ఎక్కువగా మాట్లాడవద్దు ఇప్పటికే బాగా అలసిపోయారు. పక్కమీద పడుకోండి" అన్నాను గంభీరంగా.

అతను మాట్లాడటం మానేసి నా వంక తీక్షణంగా చూసాడు చాలాసార్లు. ఇక లాభంలేదని వెళ్ళి తన పక్కమీద కూర్చున్నాడు. ఇదివరకు జరిగినట్టుగానే, అతను విరుచుకు పడిపోయాడు పక్కమీద.

వాళ్ళు గదిలోంచి బయటకు వెళ్లారు. నేను కూడా వెళ్ళబోతుండగా, రెన్‌ఫీల్డు కాస్త సౌమ్యంగా అన్నాడు—

"డాక్టర్ సెహాబ్ ! నేను చెప్పవలసిందంతా చెప్పాను. మీరు న్యాయం చేస్తారని నమ్ముతాను."

(ఇంకా వుంది)

తల్లిపాలలాంటిది మరొకటి లేదిక... (4)









దానికోసం కావలసిందిదే— ప్రశాంతమైన మానసిక వాతావరణం, బాగా పుష్టినిచ్చే ఆహారం!

అవును, పాపకు స్తన్యపానం చేయించడానికి యోగ్యంగా అవడానికోసం కావల్సింది సూటిగా చెప్పాలంటే అది. వీలైనంత వరకు ప్రశాంతమైన మనస్సుతో ఉండండి. మరి మీరు తీసుకునే ఆహారంలో ఎటువంటి పదార్థాలుండాలంటే, దాంతో మీ శరీరంలో, పాపకోసం ఎక్కువగా పాలు పడేలా ఉండాలి.

చితీ—చింతా రెండు ఒక్కటే

చింత అన్నది మీకే కాదు, మీ పాపకి కూడా హానికరం కావచ్చు. చింతించడం వలన మీలో ఉదాసీనత, ఆవేదన, అస్వస్థతగా ఉండనిపించడం— అంతే కాదు మీలోని పాలు ఎండిపోవచ్చు.

మీకే గనక ఆరోగ్య విషయంలో ఏదైనా సమస్య గనక వుంటే, దిగులుపడి చతికిలబడిపోవద్దు. కొంచెం ధైర్యంగా మెలగండి. మీ డాక్టరు దగ్గరికి వెళ్ళి మీ సమస్య ఏమిటో చెప్పండి. ఆయన మీ సమస్యని తప్పకుండా అర్థం చేసు కుంటారు. ఎందువల్లనంటే ఆయన మీ డాక్టరు గనక— ఆయనపైన పూర్తిగా నమ్మకాన్ని ఉంచవచ్చును.

పుష్టికరమైన ఆహారాన్ని తీసుకోవడం మొదలెట్టండి

పుష్టికరమైన ఆహారాన్ని గూర్చి తెలుసుకోవడానికి గ్రంథాలేవీ చదవనూ అక్కర్లేదు, కేలరీ చార్టులు చూడనూ అక్కర్లేదు మీ పాపయొక్క వృద్ధి వికాసాల కోసం ఎక్కువగా ప్రోటీన్లు కావాలను కుందాం. ప్రోటీన్లు శరీర నిర్మాణం చేసే ద్రవ్యం. అవి పాలు, కోడిగ్రుడ్లు, మాంసం వీటిలో వుంటాయి. మరైతే మీరు ప్రోటీన్లు సమృద్ధిగా వున్న పదార్థాలను తినాలి. మీకు అటువంటి పదార్థాలతో ఎంత ఎక్కువలో ప్రోటీన్లు లభిస్తే, మీ పాపకు మీ పాలలోంచి అంత ఎక్కువగా ప్రోటీన్లు లభ్యమవ తాయి.

మరి ఒక్క విషయం గుర్తుంచు కోండి. మీ ఆహారంలో కార్బొహైడ్రేట్లు అవసరమైన దాని కన్న ఎక్కువగా ఉండకూడదు. ఎందుకంటే అందువల్ల మీ పాల యొక్క ప్రమాణంపై, దాని గుణాల పైనా దుష్ప్రభావం పడవచ్చు.

ఆ రకమైన జాగ్రత్త, అటు వంటి తిన్ననైన, సూటియైన ఉపాయాలు మీ పాపకు సరియైన ప్రకారంగా స్తన్యపానం చేయించడానికి సహాయకరంగా ఉంటాయి. అయితే దైవవశాత్తు మీ ఆరోగ్యం విషయంలో పెద్ద సమస్య గనక వస్తే, అటువంటి పరిస్థితిలో చాలా బాగా ఆలోచించి, మీ పాపకు ఎటువంటి ఆహారం యివ్వాలంటే మరి తల్లిపాల తర్వాత అన్నిటికన్న ఉత్తమంగా ఎంచబడుతూన్న దాన్ని.

స్ప్రేడ్రయిడ్—అమూల్‌స్ప్రే

అమూల్‌స్ప్రే, పుష్టినిచ్చే దృష్టితో చూస్తే మహత్తరంగా సంతులితమైన ఆహారం. ఎందుకంటే దీన్లో చాలా ఎక్కువైన తీరులో ప్రోటీన్లు, దాంతోబాటే, తేలికగా అరగగలిగే కార్బొహైడ్రేట్లు, సరియైన సంతులిత రూపంలో అత్యావశ్యకమైన విటమిన్లూ, ఖనిజ పదార్థాలూ ఉన్నాయి. ఇది, అంతకు ముందే మరగ బెట్టిన నీటిలో టక్కున కరిగి పోతుంది. మొదటగానే పేస్ట్‌లా తయారు చేయవలసిన అవసరం ఉండదు.

పొదుపు

అమూల్‌స్ప్రే, డబ్బాలలో దొరికే శిశు ఆహారాలన్నిటికన్న పొదుపైనది. ఎందుకంటే యిది ఆధునికమైన పాల సంఘం యొక్క ఉత్పాదన—దీనిలోని సభ్యులు 'శ్వేత విప్లవం' తీసుకురావడంలో అందరికన్న ముందడుగు వేసారు.

జాగ్రత్త పడటం


పాప ఆహారానికి ఉపయోగించే అన్ని వస్తువుల్నీ, సీసానీ, ఎప్పుడూ ఆరోగ్యరీత్యా బాగా శుభ్రంగా కడిగి నీటిలో మరగ బెట్టాలి. పాప ఆహారాన్ని తయారుచేయడానికి కూడా మరిగిన నీటినే వాడండి. పాప సరియైన పోషణకోసం, డబ్బా పైన యివ్వబడిన అమూల్‌స్ప్రే మోతాదుల ప్రకారమే ఖచ్చితంగా పాప ఆహారాన్ని తయారు చెయ్యండి.

ఉచితం! అమూల్ బేబీ పుస్తకంలో ఉపయోగకరమైన విషయాలు యీ అధ్యాయాల్లో ఉన్నాయి అవి గర్భధారణ, ప్రసవానికి ముందర జాగ్రత్త, ప్రసవము, తల్లిపాలు, ఇతర ఆహారములు, మిశ్రమ ఆహారమును అలవాటు చేయుట, పిల్లవాని దినచర్య, పిల్లవాని అభివృద్ధి, జబ్బులను అరికట్టుట, ప్రథమ చికిత్స, సాధారణ రోగములు, జబ్బుతోనున్న పిల్లవాని సంరక్షణ, జ్ఞాపకముంచుకోవలసిన విషయములు. ఈ పుస్తకం తెలుగు, ఇంగ్లీషు, హిందీ, తమిళం, మలయాళం, మరాఠీ, గుజరాతీ, బెంగాలీ భాషల్లో దొరుకుతుంది. దానికోసం పోస్ట్ బాక్స్ 10124, బొంబాయి 400 001 అడ్రసుకు మీ పేరూ, పూర్తి అడ్రసు యిస్తూ రూ. 1.25 స్టాంపుల్ని జతపర్చండి.

అమూల్‌స్ప్రే తయారుచేసే వారి తరఫున, మీ పాప ఆరోగ్యం కోసం సద్భావంతో యిస్తూన్న సందేశం యిది.

అమూల్‌స్ప్రే

భారతదేశపు ప్రముఖ సహకార పాల సంఘం వారి ఉత్పాదన.



అమ్మకం చేయించువారు:
గుజరాత్ కో-ఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ లిమిటెడ్, పోస్ట్ బాక్స్ 10, ఆనంద్ 388 001, గుజరాత్.

ASP/AS-4/83

ఘాటాక్షుని డైరీ

ధనాశ !

కడపకు చెందిన మహబూబ్ బాషా తన మామగారివద్ద దఫ దఫాలుగా సుమారు 31 వేల రూపాయలు చేబదులుగా పుచ్చుకున్నాడట. కూతురి భవిష్యత్తు కోరిన మహబూబ్‌సాబ్ తన అల్లుడు అడిగినంతా యిచ్చి, ఆనక కొన్నేళ్ళయ్యాక తనకు డబ్బవసరమై అల్లుణ్ణి కొంతైనా తిరిగి యివ్వమని అడిగాడట. ఈ విషయంలో బాషా భార్య బీసాహెబా అతన్ని తన తండ్రి బాకీ చెల్లించమని అడగడంతో బాషా, అతని తండ్రి కలిసి మజ్జిగలో విషం కలిపి ఆమెచేత త్రాగించారట. అది త్రాగిన ఆమె మెలికలు తిరిగిపోతూంటే ఆమె ఆత్మహత్య చేసుకున్నదని యిరుగు పొరుగులకు చెప్పి, ఆమె చనిపోయాక శవాన్ని పాతిపెట్టేశారట. ఏప్రియల్ ఆరో తేదీన బాకీ వసూలుకు మహబూబ్‌సాహెబ్ తన అల్లునింటికి వెళ్ళిచూస్తే తన కూతురు కనబడలేదట. ఏదీ అనడిగితే నీ కూతురూ లేదు, నీ బాకీ కూడా లేదు పొమ్మన్నారటా తండ్రి కొడుకులు. ఆతడిచ్చిన రిపోర్టుతో పోలీసులామె శవాన్ని త్రవ్వితీసి శవ పరీక్షకు పంపారట — మూఢ జహీహి ధనాగమ తృష్ణ ?! అని ఆదిశంకరులు అన్నారు — విన్నవారెవరు !

తప్పుతెలుసుకున్న భర్త!

అమెరికా డెట్రాయిట్ నగరవాసి 77 ఏళ్ళ యువకుడు తాను 25 ఏళ్ళక్రితం వదిలేసిన తన భార్యను మళ్ళీ యిూనాడు ప్రేమించి, ప్రేమింపజేసి తన తప్పు తెలుసుకుని, ఆ 78 ఏళ్ళ కెల్సిన్ అనే ఆమెను వివాహం చేసుకున్నాడట. 1966 లో ఈ ఫిలిప్ రేమాండ్ అనే ఆతడు ఏదో పొరపొచ్చాలొచ్చి తన భార్యకు విడాకులు యిచ్చాడట.

గుర్తింపులేని జూ॥ కాలేజి !

విజయవాడకు చెందిన ఒకాయన ఈడ్పుగల్లులో వో జూనియర్ కళాశాలపెట్టి వో సంవత్సరం నడిపారట. పరీక్షలాసన్నమయ్యేయట. కానీ విద్యార్థులకు హాలు టిక్కట్లు రాక వారి యిక్కట్లు ఆరంభమయ్యాయట! ఏమిది అని తరచిచూస్తే ఆ కళాశాలకు అసలు ప్రభుత్వ రికగ్నిషన్ లేదట.

వరరూప రాక్షసుడు !

జపానుకు చెందిన 33 సంవత్సరాల సాగవా అనే వో రక్కసుడు డెన్మార్క్‌కు చెందిన 25 సంవత్సరాల రీవే అనే అమ్మాయిని ప్రేమించి, ఆమె తనను తిరస్కరించేసరికి ఆమెను తుపాకీతో కాల్చి చంపి, ఆనకామె శరీరాన్ని ముక్క ముక్కలుగాకోసి, వో సూట్‌కేసులోపెట్టుకు తిరుగుతూ, ఆకలైనప్పుడల్లా ఆ మాంసం తిన నారంభించాడట. ఇతని వైఖరి, ఆ సూట్‌కేసూ చూసి పోలీసులు అనుమానించి "వాటేజినిట్" అని నిగ్గదీస్తే ఆతడు సంకోచ వ్యాకోచాలు లేకుండా తన ప్రియురాలి శరీర భాగాలా పెట్టెలో వున్నాయనీ, తాను నరమాంస భక్షకుణ్ణనీ ప్రకటించాడట. దాంతో కొయ్యబారిన చట్టం ఇతనికి మతి భ్రమించి వుండి వుండవచ్చని కట్టుదిట్టంగా పిచ్చాసుపత్రిలో చేర్చారట.

బందిపోట్ల దురాగతం !

ఉత్తర భారతదేశంనుంచి బందిపోట్లు దక్షిణ భారతదేశానికి దిగారు. హైదరాబాదు సుభాష్ నగర్‌లో ఏప్రియల్ పదో తేదీన రవీంద్రన్ అ[...] అతని యింటి తలుపులు పగలకొట్టి, రవీంద్రన్ తండ్రి నాగయ్యను చావ చితకబాది, రవీంద్రన్ను గొడ్డలితో నరకపోయేసరికాయన తప్పించుకు పారి పోయాడట. వారు సదాసివరావు అనే ఆతనిని, కన్నూ[...] అనే ఆమెనూ దారుణంగా చంపి 50 వేల రూపాయల బంగారం, నగ, నట్రా, నగదూ ఎత్తుకు పోయారట !

దొరగారి పెళ్ళి–దొరసాని ఉలికిపాటు!

లండన్‌లో మెరియాన్ వెన్నర్ అనే వో దొరసాని బజారుపని చూసుకుని ఇంటికివెళ్తూ దార్లో వో పెళ్లి సంబరం వూరేగింపు రావడం చూసి, చూసిపోదామని నిలిచి, వులిక్కిపడి, కొయ్యబారిపోయిందట. ఆ నూతన వరుడు తన భర్త రాబర్ట్‌వెన్నరేనట. బాబోయ్ నా హజ్బెండ్ మళ్ళీ మరో పెళ్ళి చేసుకుంటున్నాడు అని ఫిర్యాదుచేసి అతన్ని అరెస్టుచేయించి, ఆనక యిూ ఆధారాలతో తనకిలాటి మగడొద్దని కేసుపెట్టిందట — ఆహా ! భేష్సైన ఆడది.

ఆపదలో ఆదుకున్న కుక్క !

వెస్ట్ జర్మనీకు చెందిన మునిచ్‌లో పోలీసులు వో పదేళ్ళు సర్వీసు చేసిన కుక్కను యిహ యిది ముసిల్దయిందని పనిలోంచి తీసేసి, వైడర్మన్ అనే వో 56 ఏళ్ల అవివాహితుడైన వో ధనికునికి దానం చేశారట. ఆయన రోజూ ఆ కుక్కను తీసుకుని వుదయం నడకకు వెళ్లేవాడట. ఒకరోజాయన అలా వెళ్లి, గుండెపోటు వచ్చి, స్పృహతప్పి పడిపోతే ఆ కుక్క రానున్న ఆపదను గ్రహించి, తన యజమాని చొక్కా కాలరు పుచ్చుకుని అతన్ని అరవై మీటర్ల దూరం నేలమీద ఈడ్చుకుని, మెయిన్‌రోడ్డుకుచేర్చి, శక్తివంచన లేకుండా భౌభౌలాడి, దగ్గరలో వున్న కొంతమంది ఫ్యాక్టరీపనివారిని ఆకర్షించిందట. వారొచ్చి చూసి, అంబులెన్సు తెప్పించి వైడర్మన్ గారిని ఆసుపత్రిలో చేర్పిస్తే ఆయన స్థిమితంగా తేరుకుంటున్నాడటక్కడ. ★


హైదరాబాద్ నోట్‌బుక్

రుధిరోద్గారికాదు మధురోద్గారి :

రుధిరోద్గారి సంవత్సరానికి వ్యుత్పత్తి రక్తాన్ని కక్కేది అని. నిజానికి రుధిర శబ్దానికి కెంపు, కేసరి రంగు అంగారకగ్రహం మున్నగు అర్థాలూ ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో నూతన పథకాలను ప్రారంభించిన ఈ రుధిరోద్గారి తెలుగువారికి కెంపులు వెదజల్లేదిగాను, అవినీతిపై కన్నెర్రజేసే అంగారకగ్రహంగాను, నూతన సృష్టికి, నూతనత్వానికి నాందిపలికే కేసరి రంగును వెదజల్లే నవశకంగాను పరిణమించగలదన్న ఆశాభావం కలుగుతున్నది. రుధిర శబ్దానికిగల అర్థాలను తెలుసుకోనేకాబోలు ముఖ్యమంత్రి శ్రీ ఎన్. టి. రామారావు ఉగాది నుంచి సరాగిగాకాక విరాగిగా కాషాయపు దుస్తులు ధరించడానికి నిర్ణయించారు! ఉగాదినాడు ముఖ్యమంత్రి ధైర్యంతో లోగడ తాము బాసాడిన వాగ్దానాలను అమలుపరచినందుకు అభినందిస్తున్నాను. ఉగాదినుంచి అల్పాదాయవర్గాలకు కిలో బియ్యం రెండు రూపాయలకు పంపిణీ ప్రారంభమయింది. తెలుగు అన్ని స్థాయిలలోను అధికార భాషగా అమలయింది. దక్షిణ భారతంలో తొలిసారిగా మహిళలకు విశ్వవిద్యాలయం ఏర్పాటయింది. తెలుగు అధికార భాషకావడంపై అన్యభాషీయులు ఎంత మాత్రమూ ఆందోళన పడనక్కరలేదు. తెలుగువారికి ఇతరభాషా సహనం, ఇతర మత సహనం వెన్నతో పెట్టిన విద్య. తెలుగు దేశానికి సహస్రాబ్దాలుగా ఇతర భాషల వారు వలస వచ్చారు. ఇతర మతాలవారు వలస వచ్చారు. ఇతర జాతులవారు వలస వచ్చారు. నేటికీ వారు తమ తమ భాషా సంస్కృతులను రక్షించుకుంటూ (రక్షణ అనగానే ఎవరో దాడిచేసినట్లు, తాము రక్షించుకొన్నట్లు అర్థమవుతుంది కనుక అనుసరిస్తూ అందాం), ప్రధాన స్రవంతిలో కలిసిపోయారు. తమిళులు వచ్చారు, గుజరాతీలు వచ్చారు, మహారాష్ట్రులు వచ్చారు, బుందేలులు వచ్చారు; విదేశీయులూ వచ్చారు. తెలుగు స్రవంతిలో చేరిపోయారు. కనక తెలుగువాడులో ఇతర భాషల వారికి రక్షణ సహస్రాబ్దాలుగా వుంది. అలా లేకపోతే పిరాట్లవారు, చెల్లపిళ్లవారు, కర్నాటివారు, క్షీరసాగరులు, టోణపేలు, డోంగ్రేలు, చట్టోపాధ్యాయులు వుండరు. ఆంధ్రప్రదేశ్ అవతరణతోపాటే తెలుగు అధికారభాష కావలసింది. అది జరగని కారణంగా కొన్నివర్గాలు తమ భాష ద్వితీయాధికార భాష కావాలని బెదరించడం జరుగుతున్నది. రాజ్యాంగం ప్రకారం ఏ భాషవారయినా 30 శాతం వున్నప్పుడే. మైనారటీలకు ద్వితీయాధికార భాషా స్థాయి వుంటుంది. 15–16 శాతం వున్న ఉరుదూకు ద్వితీయాధికార భాషా స్థాయి కోరడం ఏ మాత్రమూ న్యాయం కాదు. ఉరుదూ వారికే కాదు, ఆంధ్రప్రదేశ్‌లోని పట్టణ ప్రాంతాలలో వున్న ఇతర భాషలవారు కూడ మూడు నాలుగు తరాలుగా తెలుగు గడ్డపై వున్నా తెలుగు నేర్చుకొనడానికి ప్రయత్నించలేదు. వారికి వచ్చిన తెలుగు కేవలం ఇంట్లో పనిచేసే సేవకులతో వ్యవహరించే తెలుగు. తెలుగువారనే పేరుతో పెద్ద పెద్ద వుద్యోగాలంతా వారికే. కనుక ముఖ్యమంత్రి అధికారభాషా కమిషను తెలుగును అధికారభాషగ అమలు చేయడంలో బెదరింపులకు లొంగరాదు ఇస్రాయిల్ దేశం ఏర్పడినప్పుడు, ఆ దేశం ప్రధాని అడిగాడట "హీబ్రూను అధికారభాషగా చేయడానికి ఎంతకాలం పడుతుంది ?" అని. ఒక మంత్రి పదేళ్లని, మరొకరు ఐదేళ్లని, ఇంకొకరు రెండేళ్లని అన్నారట. "రేపటినుంచే హీబ్రూ అధికారభాష" అన్నాడట ప్రధాని. రెండువేల ఏళ్లనాటి హీబ్రూ ఈ కాలంలో ఏర్పడిన దేశానికి అధికారభాష అయినప్పుడు, రెండున్నర వేల సంవత్సరాల చరిత్రవున్న తెలుగు, సంస్కృత ప్రాకృతీలకు కొత్త వెలుగులు కూర్చిన తెలుగు, ఇటీవల వరకు దక్షిణ భారతానికి అధికార భాషగా వున్న తెలుగు అధికారభాష కావడానికి క్షణం పట్టదు. ఇంతవరకు అది అధికార భాష కాకపోవటానికి కారణం రాజకీయాలేనని అనుమానించవలసి వుంది. శ్రీ పద్మావతీ మహిళా విశ్వవిద్యాలయం స్పెషలాఫీసరుగా ప్రముఖ విద్యావేత్త్రి, ఉస్మానియా మహిళాకళాశాల ప్రిన్సిపాలు శ్రీమతి వనజా అయ్యంగారును నియమించడం ప్రశంసించదగినది. శ్రీమతి వనజా అయ్యంగారు విద్యార్థిదశ నుంచి కూడ చైతన్యం, మేధావిలసితం తొణికిసలాడే మహిళామణి. స్పెషల్ ఆఫీసరుగా వున్నవారు సహజంగానే వైస్ చాన్సలర్ కావడం సత్సంప్రదాయం. ఈ మహిళా విశ్వవిద్యాలయానికి ముఖ్యమంత్రి శ్రీ రామారావు ఉగాది నాడు లాంఛనంగా ప్రారంభోత్సవం చేశారు. ఈ విశ్వవిద్యాలయం నూతన విశ్వవిద్యాలయా సంవత్సరం నుంచి ప్రారంభమవుతుందని, మహిళా దృక్పథంతో, మహిళా ప్రయోజనకరమైన కోర్సులు వుంటాయని ఆమె తెలిపారు. ముఖ్యమంత్రి ఎన్నికలనాటి ప్రమాణాలలో కొన్నిటిని ఉగాది నుంచి ఆచరణలో పెట్టినందువల్ల ఈ రుధిరోద్గారి తెలుగు వారికి మధురోద్గారి అయిందని భావిస్తున్నాను.

ఆస్థాన విద్వాంసుల పదవి రద్దు !

శ్రీ అంజయ్య కాలంలో చాలమంది ఆస్థాన విద్వాంసులయ్యారు. వారు, అంతకు ముందు ప్రభుత్వం నియమించినవారూ తెలుగుదేశం ప్రభుత్వం పాలనలో పదవీచ్యుతులయారు. ఆస్థాన విద్వాంసుల పదవి మధ్య యుగాల జమీందారీలకు, రాజరికానికి చిహ్నమని, ప్రజాస్వామ్య సంప్రదాయాలకు అనుగుణంకాదని,అందువల్ల నేరద్దు చేయడానికి ప్రభుత్వం నిర్ణయించిందని ముఖ్యమంత్రి శ్రీ రామారావు ఏప్రిల్ 1 వ తేదీన పత్రికా ప్రతినిధుల గోష్ఠిలో తెలిపారు. సాహిత్యంలోను, లలిత కళలలోను నిపుణులు తమ నైపుణ్యంతోను ప్రజాదరంతో గౌరవం పొందాలి గాని ప్రభుత్వ పోషణతో గాదని ఆయన అన్నారు. సాహిత్యాన్ని, లలితకళలను ప్రోత్సహించడానికి ప్రభుత్వం నూతన విధానాన్ని రూపొందిస్తుందని ఆయన తెలిపారు. ఆస్థానకవి డాక్టర్ దాశరథి కృష్ణమాచార్యులు, విధానపరిషత్తు సభ్యుడు, మాజీ మంత్రి శ్రీ కేశవరావు మరికొందరు ఆస్థాన విద్వాంసులను తొలగించడం అనుచితమని విమర్శించారు. పాశ్చాత్య దేశాలలోని ప్రజాస్వామ్య ప్రభుత్వాలు కూడ ఆస్థాన విద్వాంసులను నియమించాలని వారు సోదాహరణంగా తెలిపారు. కాని



ధర్మపథం

బులుసు వేంకటరమణయ్య

అశక్తుని నిర్వేదం

మానవులలో అనేక రకాల వారుంటారు. కొందరు లాము శ్రమపడుతూనే ఇతరులకు ఉపకారం చేస్తారు : కొందరు ఇతరుల సంగతి పట్టించుకోక కేవలం స్వార్థపరులై తమ సంగతినే చూచుకుంటారు. కొందరికి, ఇతరుల సహాయం చెయ్యాలనే కోరిక వున్నా, సామర్థ్యం, శక్తిలేనందువల్ల పరోపకారం చెయ్యలేరు. కాని "ఇతరులకు ఉపకారం చేయ్యలేకపోయామే" అనే విచారం వారిని బాధిస్తూనే ఉంటుంది. స్వార్థపరులను నిందించినట్లు అట్టివారిని ఎవ్వరూ నిందించరు. అవకాశం ఉన్నప్పుడు అట్టివారు ఉపకారం చెయ్యగలరనే నమ్మిక ఉంటుంది.

కోరిక వున్నా– పరోపకారం చెయ్యలేని ఒక "అశక్తుని నిర్వేదాన్ని" వివరించే సంకల్పంతో అన్యాపదేశంగా – ఒక బూరుగు చెట్టు వృత్తాంతాన్ని వివరిస్తూ ఒక మహాకవి చెప్పిన శ్లోకం ఎంతో రమణీయంగా కానవస్తుంది.

"కస్త్వం భోః, కథయామి దైవహతకం
మాం విద్ధి శాఖోటకం
వైరాగ్యా దివ వక్షి; సాధు విదితం;
కస్మాదిదం; కధ్యతే
వామే న్యాత్ర వటః తమధ్వగజనః
సర్వాత్మనా సేవతే
నచ్ఛాయాపి పరోపకార కరిణీ
మార్గ స్థితస్యాపి మే."

ఇది ప్రశ్నోత్తర రూపాలలో ఉన్నది. "నీవెవ్వగవు ?" అని ప్రశ్న. "నేను దురదృష్టవంతుడనైన బూరుగు చెట్టును" అని జవాబు. "నీ వైరాగ్యానికి కారణమేమి ?" అని ప్రశ్న. "నా వైరాగ్యానికి కారణం చెప్తాను. వినండి – మార్గానికి కొంత దూరంలో మర్రిచెట్టున్నది. నేను మార్గంలోనే ఉన్నాను. దారి బడలిక తీర్చుకోడానికి బాటసారులు, దారిలో ఉన్న నన్ను విడిచి నీడ కోసం దూరంగా ఉన్న మర్రిచెట్టు దగ్గరకే వెళ్లుతున్నారు. వారికి నీడనిచ్చే ఉపకారమయినా చేసే యోగ్యత నాకు లేదు. వ్యర్థమైన నా బ్రతుకు వైరాగ్యాన్ని కలిగిస్తున్నది" అని సమాధానం. "పరోపకారం చెయ్యలేనప్పుడు, ఉపకారం చెయ్యలేకపోయామే!" అనిబాధపడడం ఉత్తముని లక్షణం. ★

ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి. రామారావు నెల్రకిందటే నగరంలోని ఆస్థాన విద్వాంసులను పిలిపించి పొదుపు దృష్ట్యా వారు తమ సౌకర్యాలను తగ్గించుకొని గౌరవ పదవులను నిర్వహించాలని కోరినట్లు, దానికి ఆస్థాన విద్వాంసులు అంగీకరించనట్లు తెలిసింది. దానిమీద చర్చలు జరిగాయట. కొందరు ఈ నియామకం రాజకీయ దృష్టితో జరిగిందని విమర్శించారట. శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి వంటి కవి, రాయప్రోలు సుబ్బారావువంటి జ్ఞాన వయోవృద్ధులు, నవ్య కవితా ప్రవర్తకులు వుండగా శ్రీ దాశరధిని శ్రీ జలగం ంగళరావు ఆస్థానకవిగా నియమించడంలోని ఔచిత్యాన్ని శంకించారట. తక్కిన పదవుల విషయంలోనూ ఇలాటి విమర్శలే జరిగాయని తెలిసింది. ఏమైనా, ఆస్థాన విద్వాంసులను తొలగించినందుకు జంట నగరాలలోని సాహిత్య వర్గాలలో సంచలనమేమీ కనిపించలేదు. మొసలి కన్నీరు కార్చినవారుకూడ కానరాలేదు. కొందరైతే "ఉన్నప్పుడే ఏం వెలగబెట్టారు గనుక, పోతే బాధ పడడానికి. పోతే పోయారులేద్దురూ" అన్నారు. గుర్తింపు అనేది ప్రభుత్వంవల్లనేనా? అకాడెమీలవల్లనేనా ? ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ ఏర్పడినప్పుడు కోరాడ రామకృష్ణయ్య గారంతటివారిని నామినేట్ చేయలేదు. మేమంతా ఆశ్చర్యపడ్డాము. రాజధానిలో వెంటతిరిగి దండాలు పెట్టేవారే ఎక్కువమంది కనిపించారు–అన్నారు ఒకరు. "ఈ ఆస్థాన విద్వాంసులు సంవత్సరంపైగా పదవుల్లో వున్నారు గదా! ప్రజలకు ఏందారి చూపారు ? ఏం గొప్ప రచనలు చేశారు. రాష్ట్రానికి కీర్తి తెచ్చేవి ఏం చేశారు ? దేశంలో ఎక్కడ చూచినా అవినీతి ప్రళయతాండవం చేస్తున్నదికదా ! విద్యా ప్రమాణాలు పడిపోయాయిగదా! వాటిని ఖండిస్తూ ఒక్క మాటన్నా అన్నారా ? అంటే తమ పదవులు పోవూ ? అటు కళాసాహిత్యాలకూ, ఇటు ప్రజలకూ వుపయోగంలేని ఈ అజాగళస్తనాలు ఊడితే ఏం ? ఆ వాళ్లకు వచ్చే రెండువేల రూపాయలు పోయాయి అంతే" అన్నారు ఒక ప్రజాసాహిత్యవేత్త

శ్రీ విజయ రామారావు హెచ్చరిక :

నగర నూతన పోలీసు కమిషనర్ శ్రీ కె. విజయ రామారావు ఏప్రిల్ 15న చేసిన హెచ్చరికను ప్రజలు మన్నన చేయాలి. పౌరుల ధన మాన ప్రాణ రక్షణకోసం రాజ్యాంగం పెక్కు హక్కులు ప్రసాదించింది. భారతీయ శిక్షాస్మృతిలోని 103వ సెక్షన్ కింద బందిపోటు దొంగలను, తక్కిన దొంగలను, రాత్రులలో ఇండ్ల తలుపులు బద్దలుకొట్టి దాడి చేసేవారిని ప్రతిఘటించడానికి ప్రజలకు అపరిమితమైన అధికారాలున్నాయి. తమ ఆస్తి పాస్తులను, ప్రాణాలను రక్షించుకొనడంలో ఇలాటివారిని బంధించడానికి, అవసరమైతే
పరచడానికి, ప్రాణాలు తీయడానికికూడ
హక్కుంది. ఈ విషయాలన
రావు ఏప్రిల్ 15న
వివరించారు

వాళ్ల వాచ్చేలోగా వళ్ళు హూనంకావడం, ఇల్లు గుల్లకావడం జరుగుతుంటుంది. కొన్ని సందర్భాలలో బందిపోట్లు పోలీసులు రాలేని పరిస్థితులు కల్పించి దోచుకుంటారు. ఇలాటి సందర్భాలలో ప్రజలు తమంతటతాముగా చొరవ తీసుకొని ధైర్యంతో బందిపోట్లను ఎదిరించాలి. స్వీయరక్షణ చేసుకొనేందుకు అవసరమైన హక్కులను భారత రాజ్యాంగం ప్రసాదించింది." అని ఆయన అన్నారు. ఈ బందిపోట్లకు కూడ పెద్దల అండ వుంటుందనే వదంతులున్నాయి. ప్రజలు వారిని పట్టిచ్చినా, బందిపోట్లు పైవారి చేతి చలవతో విడుదలపొందని ఏర్పాట్లుండాలి. శ్రీ విజయ రామారావు ఉన్నత విద్యావంతులు, ఉత్తమ సంస్కారంగలవారు, సమర్థ పరిపాలకులుగా పేరుపొందినారు. ఆయన అధికార కాలంలోనన్నా జంటనగరాల ప్రజలేకాక ఇతరులూ దొంగలబెడద, బందిపోట్ల ఫోరూ లేక గుండెమీద చేయి వేసుకొని హాయిగా నిద్రించే అవకాశం కలుగగలదని ఆశిస్తా ను.

ఆంధ్రపత్రిక

(విజయవాడ మరియు హైదరాబాద్ నుండి ప్రచురణ)

ప్రకటనల రేట్లు

డిస్ ప్లే : (ఒక కాలంలో కనీసం 5 సెం. మీ.కు ప్రకటన తగ్గకూడదు)

కాజువల్ : (249 కాలం సెం. మీ. వరకు)

విజయవాడ ఎడిషన్	:	1 కాలం సెం. మీ.	రు. 13–00
హైదరాబాద్ ఎడిషన్	:	,,	రు. 7–50
విజయవాడ & హైదరాబాద్ రెండుఎడిషన్లు:		,,	రు. 16–00

కాంట్రాక్టు : 250 కాలం సెం. మీ. అంతకు మించి (ఒక సంవత్సరానికి)

విజయవాడ ఎడిషన్	:	1 కాలం సెం. మీ.	రు. 10–00
హైదరాబాద్ ఎడిషన్	:	,,	రు. 6–50
విజయవాడ & హైదరాబాద్ రెండుఎడిషన్లు:		,,	రు. 14–00
కోర్టు ప్రకటనలు, పబ్లిక్ నోటీసులు, మున్సిపాలిటీలు, పంచాయితీలు ఇతర స్థానిక సంస్థలు, టెండరు నోటీసులు, కంపెనీ ప్రాస్పెక్టసులు, ప్రకటనలు, ఎన్నికల ప్రకటనలు, ట్రేడుమార్కు నోటీసులు మొ.	:	1 కాలం సెం. మీ.	రు. 16–00

సంగ్రహ ప్రకటనలు :

కావలెను, అమ్మకం, వ్యాపారము, కనిపించక పోవడం, తప్పిపోవడం, కలం స్నేహం, వివాహములు మొ.	:	లైను 1కి రు. 6–00 (కనీసం 4 లైన్లు)
వివాహ వేదిక (వధువు / వరుడు కావలెను)		లైను 1కి రు. 3–00 (కనీసం 4 లైన్లు)

బాక్సు నెంబరు కోరినవారికి, సర్వీసు ఛార్జిలు ప్రతి ప్రకటనకు రు. 5–00 అదనం.

ప్రత్యేక ఛార్జీలు :

మొదటి పేజి (కనీసం 15 సెం. మీ. x 2 కాలంలు)	:	100% అదనం
మొదటి పేజీ సోలస్ (కనీసం 15 సెం.మీ. x 3 కాలంలు)	:	150% అదనం
నియమిత పేజి	:	25% అదనం
కాలం పై భాగం	:	25% అదనం
అసాధారణ సైజులోని ప్రకటనలకు	:	15% అదనం
ఇంగ్లీషులో ప్రకటనలు చేయుటకు	:	50% అదనం
రంగులలో ముద్రించుటకు (నలుపు + మరొక రంగు)	:	50% అదనం


ఇయర్ పానెల్సు (సైజు 4.5 సెం.మీ. x 7 సెం.మీ.)

కాజువల్ : రు. 160–00 ప్రతి పానెల్ కు

కాంట్రాక్టు (సం. ...) రు. 140–00 ,,

తే

... గారావు వీధి,



రోహిణి–2 ఉపగ్రహాన్ని తీసుకుని రోదసిలోకి దూసుకు పోతున్న ఎస్.ఎల్.వి.–3 రాకెట్ ని చిత్రంలో చూడవచ్చు

అంతరిక్షంలో రెండవ రోహిణి!

శ్రీహరికోట రాకెట్ ప్రయోగ కేంద్రంనించి ఏప్రిల్ 17న రోహిణి–2 ఉపగ్రహాన్ని తీసుకుని అంతరిక్షంలోకి దూసుకుపోయిన 23 మీటర్ల పొడవుగల అంతరిక్షనౌక ఎస్. ఎల్. వి–3 ప్రయోగించిన 10 నిమిషాలలో నిర్ణీత కక్ష్యలో దాన్ని ప్రవేశపెట్టింది. ప్రయోగ సమయంలో 16.9 టన్నులు బరువు ఉండే ఈ నాలుగు దశల రాకెట్ చివరి దశలో గంటకి 28 వేల కి.మీ. వేగాన్ని అందుకుంటుంది. దీని చివర ఉపగ్రహానికి బదులు బాంబు పెడితే 5 వేల కి. మీ. దూరంలోని లక్ష్యాన్ని భేదించే ఖండాంతర వేధిగా రూపొందుతుంది.

ఈ రాకెట్ లో ఘన ఇంధనాన్ని ఉపయోగించారు. ముందు ముందు ద్రవ ఇంధనంతో మూడు దశలలోనే అంతరిక్షంలోని భూకక్ష్యలో ఉపగ్రహాన్ని ప్రవేశపెట్టగల రాకెట్లని రూపొందిస్తారు.

రోహిణి –2 లో 'స్మార్ట్ సెన్సర్' అనే అత్యంతాధునికమైన కెమేరా నిగూఢమైన ఎన్నో విషయాలకి సంబంధించిన వివరాలని అందజేస్తుంది 41 5 కిలోల బరువు గల ఈ ఉపగ్రహం 99 నిమిషాలకోసారి భూప్రదక్షిణ చేస్తూ రెండు మూడేళ్లపాటు అంతరిక్షంలో పరిభ్రమిస్తూ అమూల్యమైన సమాచారాన్ని సేకరించి మనకి అందజేస్తుంది ★

Printed and Published by
...wara Rao at the Andhra
...ss Mallikarjuna Rao
...agar, Vijayawada-3
...dhakrishna.




కోల్గేట్ తాలూకు నమ్మకమైన ఫార్ములా మీ నోటి శ్వాస శుభ్రంగా, తాజాగా వుండేలా చేస్తుంది...
మీ పళ్లు ఆరోగ్యంగా, దృఢంగా వుండేలా చేస్తుంది.


ఎలాగో చూడండి:



మీ పళ్లలో ఇరుక్కుపోయిన ఆహారపు తునకల్లో దుర్వాసన, దంతక్షయం కలిగించే సూక్ష్మజీవులు పెరుగుతాయి.



కోల్గేట్‌లోని అద్వితీయమైన శక్తి గల నురుగు లోతుగా చొచ్చుకుపోయి, హానికరమైన ఆహారపు తునకలనీ, సూక్ష్మజీవులనీ తొలగిస్తుంది.



ఫలితం: ఆత్మవిశ్వాసాన్నిచ్చే తాజా శ్వాస, దంతక్షయం నుంచి రక్షణ, ఆరోగ్యమైన గట్టి పళ్లు.

గుర్తుంచుకోండి, ప్రతిసారీ భోజనం కాగానే కోల్గేట్ డెంటల్ క్రీమ్‌తో పళ్లు బ్రష్ చేసుకోండి. నోటి దుర్వాసన పోగొట్టుకోండి...దంతక్షయాన్ని ఎదుర్కోండి.

దీని తాజా పిప్పరమెంట్ రుచి మీ కెంతో నచ్చుతుంది!

ప్రశాంతమైన మధ్యాహ్నం
జతలో ఓ మంచి నేస్తం
ఆడటానికి చదరంగం



కావాలి నాకిపుడు టోస్టెడ్ పొగాకు కమ్మదనం



టోస్టెడ్ రుచి ఇపుడు మరింత
మృదువు. నాకలాగే ఇష్టం మరి!

ప్రపంచమంతటా లక్షలాది మంది
ఆనందించే టోస్టెడ్ పొగాకు కమ్మని రుచిని
మీరుకూడా ఆస్వాదించండి. ఇప్పుడు ఘాటు
లేకుండా మరింత మృదువుగా చేయబడి మీ పొగ-త్రాగే
ఆనందం కోసం చార్‌మినార్ ఫిల్టర్‌లో మేళవించబడింది.

చార్‌మినార్ ఫిల్టర్

CHARMINAR
FILTER

చట్టబద్ధమైన హెచ్చరిక: సిగరెట్ త్రాగడం ఆరోగ్యానికి హానికరం
STATUTORY WARNING CIGARETTE SMOKING IS INJURIOUS TO HEALTH

Contract-CF-621 TI